# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 27 మార్చి 2025 | సంపుటి: 9 | సంచిక: 90 | పేజీలు:12 | వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


### శ్రీరామనవమికి పంబన్ బ్రిడ్జి ప్రారంభం



2

### వందేండ్ల ప్రశ్నకు జవాబు చెప్పిన బ్రిలియంట్ గర్ల్



భారత సంతతి అమ్మాయి చేసిన అద్భుతం

2

## అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు

# అమానవీయం

**అత్యాచార నేరంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి నిందితులకు అనుకూలంగా తీర్పు చెప్పిన న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు సీరియస్**



ఢిల్లీః మహిళ దుస్తులను పట్టుకొని లాగటం, వక్షోజాలను తాకడం అత్యాచార నేరం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం విదితమే. దీనిపై కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, న్యాయనిపుణులు, పలువురు తీవ్రంగా స్పందిస్తున్నారు. దీనితో సుప్రీంకోర్టు దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఆ న్యాయమూర్తి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించిన జస్టిస్ బి.ఆర్.గవాయ్,

...మిగతా 2లో

# ఆన్‌లైన్ బెట్టింగ్ కట్టడికి సిట్

## శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడలే



- ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి పెట్టుబడులు రాకుండా చేయాలని చూస్తుండ్రు
- రాష్ట్రం దివాలా తీస్తే బీఆర్ఎస్ నేతలకు సంతోషమైతది
- వారు కోరుకున్నంత మాత్రాన ఎన్నికలు ఇప్పడే రావు
- పద్మారావే కాదు, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ నా దగ్గరికొచ్చినా స్వాగతిస్తా
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మనం బ్యూరోః ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, వీటి నిరోధానికి స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీం (సిట్)ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ ప్రచారం కల్పించిన వారిని విచారించాం.ప్రచారం కల్పించిన వారిని విచారించడంతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించినట్టు కాదు, సిట్ ఏర్పాటు చేసి వీటికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏరకంగా పాత్ర ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడ్డామని కొందరు విమర్శిస్తున్నామనీ, దీనిపై ఎక్కడా రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో ఎంత ఉదాసీనంగా వ్యవహరించిందో

...మిగతా 2లో

### విద్యా ప్రమాణాలు రోజురోజుకూ క్షీణిస్తున్నయ్

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కొరవడుతున్నయ్

- రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి ఆవేదనాభరితం
- మెరుగుదలకు ప్రభుత్వమే కాదు, సమాజమూ బాధ్యత తీసుకోవాలి
- ఇంగ్లీష్ పరిజ్ఞానంలో 36వ స్థానంలో ఉన్నం
- బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమిస్తూ రూ.23,108 కోట్లు కేటాయించినం

శాసనమండలిలో విద్యాశాఖపై సీఎం

2

### గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టం చేయొచ్చు

కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



2

### ఉప ఎన్నికలొచ్చే అవకాశమే లేదు

తెలంగాణలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను మంత్రులను చేసిందనీ, అయినా అప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని ప్రశ్నించారు. సభ్యులెవరూ

...మిగతా 2లో

# సభలో నన్ను మాట్లాడనిస్తలేరు

## లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



ఢిల్లీ, మార్చి 26ః లోక్ సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సభా కార్యకలాపాలు నడిపించే తీరు ఇది కాదని ఆయన అన్నారు. మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్ సభ వాయిదా

...మిగతా 2లో

### సగం రోజులు సెలవులే!

ఏప్రిల్‌లో 13 రోజులు బ్యాంకులు పనిచేయవు




2

### ఎంఎంటీఎస్‌లో పానిక్ మోడ్ బటన్

- అత్యవసర పరిస్థితుల్లో బటన్ నొక్కితే రైల్వే పోలీసులకు సమాచారమిస్తుంది
- మహిళల భద్రత విషయంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం



హైదరాబాద్, మనం ప్రతినిధిః హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైలు ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో యువతిపై ఓ ఆగంతకుడు అత్యాచారం చేయబోగా అతని నుంచి తప్పించుకునే క్రమంలో

...మిగతా 2లో

### మధ్యాహ్నం బైటికి రాకండి

ఎండ మాడుస్తుంది.. జాగ్రత్త.. చర్యలు చేపట్టండి



హైదరాబాద్, మార్చి 26ః అత్యవసరమైతే బయటకు రావాలని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయట తిరగొద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. దాహంగా

...మిగతా 2లో

### కూలిన ఆరు అంతస్తుల నిర్మాణం ఆరుగురు మృతి



7

### పార్టీలోనే నాకు వెన్నుపోటు దారులున్నారు

నేను జైలుకు వెళ్లినప్పుడు పోలీసులను ప్రోత్సహించిండ్రు

గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్, మనం బ్యూరోః బీజేపీలో ఇటీవల సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీలోనే తనను ఎప్పుడు వెన్నుపోటు పొడుద్దామా అని ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీజేపీలోనే తనకు వెన్నుపోటుదారులు ఉన్నారంటూ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం తనపై పీడీ యాక్టు పెట్టి

...మిగతా 2లో

# ధరణిపై దద్దరిల్లిన అసెంబ్లీ

- 'ధరణి' వల్లే మిమ్మల్ని ఓడగొట్టిండ్రు : డిప్యూటీ సీఎం
- కాంగ్రెస్ తెస్తున్నది భూ భారతి కాదు, భూ హారతి : రాజేశ్వర్ రెడ్డి
- వచ్చే ఎన్నికల్లో భూ భారతితోనే ప్రజల్లోకి పోతం : మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మనం బ్యూరోః తెలంగాణ అసెంబ్లీలో భూ భారతిపై వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదు...భూ హారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అనీ, ధరణిపై కోపంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ను గద్దె దించారని వ్యాఖ్యానించారు. ముందుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూ భారతి లోపభూయిష్టంగా ఉందని విమర్శించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందనీ, ఇప్పుడు జమాబందీ ఎందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పల్లా ఆరోపణలపై డిప్యూటీ సీఎం భట్టి స్పందిస్తూ పల్లా సత్యదూరమైన


...మిగతా 2లో

### రుజువు చేయండి లేదంటే క్షమాపణ చెప్పండి

కేటీఆర్ వ్యాఖ్యలపై భట్టి సహా కాంగ్రెస్ సభ్యుల ఆగ్రహం

బీఆర్ఎస్ నేత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించిన స్పీకర్

2



### డిమాండ్ ఎంతున్నా క్వాలిటీ కరెంటే ఇస్తున్నం

హైదరాబాద్, మనం బ్యూరోః తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతున్నదని, ఊహించని రీతిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ అవసరాలను తీర్చడానికి ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు సంస్కరణలు చేపట్టి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని నాణ్యమైన విద్యుత్తును

...మిగతా 2లో



2

### వర్సిటీల నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీయూఈడబ్ల్యూయూ గౌరవ అధ్యక్షుడు జే.వెంకటేష్



# అమ్మా నన్ను మళ్లీ నీ పొట్టలో పెట్టి తెల్లగా పుట్టించమ్మా..

**నాలుగేళ్ల చిన్నారి ఈ ఆవేదన.. ఆమె వయస్సు, హోదాతో పెరుగుతూ వస్తోండడమే పెద్ద విషాదం**

**ఒక రాష్ట్రానికి పాలనాధికారి అయినా తప్పని వేదన**

**వర్ణ వివక్షపై కేరళ సీఎస్ బహిరంగలేఖ**

తిరువనంత పురంః రంగులో ఏముంది.. గుణం ముఖ్యమంటారు పెద్దలు. ఆ మాట మనసులో పెట్టుకొని ఉన్నతస్థానాన్ని అధిరోహించారామె. చీఫ్ సెక్రటరీ అయినా ఆమె శరీర రంగు గురించి అన్న మాటలు మాత్రం వెంటాడాయి. చివరకు తన భర్త రంగుతోనూ పోలిక తెస్తూ చేసిన పోస్టులు కంటపడ్డాయి. వీటికి ఆమె బదులు ఇవ్వాలనుకున్నారు. ఈ క్రమంలో ఉద్వేగపూరితంగా

...మిగతా 2లో

కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్ పెట్టిన పోస్టు బాగా వైరల్ అవుతున్నది. దేశంలో వర్ణ వివక్షపై మరో సారి చర్చలకు కారణమైంది. రాష్ట్రంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న ఐఏఎస్ అధికారికి కూడా వివక్ష ఎదురవడమనేది ఎన్నో ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. ఆమె పోస్టులోని పూర్తి పాఠం..

### 'రా'పై అమెరికా ఆంక్షలు?

**భారత నిఘా సంస్థపై ఆరోపణలు**




ఢిల్లీ, మార్చి 26ః భారత దేశానికి చెందిన నిఘా సంస్థ 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)' పై అమెరికా ఆంక్షలు విధిస్తోందా? అంటే అవుననే.. రీతిలో కొన్ని పరిణామాలు చోటు చేసుకుంటున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. 'యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడమ్' అనే అమెరికా సంస్థ 'రా'పై ఆంక్షలు విధించాలని అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సిక్కు వేర్పాటువాదుల హత్యకు కుట్ర పన్నినట్లు

...మిగతా 2లో



# అమ్మా.. నన్ను మళ్లీ నీ పొట్టలో పెట్టి తెల్లగా పుట్టించమ్మా

(మొదటి పేజీ తరువాయి)

ఫేస్‌బుక్ లో ఓ పోస్టు పెట్టారు. ఆమే కేరళ చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్.

1990 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి. కొద్దినెలల క్రితమే కేరళ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. తన భర్త తర్వాత ఆ స్థానంలో శారద నియమితులవడం విశేషం. వారిద్దరిని గమనించిన పలువురు రంగు గురించి చేసిన కామెంట్లు ఆమె దృష్టికి వచ్చాయి. ''నా రంగును నేను అంగీకరించాల్సి ఉంది. ఈ క్రమంలోనే నేను ఒక పోస్టు చేశాను. ఆ తర్వాత వచ్చిన కామెంట్లతో కాస్త కంగారుకు గురై.. దానిని తొలగించాను. అయితే నేను పేర్కొన్న అంశాలు చర్చించాల్సినవేనని నా శ్రేయాభిలాషులు చెప్పడంతో మళ్లీ తిరిగి షేర్ చేశాను'' అని తాను డిలీట్ చేసిన మాటలను తిరిగి పంచుకున్నారు.

''ఒక సీనియర్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అంతకుముందు ఆ స్థానంలో ఉన్న భర్తతో పోలికలు తీసుకొచ్చారు. అదేదో సిగ్గుపడాల్సిన విషయం అన్నట్టు.. అది అసలు మంచి కాదన్నట్టు.. నా రంగు గురించి మాట్లాడారు. కానీ నలుపును ఎందుకు అవమానించాలి. అది విశ్వమంతా వ్యాపించి ఉన్న సత్యం. వర్షానికి ముందు కనిపించే వాగ్దానం. సాయంత్రానికి సూచిక.. అసలు అది లేనిదెక్కడ'' అంటూ రాసుకొచ్చారు. అలాగే చిన్నతనంలో తాను ఎదుర్కొన్న అనుభవాన్ని వివరించారు. ''ఈ రంగు చిన్నప్పుడే నేను పెద్ద మాటలు పలికేలా చేసింది. మళ్లీ నన్ను తన గర్భంలోకి తీసుకెళ్లి తెల్లగా, అందంగా తీసుకురాగలవా అని నాలుగు సంవత్సరాల వయసులో నేను నా తల్లిని అడిగేంతలా. ఆ రంగు ప్రభావం నాపై 50 ఏళ్లపాటు కొనసాగింది. నలుపునకు విలువ లేదనే భావనలో తెలుపు పట్ల ఆకర్షితురాలినయ్యా. దానివల్ల నేను తక్కువ వ్యక్తిగా భావించా. కానీ నా పిల్లలు ఆ వర్ణం అద్భుతమని, అందమైనదని నేను గుర్తించేలా చేశారు'' అంటూ వివరించారు. వ్యక్తిగతంగా తనకు ఎదురైన అనుభవాలను ఇలా బహిరంగంగా పంచుకోవడం పట్ల శారదను అంతా అభినందిస్తున్నారు. కేరళలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ స్పందిస్తూ.. ''ఆమె వెలిబుచ్చిన ప్రతిమాట హృదయాన్ని తాకింది. నా తల్లి కూడా నల్లటి ఛాయను కలిగిఉండేది. ఇది చర్చించాల్సిన అంశం'' అని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇక శారద విషయానికొస్తే.. ఆమె గతంలో పలు కీలక హోదాల్లో విధులు నిర్వర్తించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్గా, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్లో సీఓఓగా, కుడుంబశ్రీ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా పనిచేశారు. కేరళ చరిత్రలో తొలిసారి భర్త నుంచి ఆమె చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఆ నియామకం అందరి దృష్టిని ఆకర్షించింది.

# రుజువు చేయండి లేదంటే క్షమాపణ చెప్పండి

హైదరాబాద్, మనం బ్యూరో: అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య కమీషన్ల లొల్లి నడిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చే విషయంలో ప్రభుత్వం, మంత్రులు సమన్వయంతో వ్యవహరించాలనీ, ఓపికతో ఉండాలని సూచించారు. ప్రభుత్వం పదేపదే ప్రతిపక్ష సభ్యులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదంటూ పనులు కావాలంటే కాంగ్రెస్ నేతలు 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోందని మేం ప్రభుత్వంపై ఆరోపణలు చేయలేమా అని వ్యాఖ్యానించారు. దీంతో కేటీఆర్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు ఒక్కసారిగా లేచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనలతో సభలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కేటీఆర్ చేసిన కమీషన్ల వ్యాఖ్యలను నిరూపించాలని భట్టి సవాల్ చేశారు. మీరు పనుల కోసం ఎవరికైనా కమీషన్లు ఇచ్చారా? లేదా ఎవరైనా ఇస్తుంటే చూశారా? అని నిలదీశారు. కేటీఆర్ సభలో చేసిన ఆరోపణలు రుజువు చేయాలని లేదంటే సభను, ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మైకు ఉంది కదాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదనీ, కేటీఆర్ గౌరవంగా మాట్లాడతారని భావించామనీ, ఆయన సభనే కాదు రాష్ట్రాన్నే తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రూ.40 వేల కోట్ల పనులు చేయించి బిల్లులు లేకుండా లక్ష కోట్లు మాపై రుద్దిన మీకు కమీషన్లపై మాట్లాడే అర్హత లేదంటూ మండిపడ్డారు. దీంతో కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఆ తరువాత బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద నిరసనకు దిగారు. 20, 30 శాతం ప్రభుత్వమంటూ నినాదాలు చేశారు.

## రామనవమికి పంబన్ బ్రిడ్జి ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అధునాతన ఇంజనీరింగ్ అద్భుతంగా నిర్మించిన కొత్త పంబన్ బ్రిడ్జి శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీన ప్రారంభం కానున్నది. ప్రధాని మోడీ రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం వంతెనకు ప్రారంభోత్సవం చేస్తారు.

తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్ లో నిర్మించిని తొలి రైల్వే బ్రిడ్జి ఇదే. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇందంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫొటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు. భారీ ఓడలు వచ్చినప్పుడు వంతెన మధ్యలో తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు.

# ధరణిపై దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నే వాడిదే భూమి అనేది సాయుధ పోరాట నినాదం. ఆ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూమిపై హక్కులు కల్పిస్తూ వస్తోందన్నారు. ఒక్క కలం పోటుతో భూమిపై పేద ప్రజలకు హక్కులు లేకుండా చేశారనీ, దుర్మార్గమైన ఆ చట్టాన్ని తాము అధికారంలోకి రాగానే బంగాళాఖాతంలో వేస్తామనీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెప్పినట్లు చేశామన్నారు. అనేక చట్టాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కుల్ని గతంలో కాలరాశారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్కమార్క స్పష్టం చేశారు.

**వచ్చే ఎన్నికల్లో భూ భారతిపైనే : మంత్రి పొంగులేటి**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతిపైనే ప్రజల్లోకి వెళతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అసత్యాన్ని సత్యం చేసేందుకు బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏ విధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసని పేర్కొన్నారు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# 'రా'పై అమెరికా ఆంక్షలు?

(మొదటి పేజీ తరువాయి)

'రా'పై ఆరోపణలు రావడమే దీనికి కారణమని ఆ దేశానికి చెందిన ఒక ఆంగ్ల వార్తా సంస్థ ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఈ కమిషన్ వార్షిక నివేదికను మంగళవారం విడుదల చేసింది. దీనిలో భారత్ పై పలు ఆరోపణలు చేసింది. భారత దేశంలో మైనార్టీలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. మత స్వేచ్ఛ విషయంలో ఆందోళనకర దేశంగా భారత్ ను ప్రకటించాలని సూచించింది. 2024లో కూడా భారత్ లో మతపరమైన మైనార్టీలపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని వెల్లడించింది. ఈ నివేదికపై భారత్ తక్షణమే స్పందించలేదు.

చైనాను కట్టడి చేసే క్రమంలో అమెరికా పాలకులు భారత్, వియత్నాంతో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. బీజింగ్ ను కట్టడి చేయడానికి న్యూఢిల్లీ బలమైన శక్తి అని అమెరికా కొన్నేళ్లుగా భావిస్తోంది. ఈనేపథ్యంలో ట్రంప్ కార్యవర్గం భారత నిఘా సంస్థ 'రా'పై ఎటువంటి చర్యలు చేపట్టకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

2023లో అమెరికా, కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత్ లక్ష్యంగా చేసుకొంటోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్ పై అమెరికా ఆరోపణలు మోపింది. ఖలిస్థానీ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్లు దానిలో పేర్కొంది. మరోవైపు అమెరికాలో ఉంటూనే పన్నూ భారత ప్రభుత్వానికి బెదిరింపు సందేశాలను విడుదల చేస్తుండటం విశేషం. సీఆర్పీఎఫ్ స్కూళ్లను, ఎయిర్ ఇండియా విమానాలను, కుంభమేళాను లక్ష్యంగా చేసుకోవాలని ఖలిస్థానీలకు అతడు పలుమార్లు నూరి పోస్తుండడం గమనార్హం.

# సభలో నన్ను మాట్లాడనిస్తలేరు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించట్లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా.. కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం'' అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలను సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్ (సభలో సభ్యులు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళిని సూచించే నిబంధన) ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.

# సగం రోజులు సెలవులే!

హైదరాబాద్, మనం ప్రతినిధి: మార్చి నెల ముగింపుకు చేరుకుని ఏప్రిల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఏప్రిల్ కు సంబంధించిన బ్యాంకు సెలవులను ప్రకటించింది. వివిధ పండుగలు, 2వ, 4వ శనివారాలు, ఆదివారాలు కలిసి ఆ నెలలో మొత్తం 13 రోజులు సెలవులున్నాయి.

**సెలవుల వివరాలు**

**ఏప్రిల్ 6 : ఆదివారం - శ్రీరామనవమి**
**ఏప్రిల్ 10: గురువారం -మహావీర్ జయంతి**
**ఏప్రిల్ 12: రెండో శనివారం**
**ఏప్రిల్ 13: ఆదివారం**
**ఏప్రిల్ 14: బీఆర్ అంబేద్కర్ జయంతి**
**ఏప్రిల్ 15, 16 : బోహగ్ బిహు పండుగ సందర్భంగా అగర్తల, గౌహతి, ఇటానగర్, కోల్కతా, సిమ్లాలో బ్యాంకులకు సెలవు**
**ఏప్రిల్ 20: ఆదివారం**
**ఏప్రిల్ 21: గరియా పూజ సందర్భంగా అగర్తలాలో బ్యాంకులకు సెలవు**
**ఏప్రిల్ 26: నాలుగో శనివారం**
**ఏప్రిల్ 27: ఆదివారం**
**ఏప్రిల్ 29: పరుశురామ జయంతి**
**ఏప్రిల్ 30: బసవ జయంతి, అక్షయ తృతీయ సందర్భంగా బెంగళూరులో బ్యాంకులకు సెలవు**

## వందేండ్ల ప్రశ్నకు జవాబు చెప్పిన బ్రిలియంట్ గర్ల్

న్యూయార్క్ : గణిత శాస్త్రంలో గత వందేళ్లుగా ఓ ప్రశ్న పరిష్కారం లేకుండా ఉండిపోయింది. పెద్ద పెద్ద శాస్త్రవేత్తలు సైతం దాన్ని సాల్వ్ చేసేందుకు ప్రయత్నించి విఫలయ్యారు. కానీ, తాజాగా భారత సంతతికి చెందిన ఓ అమ్మాయి ఆ ప్రశ్నను పరిష్కారించి.. బ్రిలియంట్ లేడీ అనిపించుకుంది. మరీ వందేళ్లుగా సాల్వ్ కానీ ఆ మ్యాథ్స్ ప్రాబ్లమ్ ఏంటి? సాల్వ్ చేసిన అమ్మాయి ఎవరు? ఇక్కడ తెలుసుకుందాం. భారత సంతతికి చెందిన దివ్య త్యాగి అనే అమ్మాయి అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్లో మాస్టర్స్ చదువుతుంది. ఓ వైపు చదువు కొనసాగిస్తునే మరోవైపు ఆయా అంశాలపై పరిశోధనలూ నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే 'కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్'లో కటింగ్ ఎడ్జ్ సాంకేతికతతో పలు ప్రయోగాలు చేస్తోంది. అయితే, పవన విద్యుత్ రంగంలో ఉపయోగించే గాలి మరల అంశంపై బ్రిటిష్ శాస్త్రవేత్త హెర్మన్ గ్లాయెర్ట్ 1926లో పలు పరిశోధనలు చేశారు. ఈ క్రమంలోనే ఆయన ఓ నమూనాను సైతం రూపొందించారు.

# అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు అమానవీయం

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం వాటిపై విచారం వ్యక్తం చేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. ఆ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

**అసలేమిటీ వివాదం..**

2021 నవంబరులో యూపీలోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన 11 ఏళ్ల కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారిని సమీపించి బాలికను ఇంటి దగ్గర దింపుతామని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో అమ్మాయిని అసభ్యంగా తాకుతూ కల్వర్టు కిందకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు బాలికను అక్కడే వదిలి పరారయ్యారు. ఈ కేసుపై మార్చి 17న విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ తీర్పు వివాదాస్పదమైంది. న్యాయమూర్తి వ్యాఖ్యలు న్యాయస్థానాలపై గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తమైంది. అటు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి దీనిపై స్పందిస్తూ.. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపింది.

# వర్సిటీల నాన్ టీచింగ్

కవాడిగూడ, మనం న్యూస్: నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జే.వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్‌స్కేల్, డైలీవైజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ సిబ్బందిగా మార్పుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని, పనిభారం తగ్గించాలన్న డిమాండ్ల సాధన కోసం తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జే.వెంకటేష్ మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలలో ఈపీఎఫ్ అమలు కావడం లేదని, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఐఆర్ ఐదు శాతం అన్ని యూనివర్సిటీలలో అమలు జరిగే విధంగా చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ ఉద్యోగులుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలోని నాన్ టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర కేడర్లకు రెగ్యులర్ ఉద్యోగుల మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలని.. అప్పటి లోగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల జీవో 60 ప్రకారం కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. జీవో 16 ప్రకారం యూనివర్సిటీలలో ఖాళీల ఆధారంగా టైమ్‌స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యా ప్రమాణాలు రోజు రోజుకూ క్షీణిస్తున్నయ్

హైదరాబాద్, మనం బ్యూరో: రాష్ట్రంలో ప్రతిష్ఠాయిలో విద్యా రంగం రోజురోజుకూ క్షీణిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం సీఎం రేవంత్ శాసనమండలిలో విద్యా శాఖపై మాట్లాడుతూ 2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 75 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపడం లేదు. తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్య పుస్తకాలు కూడా చదవలేని దుస్థితి. ప్రతీ స్థాయిలో విద్యారంగం రోజురోజుకూ క్షీణించి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 11 వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం. 21 వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించాం.

## ఎంఎంటీఎస్‌లో పానిక్ మోడ్ బటన్

(మొదటి పేజీ తరువాయి)

రైలు నుంచి ఓ యువతి బయటకు దూకేసిన ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఈ ఘటనను దక్షిణ మధ్య రైల్వే తీవ్రంగా పరిగణించింది. మహిళల భద్రత విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళలకు అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించే విధంగా రైళ్లలో పానిక్ మోడ్ బటన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# మధ్యాహ్నం బైటికి రాకండి

(మొదటి పేజీ తరువాయి)

లేకపోయిన తగినంత నీళ్లు తాగాలని, ఇంట్లో తయారు చేసిన లెమన్ వాటర్, మజ్జిగ, పళ్ల రసాలు సేవించాలని, బయటకు వెళ్లేటప్పుడు వాటర్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. సీజనల్ పళ్లను, కూరగాయలను ముఖ్యంగా నీటి శాతం ఎక్కువగా ఉండే వాటర్ మిలన్, మస్క్ మిలన్, సంత్రాలు, గ్రేప్స్, ఫైనాపిల్, కీరదోస వంటివి ఎక్కువ తీసుకోవాలని పేర్కొన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, క్యాప్, టవల్ వంటివి తలకు ఎండ తగలకుండా చుట్టుకోవాలని, అలాగే ఎండ వేడిని తట్టుకునేలా లేత రంగు కాటన్ దుస్తులనే ధరించాలని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు షూస్, చెప్పులు తప్పకుండా ధరించాలన్నారు. అవసరమైతేనే బయటకు రావాలని, ఇంట్లో ఉన్నప్పుడు పగటి వేళ డోర్లు కిటికీలు తెరిచిఉంచొద్దని, ఎండ లేని టైంలో వెంటిలేషన్ తెరిచిపెట్టుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వంటగదిలో వెంటిలేషన్ ధారాళంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొంది. బయటకెళ్లే పనులు ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పెట్టుకోవాలని సూచించారు.

**అప్రమత్తంగా ఉండాలి..**

మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు బయట రాకూడదని, ఆల్కహాల్, టీ, కాఫీ, సాఫ్ట్ డ్రింక్స్, షుగర్ ఎక్కువ ఉండే పదార్థాలతో పాటు, హై ప్రోటీన్, మసాలా, నూనె పదార్థాలు తినకూడదని తెలిపారు. వాంతులు, చర్మం ఎర్రగా మారడం, తలనొప్పి, గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## డిమాండ్ ఎంతున్నా క్వాలిటీ కరెంటే ఇస్తున్నం

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో విద్యుత్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. 2021 నాటికి 13668 మెగావాట్ల పిక్ డిమాండ్ ఉండగా 2021-22 నాటికి 14160 మెగావాట్ల పీక్ డిమాండ్ కు చేరుకున్నదన్నారు. 2022-23 నాటికి 15,497 మెగావాట్ల పిక్ డిమాండ్ కు పెరిగింది.ఈ సంవత్సరం మార్చి నెలలో 17,162 మెగావాట్ల పిక్ డిమాండ్ కు పెరిగినప్పటికీ ముందస్తుగా తీసుకున్న చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే, సంస్కరణల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా, కరెంటు ట్రిప్పు కాకుండా, కరెంటు కట్ లేకుండా, నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఆయన చెప్పారు. 2029-30 నాటికి గరిష్ట డిమాండ్ 24,215 మెగావాట్లు, 2034-35 నాటికి 31,809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉంటుందని కేంద్రం నుంచి వచ్చిన అంచనాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్కంల బలోపేతానికి అనేక కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కట్టడికి సిట్ ఏర్పాటు చేస్తం

(మొదటి పేజీ తరువాయి)

తెలుసు, దిశ ఘటన, న్యాయవాద దంపతుల హత్య వంటి ఘటనల్లో బాధ్యులపై గత ప్రభుత్వం చర్యలు తీసుకుందా? సింగరేణి కాలనీలో ఆరేళ్ల బాలిక హత్యాచార ఘటనలో దోషులపై చర్యలు తీసుకోలేదు, మహిళలపై దాడుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందని గుర్తు చేశారు. శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందని దుష్ప్రచారం చేయడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులను అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కుప్పకూలిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం దివాలా తీస్తే బీఆర్ఎస్ నేతలు సంతోషపడతారా? అధికార కాంక్షతో ఏమైనా చేస్తారా? ఈ 15 నెలల కాలంలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడలేదని సీఎం స్పష్టం చేశారు. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపు నిండా విషం పెట్టుకుని ఎందుకు మాట్లాడుతారు? గతంలో జానారెడ్డి విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ప్రతిపక్ష నేతలు ఎందుకు కొనసాగించరు? ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి. మీరు కోరుకున్నంత మాత్రాన ఇప్పుడే రావని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఇద్దరు పోటీ పడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరితో మాకు తలనొప్పి వస్తోందని సీఎం వ్యాఖ్యానించారు. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటా. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తా. పద్మారావు నా దగ్గరకు వచ్చారు. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. వెంటనే ఆదేశాలు ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నా అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్ పై రాష్ట్రాలు చట్టం చేయొచ్చు

ఢిల్లీ: గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చని బుధవారం కేంద్రం వెల్లడించింది. అవి రాష్ట్ర పరిధిలోని అంశాలని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ లోక్ సభలో వెల్లడించారు. వీటికట్టడి కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం ఆన్ లైన్ గేమింగ్ను నిషేధించిందని, దీనిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం తన నైతిక బాధ్యత నుంచి తప్పించుకుంటుందా? అని మారన్ ప్రశ్నించారు. నిషేధం విధించడానికి ప్రభుత్వానికి ఎంత సమయం కావాలని అడిగారు. ఈ ప్రశ్నకు వైష్ణవ్ సమాధానమిస్తూ.. కేంద్ర ప్రభుత్వ నైతికతను ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఈ అంశంపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు రాజ్యాంగం నైతిక, చట్టబద్ధ అధికారాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. 'దయచేసి సమాఖ్య నిర్మాణాన్ని అర్థం చేసుకోండి' అని మారన్‌కు సూచించారు. రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినా.. తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా 1410 గేమింగ్ సైట్లను ఇప్పటికే నిషేధించామని వైష్ణవ్ వెల్లడించారు. ఇటీవల కేంద్రం ఆన్లైన్ మనీ గేమింగ్ సంస్థలపై కొరడా ఝుళిపించి సంగతి తెలిసిందే. అక్రమంగా నిర్వహిస్తోన్న వందల వెబ్ సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డీజీజీఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్ ఫామ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలని, వాటిని ఎవరూ వాడొద్దని డీజీజీఐ హెచ్చరించింది. 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు ఈ గేమింగ్ సంస్థల ప్రచారంలో పాల్గొంటున్నారని గుర్తించాం. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. వాటికి దూరంగా ఉండాలి. ఆ ప్లాట్‌ఫామ్‌ల వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీయవచ్చు. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి'' అని హెచ్చరించింది.

## ఉప ఎన్నికలొచ్చే అవకాశమే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన చెందొద్దు. ఏ ఉప ఎన్నికలూ రావని తేల్చి చెప్పారు. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు. రాష్ట్ర అభివృద్ధి పైనే ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్షానికి మేం సూచన చేస్తున్నాం మీపై మాకు ద్వేషం లేదు. ప్రజలు మిమ్మల్ని ఎప్పుడో శిక్షించారు. ఇక మీపై మాకు కోపం ఎందుకు ఉంటుంది? ప్రభుత్వానికి సహేతుకమైన సూచనలు సలహాలు ఇవ్వండని సూచించారు. 25 ఏండ్ల క్రితం బిల్లీ రావుకు భూమిని కేటాయించారు. ఆ భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదు. ఇప్పటి వరకు బిల్లీ రావు నుంచి భూమిని వెనక్కి తీసుకోలేదు. ఆ భూమిలో గుంటనక్కలు ఉన్నాయి. ఆ గుంట నక్కలకు తగిన గుణపాఠం చెబుతాం.


## పార్టీలోనే నాకు వెన్నుపోటు దారులున్నారు

(మొదటి పేజీ తరువాయి)

జైలుకు పంపిందనీ, ఆ సమయంలో కొంత మంది బీజేపీ నేతలు పోలీసులకు మద్దతుగా నిలిచారని ఆరోపించారు. నీపై పీడీయాక్టు పెడుతున్నాం మీ బీజేపీ వాళ్లు కూడా ప్రోత్సహించారు అని ఒక పోలీసు అధికారి తనతో చెప్పారని వెల్లడించారు. బీజేపీలో కొంతమంది తనకు ఎప్పుడు వెన్నుపోటు పొడుద్దామా అనే ఆలోచనతో ఉన్నారని చెప్పారు. తనను బీఆర్ఎస్ ప్రభుత్వం జైలులో పెట్టినప్పుడు కార్యకర్తలే తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. పోలీసు శాఖపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్‌పై రాజాసింగ్ మండిపడ్డారు.

# అప్సర హత్య కేసులో పూజారికి జీవిత ఖైదీ

**రంగారెడ్డి, మార్చి 26 (మనం న్యూస్):** హైదరాబాద్ సరూర్ నగర్లో యువతి అప్సర హత్య కేసులో రంగారెడ్డి కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నిందితుడు పూజారి సాయి కృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చింది.వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణ తన భార్య, కూతురితో కలిసి సరూర్ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉండేవాడు. స్థానికంగా మైసమ్మ దేవాలయంలో పూజారిగా పనిచేసేవాడు. పూజారి పనులతో పాటు కాంట్రాక్టర్ గా పని చేసేవాడు. చెన్నై కి చెందిన కురుగంటి అప్సర (30) తన తల్లితో కలిసి ఇదే కాలనీలో నివాసం ఉండేది. అయితే అప్సర పలు సినిమాలు, సీరియల్స్ లలో చిన్న చిన్న పాత్రలలో నటిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేసేది. ఈ క్రమంలో పూజారి సాయికృష్ణ పనిచేసే మైసమ్మ ఆలయానికి అప్సర వస్తుండేది. సాయికృష్ణ, అప్సరల పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది.





దీంతో తనను పెళ్లిచేసుకోవాలని సాయికృష్ణ ను అప్సర ఒత్తిడి చేసేది. ఒత్తిడి తట్టుకోలేక ఎలాగైనా అప్సరను వదిలించుకోవాలని పూజారి సాయికృష్ణ పథగం రచించాడు.2023 జూన్ 3న కోయంబత్తూరు పోదామని చెప్పి అప్సరను కారులో తీసుకుని వెళ్ళాడు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి లోని గోశాల సమీపంలోని సిసి కెమెరాలు లేని ప్రదేశానికి తీసుకెళ్లి అప్పటికే నిద్రపోతున్న అప్సర ముఖంపైన కారుపై కప్పే కవర్ తో ఊపిరి ఆడకుండా చేస్తుండగా అప్సర ప్రతిఘటించింది. వెంట తెచ్చుకున్న బెల్లం కొట్టే రాయితో తలపై కొట్టడంతో.. అక్కడికక్కడే మృతి చెందింది. అప్సర మృతదేహాన్ని కారు బాడీ కవర్ లో చుట్టి డిక్కీలో వేసుకొని తన ఇంటివద్దకు వచ్చాడు. మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో సరూర్నగర్ తహసిల్దార్ కార్యాలయం వెనుక ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్ లో పడేశాడు. అప్సర తల్లి తన కూతురు గురించి ప్రశ్నించగా .. స్నేహితులతో కలిసి భద్రాచలం వెళ్ళిందని తానే శంషాబాద్ లో ఆమె స్నేహితుల కార్ లో ఎక్కించినట్లు నమ్మబలికాడు. తరువాత పలుమార్లు ఫోన్ చేసిన స్పందించలేదని చెప్పాడు. ఏమీ తెలియనట్లు తల్లితో కలిసి శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాయికృష్ణ మాట్లాడే మాట తీరుపై అనుమానం కలిగి పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసుపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా 11వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.జయప్రసాద్ నిందితుడు సాయి కృష్ణకు జీవిత ఖైదు విధించారు. మృతురాలి కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారం అందిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రవికుమార్ తమ వాదనలు వినిపించారు.

# ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లని అర్హులైన పేదలకు ఇవ్వాలి



**రంగారెడ్డి, మార్చి 26 (మనం న్యూస్):** ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లని అర్హులైన పేదలకు ఇవ్వాలి అని సిపిఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎల్బీనగర్ సర్కిల్ ఆఫీసు ముందు అర్హులైన పేదలందరికీ ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్న ఇళ్ల సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని సర్వే చేయించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు దరఖాస్తు చేసుకోమని దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ డబల్ బెడ్రూంలో అందలేదని అని అన్నారు.వనస్థలిపురం నందవనం ప్రాంతంలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తయి ఇప్పటికి ఎవరికి ఇవ్వకుండా కుక్కలు పందులు సంసారం చేస్తున్నాయని అన్నారు. వనస్థలిపురం,నందనవనంలో డబల్ బెడ్ రూమ్ ఖాళీలను గుర్తించి పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు పించనల సమస్యలు విపరీతంగా ఉంది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని స్వయంగా అధికారులే చెప్తున్నారు. ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని గుర్తించి రాబోయే రోజుల్లో భూ పోరాటం చేస్తామని ప్రభుత్వం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కమిటీ సభ్యులు పోట్టేపాక రామస్వామి, కాశయ్య, రాధమ్మ, సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సర్కిల్ సభ్యులు .వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రూ హెల్పింగ్ హాండ్స్ సంస్థకు ప్రతిష్ఠాత్మక అవార్డు




**హైదరాబాద్, మార్చి 26(మనంన్యూస్):** సామాజిక సేవా కార్యక్రమాల్లో దూసుకెళ్తున్న ట్రూ హెల్పింగ్ హాండ్స్ కు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కింది. రక్తదానం విద్య, వైద్యం అన్నదానం ధార్మిక రంగాల్లో సంస్థ చేస్తున్న కృషిని గుర్తించిన ఓకే టీవీ తెలుగు రత్న ఉత్తమ సేవా అవార్డును అందించింది. సంస్థ అధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షులు గోగీక రోహిత్, ప్రధాన కార్యదర్శి మేకల కార్తిక యాదవ్, జాయింట్ సెక్రెటరీ బైకానీ శ్రీశైలం, ట్రెజరర్ ముద్దాపురం అభిజ్ఞ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కంది లోకేష్, వెంకట్రావు, కు అవార్డు అందించి, ఘనంగా సన్మానించింది. ఎన్నో సంవత్సరాలుగా పేద ప్రజలకు సంస్థ తరపున వీలైనంత ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నట్లు శ్రీశైలం యాదవ్ తెలిపారు. అవార్డు అందించిన ఓకే టీవీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవలో మరింత ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

# బోమ్మగాని ధర్మ బిక్షం 14వ వర్ధంతి

**రంగారెడ్డి, మార్చి 26 (మనం న్యూస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు బోమ్మగాని ధర్మ బిక్షం 14వ వర్ధంతి హయత్నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షత వహించగా సీపీఐ ఎల్బీ నగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్ , సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు . నాయకులు మాట్లాడుతూ, 'దున్నేవాడికే భూమి - గీసేవాడికే చెట్టు' నినాదంతో గీత కార్మికుల హక్కుల కోసం పోరాడిన ధర్మ బిక్షం ప్రజల హక్కుల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు అని ప్రశంసించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్ తరాలకు ఆయన ఆచరణ మార్గదర్శకమని తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఏఐటీయూసీ ఎల్బీ నగర్ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ శక్రు నాయక్, బీకేఎస్ మండల కార్యనిర్వాహణ అధ్యక్షుడు మందుల కృష్ణ, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు అలివేణి, శివజ్యోతి, సరిత, సౌజన్య, రాములు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ విద్యాశాఖ మంత్రి ,సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి , పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి.
రంగారెడ్డి మనం న్యూస్)

## యువత బెట్టింగ్ వ్యసనానికి గురి కాకూడదు



**చేవెళ్ల, మార్చి 26(మనం న్యూస్ ):** యువత బెట్టింగ్ వ్యసనానికి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోందని బిజెపి మండల అధ్యక్షుడు అనంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లోన్ యాప్ ల కారణంగా ఎంతో మంది యువత అప్పుల పాలయ్యారు. అప్పుల కారణంగా ఇటీవల యువత ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. క్రికెట్ బెట్టింగ్ జోలికి యువత వెళ్లొద్దు. నేరుగా గాని, ఆన్లైన్లో కానీ బెట్టింగ్ కు పాల్పడడం ప్రభుత్వం నిషేధించింది బెట్టింగ్ కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. బెట్టింగ్ వ్యసనానికి లోనై జీవితాలను పాడు చేసుకోవద్దని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. వ్యసనాలకు లోనైతే వెంటనే అప్రమత్తమై వాటికి దూరం చేయాలన్నారు.

# గుడ్మార్నింగ్ మణికొండలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ



**గండిపేట, మార్చి 26(మనంన్యూస్ ):** గుడ్ మార్నింగ్ మణికొండలో భాగంగా భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం బుధవారం పుప్పాలగూడ పరిధిలోని అంజలీ గార్డెన్, కే.ఎన్.ఆర్ హిల్స్, డైమండ్ హిల్స్ పుర వీదులలో సేకరించారు. రంగా రెడ్డి జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన బుల్కాపూర్ నాల ఖాజాగూడ నుండి మణికొండ మర్రిచెట్టు మీదుగా పంచవటి కాలనీ దాటుకొని శైక్పెట్ నాల ద్వారా హుస్సేన్ సాగర్లో కలసి పోయేదని తెలిపారు. అట్టి మంచి నీటి నాల కాస్త డ్రైనేజీ కాలువగా మారి ఇరువైపులా ఉన్న బఫర్ జోన్ ఫెన్సింగ్ లను సైతం తప్పించి స్థలంను కబ్జా చేసి అంతస్థుల మీద అంతస్తుల ఇండ్లు కట్టుకొని దర్జాగా ఉంటుండగా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు గమ్మున ఉండడం చూసి విడ్డూర పడుతున్నారు. డైమండ్ హిల్స్ కు వెళ్ళే రహదారిలో ఉన్న స్తంభం పూర్తిగా వంగిన విషయం గమనించారు. ఈ విషయమై అధికారులు కలుగ చేసుకొని వెంటనే స్తంభాన్ని సరిచేయ గలరు లేని యెడల రాబోయే కాలంలో పెను ప్రమాదం సంభవించే ఆస్కారం కలదన్నారు. ఎప్పుడో వేసిన కాలనీ లే అవుట్ ల ప్రకారం రహదారులు లేనే లేవని, రహదారులు కాస్త కనుమరుగై చిన్న పాటి రహదారులుగా మారి వాహనాలు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున రోడ్డు వెడల్పు చేయడం లేదా వన్ వే ట్రాఫిక్ పాటించాలని కోరుతు ప్రస్తుతానికి స్పీడ్ బ్రేకర్ లు వేయాలని స్థానిక ప్రజలు తెలియజేశారన్నారు. రాత్రి కాగానే వీధి దీపాలు వెలుగడం లేదని పర్యవసానంగా చీకటిలో ఉంటున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇరుకు సందుల్లో చెత్తను పోగు చేయడమేకాని అట్టి చెత్తను వెను వెంటనే తీసే నాథుడు కరువైనాడని, కుప్పి తొట్టిల్లా వీదు లుంటున్నాయని వాపోతున్నారు. త్రాగడానికి మంచినీరు వేళా పాళా లేకుండా సరఫరా చేస్తున్నారనీ నిర్ణీత సమయంలో సరఫరా చేసి నీటి ఎద్దడి రాకుండా చూడాలని చెప్పారు. పై సమస్యలకు పరిష్కార దిశగా సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాధ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, గోరుకంటి విఠల్, బండమీద మల్లేష్, దిలీప్, కిరణ్ యాలాల, కందాడ ప్రవీణ్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, బాలాజి, తిరుపతి, చందు, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి తది తరులు పాల్గొన్నారు.

# మహిళలు సమాజంలో వారికి ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

**మంచిరాల ప్రతినిధి, మార్చి 26 మనం న్యూస్:** నేటి సమాజంలో మహిళలు వారికి ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భేటి బచావో- భేటి పడావో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ అవగాహన కార్యక్రమనికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు తమకు ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడం వలన మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, ఎక్కువ సమయాన్ని వృధా చేస్తూ సమస్య ఎదురైనప్పుడు ఎవరికి చెప్పుకోకుండా మానసిక ఒత్తిడి గురవడం, తొందరపాటు నిర్ణయాలు తీసుకొని చాలా మంది జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, యోగ, వ్యాయామం వంటివి అలవాటు చేసుకోవాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సహాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్.14416ను సంప్రదించాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, లోకల్ కంప్లయింట్ కమిటీలు ఏర్పాటు చేయడం




జరిగిందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళా ఉద్యోగులు భద్రత కలిగిన వాతావరణంలో పని చేసే విధంగా చట్టాలు తోడ్పడతాయని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళల కోసం మానసిక సమస్యలు, న్యాయ హక్కులకు సంబంధించి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ వంటి కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి విషయమని అన్నారు. మానసిక ఒత్తిడి, ఉపశమనాలకు సంబంధించి ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలపై పెంపొందించుకున్న అవగాహనను మరింత మందికి తెలియజేయాలని, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. మార్పు ప్రతి ఒక్కరి నుండి మొదలవ్వాలని తెలిపారు.మానసిక వైద్య నిపుణులు డ్బా సునీల్ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పి.ఓ.ఎన్.సి.డి. డ్బా ప్రసాద్, మోటివేషనల్ స్పీకర్ మధుకర్, ఐ.సి.డి.ఎస్. సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆర్.పి.లు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ సక్రమంగా నిర్వహించాలి



**కోదాడ,మార్చి 26(మనం న్యూస్):** స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి డీలర్ల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినారు.కావున ప్రతి ఒక్క డీలర్లు సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు చేరవే యడంలో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమం గా పంపిణీ నిర్వహించాలని అన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్ అలీ, సివిల్ సప్లై డిటి రాంరెడ్డి,డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షులు సాగర్ల శివరాం,జిల్లా సెక్రటరీ తీగల అశోక్ కుమార్,ఐదు మండలాల అధ్యక్షులు,సెక్రటరీలు, డీలర్లు పాల్గొన్నారు.

## ఓయూలో వర్గీకరణ సంబరాలు



**హైదరాబాద్, మార్చి 26(మనంన్యూస్):** ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కాలేజ్ లో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్,మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాసింకి మిఠాయి తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 9శాతం మాదిగలకు రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగల తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు అని అన్నారు. దశాబ్దాల తరబడి ఉన్న మాదిగల సమస్యను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరించి మాదిగలకు న్యాయం చేసే విధంగా 9.75శాతం రిజర్వేషన్ కల్పించిన గొప్ప నేత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన సందర్భంగా గ్రామ గ్రామాన మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ల అజయ్, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రింగు రాంబాబు, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జెర్రీపోతుల సాయన్న,రేవంత్, బీఎస్ఎఫ్ ఓయూ నాయకులు మంద మల్లేష్, సందీప్ జూపల్లి, సందీప్, మహేష్, చంద్రకాంత్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

# సర్వమత సమ్మేళనానికి ,మత సామరస్యానికి ప్రతీకలే ఇఫ్తార్ విందులు

- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే
- మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**తుంగతుర్తి, మార్చి 26 (మనం న్యూస్):** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం రాష్ట్ర ప్రభుత్వం తుంగతుర్తి మండల కేంద్రంలోని మజీద్ ఏ నూర్ లో ఏర్పాటు చేసిన దావత్ - ఏ - ఇఫ్తార్ విందులో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి బుధవారం సాయంత్రం ముఖ్య అతిథిగా



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచేదన్నారు ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఆచరించే ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే దావత్ ఏ ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రత్యేకతగా నిలుస్తాయన్నారు.ఆత్మీయత మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. ముస్లింలు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ముస్లింల కోసం మైనారిటీ స్కూళ్ల ను ఏర్పాటు చేసి సొంత రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందన్నారు. అన్ని రంగాల్లో ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనార్టీలకు సముచిత స్థానం, గౌరవం కల్పించిందన్నారు. కొన్ని దశాబ్దాలుగా ముస్లింలు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడుస్తున్నారని తెలిపారు.రంజాన్ పండుగ వారి జీవితాలలో సుఖసంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం, డిప్యూటీ తహసిల్దార్ కంట్లమయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లా డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్ కుమార్, వీరబోయిన గంగరాజు, ఉప్పుల రాంబాబు, కొండా నాగరాజు, కుంచాలప్రవీణ్ రెడ్డి, అశోక్ , నాగరాజు ,సిపిఎం మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, ఉప్పుల శ్రీను,టైగర్ వెంకన్న, నరేష్, మజీద్ ఏ నూర్ అధ్యక్షులు ఉస్మాన్ మత గురువు మూలాల అబ్దుల్ అహ్మద్ ,మైనారిటీ నాయకులు అన్వర్ , అమీర్,మీరాసాబ్, భాష, అల్లిసాబ్,ఎండి జాన్, ఎస్ కె లాలు, మైనారిటీ మైనారిటీ సెల్ అధ్యక్షులు అఫ్జల్,మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్, కరీంబాబా, జానీ, సిద్ధిక్, ఉమర్, ఫయాజ్, ఎస్ కే నజీర్, ఎస్.కె ఫరూక్,జానీ, మన్సూర్ ,సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## జయహో..



ధరిత్రి మురిసిపోయింది
అకుంఠిత దీక్షతో
ఆకాశాన్ని జయించి
చిరునవ్వుతో తిరిగి వచ్చిన
నీ ధీరతను చూసి
ఎంత కష్టమైనా భరించి
గెలిచి నిలిచిపోవాలన్న
నీ సంకల్ప బలం
రేపటి తరాలకు దారి దీపం
కోట్ల విజయాలైనా
ఆకాశలోకంలో తొమ్మిది నెలల
నీ ఆత్మవిశ్వాసపు
జీవనం ముందు బలాదూర్..!
సెల్యూట్ టు యూ
సునీత విలియమ్స్..
చరిత్రలో ఇప్పుడు నీవొక
మహోన్నత అధ్యాయం
రేపటి ఉజ్వలతకు
అసమాన అద్భుతాలకు
నువ్వొక నాందీ గీతం...


- డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

# మొగ్గల్ని చిదిమేస్తున్న ఒత్తిడి



అందమైన బాల్యం, జ్ఞాపకాలను పోగేసుకునే వయసు. ఆ లేత మనసుపై ఒత్తిడి పెరిగితే ఎన్ని అనర్థాలకు దారి తీయిస్తుందో.... పిల్లలంతా ఎప్పుడో ఒకప్పుడు ఒత్తిడికి లోనవ్వటం మామూలే. హోంవర్క్ చేసేటప్పుడో, స్నేహితుల గురించో, వార్షిక పరీక్షలు రాసేటప్పుడో ఆందోళన చెందటం చూస్తూనే ఉంటాం. కానీ కొందరు పిల్లలు అతిగా ఒత్తిడికి గురవుతుంటారు. ఇది పెద్దయ్యాక శారీరక, మానసిక సమస్యలకు దారి తీయొచ్చు. రోజువారీ జీవితంలో ఒత్తిడికి గురిచేసే అంశాలెన్నో ఎదురవుతుంటాయి. అవి మామూలు ఒత్తిడి అయితే జీవితంలో ఎదగడానికి, నేర్చుకోవటానికి తోడ్పడుతాయి. సాధారణ ఒత్తిడిని సానుకూలంగా మలుచుకుంటే సామర్థ్యం పెరగటానికి దోహదపడుతుంది. ఈ ఒత్తిడులు దీర్ఘకాలం కొనసాగితే శారీరకంగా, మానసికంగా దెబ్బతీస్తాయి. చుట్టుపక్కల హింస, వివక్ష, తీవ్ర పేదరికం,లైంగిక వేధింపులు చుట్టుముడితే పసి మనసు చిగురుటాకులా వణికిపోతుంది. పది రకాల కారణాలతో పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతూ మానసిక వేదనను అనుభవిస్తున్నట్లు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయింది. పది నుంచి పద్దెనిమిదేళ్ల వయస్సున్న పిల్లలపై జరిపిన అధ్యయనంలో చిన్నారులు ఒత్తిడికి గురైనప్పుడు మెదడు నిర్మాణ, పనితీరులో మార్పులు చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. మెదడులో ఉండే వైట్‌మ్యాటర్ ఎక్కువై గట్టిపడుతుంది. దీని వల్ల కొత్త విషయాలు వారి బుర్రకెక్కడం లేదన్నారు. తమను అంటిపెట్టుకొని ఉండే వ్యక్తులను కోల్పోవడం, ఇతరులతో గొడవలు పడటం, ఏదైనా విషయానికి భయపడటం, నిర్దేశిత పనులను చేయాలని బలవంతపెట్టడం, శిక్షకు గురయ్యే సందర్భాలు, అనారోగ్యం, చదువు ఇతరత్రా పనుల్లో వెనుకబడి వుండటం, ఒకే విషయాన్ని పదేపదే చేయడం, అభద్రతాభావం, భౌతిక మానసిక అనారోగ్యం వంటి కారణాల వల్ల పిల్లల్లో ఒత్తిడి పెరగడానికి ఆస్కారమున్నట్లు అధ్యయన నివేదిక వెల్లడించింది.

మత్తుకు బానిసైన ఓ విద్యార్థి అర్థాంతరంగా తనువు చాలించగా, చదువులో ఒత్తిడి భరించలేక మరో యువతి కళాశాలపైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రుల గొడవల వల్ల నలిగిపోయిన ఓ చిన్నారి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై తనువు చాలించింది. ఇలాంటి ఘటనలు తరచుగా వింటూ ఉంటున్నాము. క్షణికావేశంతో నిండు నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా కన్నవారికి తీవ్ర కడుపు కోతను మిగుల్చుతున్నారు. కుటుంబ కలహాలు, ప్రేమ వైఫల్యం, మత్తు పదార్థాలకు బానిస కావడం,చదువులో వెనకపడటం వంటి కారణాలతో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 15-20 శాతం తీవ్ర కుంగుబాటు సమస్యను ఎదుర్కొంటున్నట్లు మానసిక వైద్యులు పేర్కొంటున్నారు. కొందరు క్షణికావేశంతో తనువు చాలిస్తే, మరికొందరు ఎంతో మానసిక సంఘర్షణ అనుభవించి చివరకు ఈ దారి ఎంచుకుంటున్నారు. వారిలోని బాధను అర్థం చేసుకొని సరైన మనోధైర్యం కల్పించకపోవడంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.



సవాళ్లను ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు, ఆత్మ విశ్వాసం కోల్పోయి, మానసిక దౌర్బల్యానికి లోనై ఎంతో మంది పిల్లలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2022లో 10,205 మంది పద్దెనిమిదేళ్లలోపు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2011 నుంచి విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్రమయ్యాయని జాతీయ నేర గణాంక సంస్థ(ఎన్‌సీఆర్‌బి) లెక్కలు చెబుతున్నాయి. 2011లో 7,696 మంది చిన్నారులు ఆత్మహత్య చేసుకున్నారు. 2021 నాటికి ఆ సంఖ్య 13,089కి చేరింది. పదేళ్లలో విద్యార్థుల బలవన్మరణాలు భారీగా పెరిగాయి. యుక్త వయసు బాలల్లో మత్తు పదార్థాల వినియోగమే కాదు, తోటివారిపై అత్యాచారలు, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలూ పెరుగుతున్నాయి. కోవిడ్ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థతోపాటు బాలల ఆరోగ్య, మానసిక, సామాజిక వ్యవస్థలపై ప్రభావం చూపింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడుగురు పిల్లల్లో ఒకరు కోవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా మానసిక అనారోగ్యం బారిన పడినట్లు యూనిసెఫ్ తెలిపింది. ఈ సమయంలో 13 కోట్ల మందికి పైగా బాలల ఇంటికి పరిమితమవడంతో చాలా మంది మానసిక ఆందోళనకు గుఐనట్లు తెలిపింది. ఇటీవల కాలంలో మనదేశ జనాభాలో దాదాపు 14 శాతం మందికి మరింత మెరుగైన మానసిక ఆరోగ్యం అవసరమని జాతీయ మానసిక ఆరోగ్య సర్వే తేల్చింది. మానసిక ఆరోగ్య పరిస్థితులు కారణంగా 2012-2030ల మధ్య ప్రపంచవ్యాప్తంగా 1.03 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం కలుగనుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది.

బాల్యంలో కొందరు తీవ్ర ఒత్తిడి, బాధామయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఇలాంటి అనుభవాలను చవిచూసినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సుమారు ఆరుగురిలో ఒకరు నాలుగు, అంతకన్నా ఎక్కువ ఘటనలు ఎదుర్కొన్నవారేనని వివరిస్తున్నాయి. ఇలా ఎక్కువ సార్లు ఒత్తిడికి గురైతే పెద్దయ్యాక మధుమేహం, ఊబకాయం, పక్షవాతం వంటి సమస్యలు వచ్చే అవకాశముంటుంది. అంతే కాదు, ఆందోళన, కుంగుబాటు, మాదకద్రవ్యాల వ్యసనం వంటి మానసిక సమస్యల ముప్పు పెరుగుతుంది. తల్లిదండ్రుల సంరక్షణ,ఆప్యాయత, ప్రేమ కొరవడటమూ ఇందుకు దోహదం చేస్తుంది.బాల్యంలో సానుకూల ధోరణి పెంపొందటానికి పెద్దవాళ్ల తోడు చాలా ముఖ్యం. రోజువారీ ఎదురయ్యే ఒత్తిడికి గురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆత్మీయులు ఎవరైనా సరే, పిల్లలకు అండగా నిలవాలి. చిన్న పిల్లకేం సమస్యలుంటాయని తేలిగ్గా తీసుకోవద్దు. వారి ప్రతి కదలిక వెనుక ఏదో ఒక విషయం దాగి ఉంటుంది. చిన్నారులతో ఎంత ఎక్కువగా మాట్లాడితే అంతగా వారి హృదయాన్ని చదువగలుగుతాము. సమస్యను చెప్పినప్పుడు అది చిన్నగానే కనిపించవచ్చు, అలాగని దాన్ని వదిలేయకుండా ఆ సమస్యకు పరిష్కారం సూచించినప్పుడే వారి మనసు కుదుట పడుతుంది. వారి భావోద్వేగాలకు విలువనివ్వాలి. అదే స్థాయిలో ఆలోచించి పరిష్కారం చెప్పినట్లుగా ఉంటేనే వారికి తృప్తి కలుగుతుంది. అప్పుడే వారి ఆందోళన,ఒత్తిడి దూరమవుతుంది. అలాగే చిన్నారుల ఆలోచనా విధానంలో ఎంత స్పష్టత ఉందో గుర్తించాలి. సమస్యను చెప్పుకునే అవకాశమివ్వాలి. తమ బాధ,వేదనను చెబితే పెద్దవాళ్లు సానుకూలంగా తీసుకొని పరిష్కారం చెబుతారనే భరోసా పిల్లలకు దొరకాలి. తప్పు చేసినప్పుడు దండించినా,స్నేహితులుగానే మెలగాలి. అప్పుడే వారికి అమ్మ ఒడి లేదా నాన్న సాన్నిధ్యం భరోసాగా ఉంటుంది. అది సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుంది. వారికంటూ బలమైన వ్యక్తిత్వాన్ని ప్రోది చేసినప్పుడు చిన్న చిన్న సమస్యలకు ఆందోళన చెందడం మానేస్తారు. పోషకాహారం ఇవ్వడం, శారీరక శ్రమ కలిగించే ఆటలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించేలా పిల్లలను ప్రోత్సహించడం వల్ల ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కొనే మనోనిబ్బరాన్ని అలవర్చుకుంటారు.

- కోడం పవన్ కుమార్
9848992825

# నాటక రంగంలో విభిన్నశైలి 'థియోడరస్'



థియోడరస్ టెర్జోపోలోస్ 1947లో (78 సంవత్సరాలు) ఉత్తర గ్రీస్ దేశంలో పిరియా ప్రాంతంలోని మక్రిజియాలస్ అనే గ్రామంలో జన్మించాడు. ఏథెన్స్ లోని కోస్టిస్ మైఖేలిడిస్ స్కూల్ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్స్ లోను, తర్వాత బెర్లినర్ ఎన్ సెంబుల్ లోను ఉన్నత విద్యను అభ్యసించి ప్రసిద్ధ జర్మన్ నాటక దర్శకుడు హీనర్ ముల్లర్ వద్ద సహాయ దర్శకుడిగా శిష్యరికం చేశాడు. అట్టిస్ థియేటర్ కంపెనీ వ్యవస్థాపక, కళాత్మక దర్శకుడుగా థియేటర్ ఒలింపిక్స్ ఉద్యమంలో కీలకమైన వ్యక్తి. ఇతడు ప్రధానంగా గ్రీకు పౌరాణిక రంగస్థల విషాదంత నాటకాలపై లోతుగా అధ్యయనం చేసిన విశేషమైన అనుభవంతో, ప్రాచీన గ్రీకు విషాదంతా రంగస్థలం నేపథ్యానికి విప్లవాత్మకమైన మార్పులు జోడించి ప్రదర్శించిన సృజన శీలి. ఈ రంగస్థల దార్శనికుడు తన సమన్వయ పూర్వక దృష్టితో మానవ భౌతిక జీవన విధానంతో సంప్రదాయ రీతులను మేళవించి కనిపించని అగాధపు లోతులను దర్శించి, తనదైన మార్గాన్ని ఎంచుకొని ఆ దిశగా వర్తమాన నాటక రంగాన్ని, ప్రత్యేకించి గ్రీకు నాటక రంగస్థలాన్ని నడిపిస్తున్నాడు.

గత నలభై ఏళ్లుగా 2300 పైగా ప్రదర్శనలను అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించి,తన రంగస్థల నిర్మాణాత్మక కృషి ద్వారా ప్రపంచాన్ని మేలుకొలుపుతూ ఇప్పటి ప్రపంచ పోకడల పట్ల అప్రమత్తం కావాలంటున్నాడు. పర్యావరణ విధ్వంసం భౌతిక మౌలిక జీవావరణం విధ్వంసం పట్ల రంగస్థలం ద్వారా ప్రజల్ని చైతన్య పరచమంటున్నాడు. 'డైనీషియస్ తిరిగి రాకడ'నటన పద్ధతిగా పేరుపొంది, ఆంగిక, గాత్ర ప్రక్రియల ద్వారా నటనా శైలిని అభివృద్ధి పరిచినవాడు. ఈ పద్ధతిని 18 మధ్యధరా దేశాలలోనూ, ప్రపంచవ్యాప్తంగా 30 నాటక అకాడమీల్లోనూ బోధనా, ఉపన్యాసాలను ప్రదర్శనలను నిర్వహిస్తున్న వాడు. తన రంగస్థలం



జీవిత కాలంలో లెక్కలేనన్ని గ్రీకు విషాదంతా నాటకాలను, ఓపెరాలను, వర్తమాన రంగస్థల ప్రదర్శనల ద్వారా సుసంపన్నం చేస్తున్న భాగ్య శాలి.

ఇందుకుగాను ప్రపంచ రంగస్థలం ఇతడిని ఎంతగానో గౌరవించి ఆదరణ పూర్వకంగా అంతర్జాతీయ సదస్సులు, అకాడమీలకు స్వాగతించి ఎమెరిటస్ ప్రొఫెసర్ హోదాలో సత్కరిస్తున్నది. ఇప్పుడు అతడి ఈ సంవత్సరపు రంగస్థలం సందేశ సారాంశాన్ని చూద్దాం.

'మనం నివసిస్తున్న ఈ ప్రపంచ- రక్షణ కోసం చేస్తున్న ఆర్తనాదం వినండి. మనం ఏం చేయగలమా? అన్న ఆ విషయాలను గురించి ఆలోచించి, ఆచరించండి. ఇప్పటి మనుషులు వర్చువల్ రియాలిటీ రోజుల్లో కూరుకుపోయి ఒకరికొకరు దూరంగా ఉంటున్నారు. మానవ పర్యావరణం ధ్వంసం కాబడి, మొత్తం మానవ, జీవావరణం నాశనం అవుతున్న హెచ్చరికలు చేస్తున్నది. సామాన్యుడి జీవనాన్ని రాజకీయ రంగం, మాధ్యమాలు, కార్పొరేట్ రంగం నియంత్రిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు మానవ సంబంధాల పట్ల భయాలు కలిగిస్తూ వేర్పాటుకు ఆజ్యం పోస్తున్నాయి. ఇటువంటి ఆత్యయిక పరిస్థితుల్లో నాటక రంగ తక్షణ కర్తవ్యం గురించి ఈ గ్రీకు నాటక రంగ నిపుణుడు ఇలా ఉద్బోధిస్తున్నాడు. 'సమాజంలో ప్రమాదకర స్థాయికి చేరుకున్న విపత్కర పరిస్థితులు మరింతగా ముదిరిపోకుండా చూడమంటున్నాడు. ఎంతో భౌగోళిక వైవిధ్యం ఉన్న మానవ జీవితాల మధ్య మంచి అవగాహన పెంచి సహానుభూతితో వ్యవహరించేలా చూడమంటున్నాడు. లోతుగా ఆలోచిస్తూ నైతిక బాధ్యతతో నడుచుకునేందుకు ప్రోత్సహించమంటున్నాడు టెర్జోపోలోస్. గ్రీకు దేవత డైనిషియస్.. జీవిత పరమార్థాన్ని, ఈ లోకంలో మానవ ప్రస్థానం గురించి ఇచ్చిన ప్రేరణతో ఆలోచించమంటున్నాడు. మానవ జీవితంలో సహజంగా ఉండే సంక్లిష్టతలతో కూడిన స్వభావాన్ని రంగస్థల వేదికలు తమ శక్తి ద్వారా ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చి మనుషుల్ని సమైక్యపరచాలి' అని కోరుకుంటున్నాడు.


ఈ ప్రపంచ రంగస్థల దినోత్సవ స్ఫూర్తితో డైనీషియస్ కళ్ళల్లోకి చూస్తూ మనల్ని మనం ఇలా ప్రశ్నించుకోమంటున్నాడు. ఏమిటి ఇదంతా? ఎందుకోసం? అని. రంగస్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, గతాన్ని మర్చిపోకుండా నిర్మాణాత్మక ఆలోచనలను నూతన పంథాలో ఆచరిస్తూ, ప్రస్తుతం కమ్ముకున్న చీకట్లలోంచి వెలుగులోకి, సురక్షితమైన భవిష్యత్తులోకి ప్రయాణించమంటున్నాడు థియోడరస్ టెర్జో పోలోస్.

(మార్చి 27 ప్రపంచ రంగస్థల దినోత్సవం)

- మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

# సి.వి. రామన్ గర్వించదగ్గ శాస్త్రవేత్త

జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారతదేశంలో జరుపుకుంటారు. ఈ రోజును భారతదేశంలో ప్రముఖ భౌతికశాస్త్రజ్ఞుడు సి.వి రామన్ చేసిన శాస్త్రీయ పరిశోధనకు గుర్తింపుగా ప్రారంభించారు. 1928 ఫిబ్రవరి 28న ఆయన చేసిన రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్ )అనేది అద్భుతమైన శాస్త్రీయ ఆవిష్కరణ. ఇది ఆయనకు 1930లో నోబెల్ ప్రైజ్‌ను సంపాదించిపెట్టింది. జాతీయ విజ్ఞాన దినోత్సవం ఈ శాస్త్రీయ ఆవిష్కరణను స్మరించడమే కాకుండా శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రోత్సహించటానికి, యువతలో శాస్త్రం మరియు సాంకేతికతపై ఆసక్తిని పెంచడానికీ ఉద్దేశించినది. ఇక్కడ జాతీయ విజ్ఞాన దినోత్సవం యొక్క ఇతిహాసం, ప్రాధాన్యత మరియు ముఖ్యమైన సంఘటనలను పరిశీలిస్తే సి.వి రామన్ రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్ ) ఆవిష్కరణకు సంబంధించినది. 1888 నవంబర్ 7న తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లి పట్టణంలో జన్మించిన చంద్రశేఖర వెంకట రామన్ ఒక ప్రముఖ భౌతిక శాస్త్రజ్ఞుడు. వెలుగును బట్టి చేసిన ఆయన పరిశోధన వల్ల రామన్ ప్రభావం కనుగొనబడింది. ఇది వెలుతురు లేదా కిరణాలు ఒక పారదర్శక పదార్థం ద్వారా వ్యాప్తి చేయబడినప్పుడు దాని తరంగదైర్ఘ్యం మారుతుందన్న క్రాంప్టన్ ఆలోచనను ఋజువుచేసాడు.స్పెక్ట్రోస్కోపీని పరివర్తన చేస్తూ, పరిమాణ జీవజాలం, రసాయనశాస్త్రం మరియు పదార్థ శాస్త్రం వంటి రంగాల్లో అనేక ఉపయోగాలను తెచ్చిపెట్టింది ఈ ప్రయోగ ఆవిష్కరణ.



ఈ రోజు ప్రధానంగా శాస్త్రీయ ప్రగతి, పరిశోధన మరియు దైనందిన జీవితంలో శాస్త్రం యొక్క ప్రాధాన్యతను ప్రచారం చేయడంలో భాగంగా జరుగుతుంది . వాటిలో భారతదేశంలోని శాస్త్రీయ సామర్థ్యాలను మరియు ప్రపంచ శాస్త్రీయ సమాజాన్ని ముందుకు నడిపించడం, పెంపొందించడం. జాతీయ విజ్ఞాన దినోత్సవం విద్యార్థులకు శాస్త్రం మీద ఆసక్తిని పెంచుతుంది, వారిలో శాస్త్రీయ జ్ఞానం మరియు సాంకేతికతపై ఆసక్తి పెరిగేందుకు ఉద్దేశిస్తుంది. ఈ రోజు రామన్ ప్రభావం వంటి పూర్వకాల కృషులతో పాటు, పర్యావరణ శాస్త్రం, వైద్యశాస్త్రం మరియు స్పేస్ శాస్త్రం వంటి రంగాలలోని ప్రస్తుత శాస్త్రీయ పరిశోధనలను ప్రదర్శించడం. ప్రజలకు అవగాహన పెంచడం శాస్త్రం ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో, ఆరోగ్య, వ్యవసాయం, సాంకేతికత, విద్య, తదితర రంగాలలో శాస్త్రం యొక్క ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం. భవిష్యత్తు శాస్త్రజ్ఞులను ప్రేరేపించడం,ఈ రోజు యువతను శాస్త్రీయ పరిశోధనలలో ప్రవేశపెట్టేందుకు, అన్వేషణ మరియు అభివృద్ధి ప్రయోజనాలను అంగీకరించేలా ప్రేరేపిస్తుంది.

ప్రతి సంవత్సరం జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు, ఇది శాస్త్రీయ పరిశోధన మరియు అభివృద్ధి ముఖ్యమైన అంశాలను ప్రదర్శిస్తుంది. ఈ థీమ్‌లు పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లను, అవకాశాలను, మరియు శాస్త్రీయ పరిష్కారాలను కేంద్రీకరించడానికి ఉపయోగపడతాయి.

2024 థీమ్: 'ప్రపంచ శాస్త్రం, ప్రపంచ సంక్షేమం',2023 థీమ్: 'స్థిరమైన భవిష్యత్తు కోసం సమగ్ర దృష్టికోణం'2022 థీమ్: 'స్థిరమైన అభివృద్ధి కోసం శాస్త్రం', 2021 థీమ్: 'శాస్త్రీయ మరియు సాంకేతిక పరిజ్ఞానం: విద్య, నైపుణ్యాలు మరియు ఉద్యోగాలపై ప్రభావం' జాతీయ విజ్ఞాన దినోత్సవంలో ముఖ్యమైన సంఘటనలు.

శాస్త్రీయ ప్రదర్శనలు మరియు పోటీలు ఈ రోజున వివిధ శాస్త్రీయ ప్రదర్శనలు, సదస్సులు మరియు వర్క్‌షాప్‌లు దేశవ్యాప్తంగా జరుగుతాయి. విద్యాసంస్థలు సైన్స్ క్విజ్లు, డిబేట్లు నిర్వహిస్తాయి, తద్వారా విద్యార్థులలో శాస్త్రంపై దృఢమైన అవగాహన పెరుగుతుంది. భారతదేశం అనేక రంగాల్లో, ముఖ్యంగా స్పేస్, పునరుత్పత్తి శక్తి, వైద్య శాస్త్రం, వ్యవసాయ శాస్త్రం, మరియు సమాచార సాంకేతికత వంటి రంగాలలో అద్భుతమైన పురోగతి సాధించింది. జాతీయ విజ్ఞాన దినోత్సవం ఈ విజయాలను గుర్తించడమే కాకుండా, భవిష్యత్తులో శాస్త్రీయ పరిష్కారాలు అందించే అవకాశాలపై దృష్టి పెడుతుంది.

జాతీయ విజ్ఞాన దినోత్సవం ఒక స్మరణార్థం కాదు. ఇది శాస్త్రం మరియు సాంకేతికత యొక్క ప్రాధాన్యతను గుర్తించడంలో కీలకమైన రోజు. ఇది శాస్త్రీయ దృష్టిని పెంచుతూ, యువతలో పరిశోధన, విజ్ఞానం, మరియు అన్వేషణ మీద ఆసక్తి పెంచడానికి దోహదపడుతుంది. శాస్త్రోత్పత్తికి ఉపయోగపడుతుంది.

- ఎల్. ఉపేందర్

## వర్ణాక్షరం


ఒక హృదయానికి అక్షరం దొరికింది
ఒక మనసుకు వర్ణదృశ్యం దొరికింది
హృదయం,మనసు ఆకారం తొడిగితే శీలావీ.
కవిత మోహితమై రంగుల చిత్రమాయెనో
బొమ్మ ఊరించిన కవిత్వ మాయెనో
వెంటాడే ఆశ్చర్యం.
ఆకాశమంతా నవవర్ణ మాలికలై
నేలంతా పులకించిన పడుగు పేకల జీవన
మొలకలై
విస్తరిల్లిన ప్రఫుల్లత, పరిపూర్ణత.
పాత్రల వెనక మాతృస్త్రీ మార్దవ స్పర్శ
కథల్లో నవలల్లో ప్రయోగవాద కవితా స్పృహ
దాహం తీరని కొత్తదనపు, కొత్తందపు సాహిత్య,
చిత్రాల సామ్రాజ్యం.
ప్రతిపొద్దుకు సూర్యుడు ఒక్కడే అన్నట్లు,
వచన కవిత ఎవ్వరిదైనా
అట్ట మీద ఆ కుంచెనే సోయగాలు పోయిన
రోజులు ఎప్పటికైనా ఎవ్వరికైనా
తాజా ఉద్వేగభరితమే
శాంత స్వభావ మనఃహ్లాదినీ! బతుకు బాటలో
కాసు ఆసు
రాకపోకల మధ్య నెమ్మదనమే కమ్మదనం చిందె.
సహానుభూతికి, సహాయానుభూతి జోడింపు
లెక్కలేసుకోని బోళాతనం
భళాతనమే.
కవికీ చిత్రకారునికీ సౌందర్యారాధన మూడోకన్ను.
ప్రకృతీ జీవితమూ చిప్పిల్లే రసాస్వాదనమే.
రాసిందీ గీసిందీ కలానికి కుంచెకి అటూ ఇటూ
మాత్రమేనా?
ఉదయాస్తమయాలూ, ఊపిరి శబ్దాలూ
ఊరేగునంత వరకూ ఆకాశ దీపం నీడలోనూ
అవి తోవ జూపిస్తయి.
అవునూ! నా తొట్టతొలి గోరుకొయ్యలు కవరు
పేజిలో రైతు ఆకసం వంక తలెత్తి చూస్తూ,
పొలానికి సిద్ధమైతడు.
ఇప్పుడు మీరక్కడ వున్నారు!

- దాసరాజు రామారావు

# సర్వాయి పాపన్న స్ఫూర్తి కావాలి



350 ఏళ్ల క్రితమే పాపన్న బహుజన జాతులను ఏకం చేసి తెలంగాణలో రాజ్యాధికారాన్ని హస్త గతం చేసుకొని అగ్రవర్ణ జమీందారుల గడిల దొరలను గడగడ లాడించి 21 కోటలు అక్రమించాడు. ఖిల షాపూర్ నుండి మొదలు పెట్టి తాటికొండ,వేములకొండ,భువనగిరి, కొలనుపాక, జాఫర్‌గఢ్, చేర్యాల్, భైరన్‌పల్లి, సర్వాయిపేట,వరంగల్, హుస్నాబాద్, హుజురాబాద్, కరీంనగర్, జనగామ, నల్గొండ ప్రాంతాలలో తన రాజ్యాన్ని విస్తరించి పరిపాల సాగించిన గొప్ప బహుజన చక్రవర్తి. 1650 ఆగస్టు 18న ధర్మన్న, సర్వాయమ్మ పుణ్య దంపతులకు జన్మించాడు. యుక్త వయస్సుకు రాగానే గౌడ కులంలో పుట్టిన పాపన్న తన కులవృతి అయిన తాళ్లు ఎక్కుతూ కల్లు అమ్ముతూ కల్లు మండవలో తన స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, దూదేకుల మీర్ సాహెబ్, కొత్వాల్ కు కల్లు పోస్తూ అందరితో కలివిడిగా ఉండేవాడు. గోల్కొండ నవాబు తురుష్క సైనికులు గ్రామాలలో శిస్తు వసూలు చేసుకొని గుర్రాలపై అటుగా వెళుతు పాపన్నను కల్లు పోయమని అడుగగా తురుష్క సైనికులకు తాటి చెట్టు ఎక్కి కల్లు పోస్తాడు. కల్లు తాగిన సైనికులు డబ్బులు ఇవ్వకుండా పోతుంటే పాపన్న స్నేహితులు కల్లు తాగిన పైకం కట్టాలని అడుగుతే తురుష్క సైనికులు మేము రాజుగారి సైనికులం మమ్మలనే అడుగుతారా అని పాపన్న స్నేహితులపై చేయి చేస్తుకుంటారు. అది సహించలేని పాపన్న కోపంతో ఉగ్రరూపుడై వారితో యుద్ధం చేసి కల్లు గీసే కత్తితో కొందరిని చంపుతాడు. కొందరు చావుభయంతో పారిపోయి గోల్కొండ నవాబుతో జరిగిన సంఘటన చెబుతారు. అలా పాపన్న రాజ్యాధికారం వైపు అడుగులు పడ్డాయి. అప్పుడే తన మనసులో మెదిలిన మాట 'తాల్లేక్కుతే ఏమోస్తది కల్లు అమ్ముతే ఏమోస్తది కొడితే గోల్కొండను కొట్టాలే రాజుగా రాజ్య పరిపాలన చేయాలే నా బహుజన జాతులకు న్యాయం చేయాలే'అనే ఆలోచనతో వివిధ కులాలకు సంబంధించిన తన స్నేహితులు 12 మందితో సైన్యాన్ని తయారు చేసుకొని వారికి యుద్ధ విద్యలు నేర్పి వారిని కూడా నాయకులుగా తయారు చేసి తన తల్లి దగ్గరున్న బంగారు నగలు అమ్మి ఆయుధాలు సమకూర్చుకొని ఇప్పుడున్న కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయి పేట దగ్గర నాలుగు వేల ఎకరాల కొమ్ముగుట్టను స్థావరంగా చేసుకొని మూడు వేల మంది సైన్యాన్ని తయారు చేశాడు. వారందరికీ గెరిల్లా శిక్షణ ఇచ్చి యుద్ధ వీరులుగా తీర్చిదిద్దాడు. గడిల దొరల దగ్గర ధనం రాత్రికి రాత్రి కొల్లగొట్టి నిరుపేదలకు పంచెవాడు. అది తట్టుకోలేని జమీందారులు గడిల దొరలు పాపన్నను బందిపోటు దొంగగా చిత్రీకరించారు. పాపన్న తన సైన్యాన్ని క్రమక్రమంగా పన్నెండు వేలకు పెంచి గడీలు అక్రమించికుంటూ 21 కోట గడీలు ఆక్రమించుకొని 20 సంవత్సరాలు పరిపాలించి ఏకంగా గోల్కొండ పై దండయాత్ర చేసి 7 నెలలు పరిపాలించాడు.



అణగారిన గౌడ కులంలో పుట్టిన పాపన్న చరిత్రను బ్రాహ్మణ వాదులు అగ్రవర్ణాలు ఎక్కడ కూడా రాయటానికి ఇష్ట పడలేదు .సంచారజాతి శారదా గాళ్ల బుర్ర కథలతో కొంత బ్రతికి బట్టకట్టింది. అందుకే చరిత్రలో పాపన్నకు ఒక పేజీ అంటు లేకుండా పోయింది. పాపన్న స్వతంత్ర రాజ్యపాలనను సహించలేని జమిందారులు, గోల్కొండ నవాబులు, మొగల్ చక్రవర్తుల సహకారంతో తన సమీపబంధువు ఒక గుంట నక్క ఇచ్చిన సమాచారంతో పాపన్నను 1709 లో హుస్నాబాద్ ప్రాంతంలో మొఘల్ సైన్యాలతో యుద్ధం చేసి వీరోచితంగా పోరాడి చివరికి వారి చేతిలో చిక్కేకంటే తనకుతానే బాకుతో పొడుచుకుని వీరమరణం పొందుతాడు. వీరమరణం పొందిన పాపన్న తలను గోల్కొండ నవాబుల సైన్యాలు మొగల్ సైన్యాలు తీసుకుపోయి గోల్కొండ కోట ముఖ ద్వారానికి వేలాడ కడుతారు. పాపన్న ఎల్లమ్మ తల్లికి పరమ భక్తుడు. హుస్నాబాద్ ఎల్లమ్మతల్లి దేవాలయం పాపన్న కట్టించిందే. నేటికి హుస్నాబాద్‌లో ఉంది. కూలిపోతున్న పాపన్న కోటలు సంరక్షించి బావి తరాలకు అందించి జనగామ జిల్లాకు పాపన్న పెరు పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్టించి రాబోయే తరాలకు సర్వాయి పాపన్నగౌడ్‌ను స్మరించేలా ఆలోచనలు చేయాలి. పాపన్న వారసత్వం ను పుణికి పుచ్చుకుని గౌడ్ యువత విద్య,వాణిజ్య,వ్యాపార వివిధ రంగాల్లో తమదైన ముద్రను చాటిచెప్పే విధంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి. గౌడ కులస్థులు రాజకీయ,సామాజిక,ఆర్థిక అంశాలలో విలక్షణమైన కార్యాచరణతో సమిష్టి నాయకత్వంలో అందరూ సంఘటితంగా మారి ఒక శక్తిగా, అందరిని ఆదరించే యుక్తిగా ఎదగలసిన అవసరం ఉంది.

- బండి. వంశీకృష్ణ గౌడ్
9550837962

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్

## ఏడో రుచి



నుదురుపై అమ్మ
ముద్దు బువ్వ పెట్టింది
బతుకు కలకండైపోయింది...
ఎదురు చూపుల చివర
ఆమె ఎడబాటు వాక్యం రాసింది
తొలిప్రేమ చేదు జ్ఞాపకమైపోయింది...
యవ్వనం ఎగరేసే కలలన్ని
నిరాశ రాకాసి మింగేస్తుంటే
గెలుపొక వగరు కలై మిగిలింది...
తీరం చేరే దారిలో పెనవేసుకొన్న
బంధాల్ని భాధ్యతల్ని మోయలేక
సంసార సారాం కారమై తగులుతుంటే
కాలం దిగులు యాత్ర చేస్తుంది...
రక్తమోడ్చి రెక్కలిచ్చి ఎగరేసిన
బంధం ఆఖరి చూపుకీ అందకపోతే
అనాథై ఆ దీపం మలిగిపోయి
పులుపు చిందిన క్షారమై పెళ్లిబుకుతుంది...
సందడి లేని క్షణాల్ని లెక్కించు కొంటూ
పిలుపుకి పలకని అనుబంధాల్ని నెమరేసుకొంటూ
రెప్పల కింద ఉప్పుటేరుల్ని తుడుసుకొంటూ
ఏడో రుచి కోసం ఎదురు చూస్తూ ఓ ఒంటరి ఖాళీ
కుర్చీ బావరుమంటోంది ఏదోఒకరోజు...


- ఆర్. వి. వి రాజా
9059492795

# శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మెషిన్ సీజ్

**హైదరాబాద్,మార్చి26( మనంన్యూస్):** శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్ హాస్పిటల్లో అనధికారికంగా రిజిస్టర్డ్ కానీ మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను కనుగొని రెవెన్యూ, పోలీస్ శాఖ ఏ ఎస్ ఐ తో కూడిన స్పెషల్ డ్రైవ్ తనిఖీ బందంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఫెర్టిలిటీ కేంద్రాల స్పెషల్ డ్రైవ్ టీం తనిఖీలలోభాగంగా హాస్పిటల్ కి నోటీసులిచ్చి మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను సీజ్ చే శారు. అదేవిధంగా హాస్పిటల్లో స్కానింగ్ కొరకు వచ్చే పేషెంట్లు వివరాలతో కూడిన ఫామ్ ఎఫ్ ఫారం ను పూర్తి పూర్తి చేసి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్లో అప్డేట్ చేస్తున్న విధానాన్ని, అవుట్ పేషెంట్ రిజిస్టర్ లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పని చేస్తున్న డాక్టర్స్ క్వాలిఫికేషన్ వెరిఫికేషన్, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం - 1994 మరియు రూల్స్ 1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైల్ శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా స్కాన్నింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పకూడదని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శించడాన్ని తనిఖీ చే శారు. ఈ స్కానింగ్ కేంద్రల, ఫెర్టిలిటీ కేంద్రాల యొక్క తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వెంకటరమణ తెలిపారు.ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మిషన్ సీజ్ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు ,జూనియర్ అసిస్టెంట్ బాపు దేవ్ , ఏ.యస్.ఐ. విజయమణి , పి.ఓ.,డి.టి.టి. డా. ఉమాశ్రీ, పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి, డా. సనా జవేరియా , సఖి కన్సల్టెంట్, డి. లక్ష్మి, డాటా ఎంట్రీ ఆఫరేటర్, కె. రమేశ్, డెమో, రాజగోపాల్, సుపెర్వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన
# శాతవాహన ఉపకులపతి



**హైదరాబాద్,మార్చి26( మనంన్యూస్) :** కరీంనగర్ జిల్లాకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేసినందుకు ,శాతవాహన విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాలను 2025- 26 సంవత్సరానికి తరగతులు బోధించడానికి మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాగ్రెస్ టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ లను శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలొ ఇంజనీరింగ్ మరియు న్యాయ కళాశాలలతో విద్యాకుసుమాలు విరబూస్తాయని చాలామంది పేద పిల్లలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. ఎన్నో రోజులుగా నిరీక్షణలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలను తీసుకురావడంలో తోడ్పాటునందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్లో రెండు న్యాయ కళాశాలలు ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయ ఆవరణలో న్యాయ కళాశాల లేదని దీంతో కరీంనగర్ న్యాయవిద్యలో ముందుకు దూసుకు వెళ్తుందని పేర్కొన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సుడా చైర్మన్



**హైదరాబాద్,మార్చి26( మనంన్యూస్):** ఏఐసిసి ప్రధాన కార్యదర్శి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసిన సుడా చైర్మన్,సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.కలిసిన వారిలో ఢిల్లీలో నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి,నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు లు ఉన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులతో ప్రజల ఉక్కిరి బిక్కిరి

**మంచిర్యాల రూరల్, మార్చి 26(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ లేఅవుట్ల,ప్లాట్ల క్రమబద్ధీకరణ దిశగా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం కలిగించిన విషయం అందరికీ తెలిసిందే . ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు పరిష్కారం మార్గం చూపే విధంగా రెవెన్యూ, కార్పొరేషన్, పురపాలక, ఇరిగేషన్ శాఖల అధికారులకు ప్రభుత్వం విధి విధానాలు జారీ చేసింది. రెవెన్యూ శాఖలో దరఖాస్తు పరిష్కారానికి రెవిన్యూ ఇన్స్పెక్టర్ కు వారి లాగిన్ లో అధికారం కల్పించింది, వీరితోపాటుగా కార్పొరేషన్, పురపాలక శాఖలను టి పి ఓ అధికారులకు వారి లాగిన్ లో అధికార బదలాయింపు అధికారం




కల్పించింది. అదేవిధంగా ఇరిగేషన్ అధికారులకు ఏవైనా దరఖాస్తులు బఫర్ జోన్ పరిధిలో అన్యాక్రాంతం కానటువంటి స్థలాలకు పర్మిషన్ బాధ్యతలను ఏ.ఈ. లకు కల్పించింది. వీరందరి సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కార దిశగా ముందుకు సాగుతున్న తరుణంలో, ఈనెల 31వ తేదీన 25 శాతం పన్ను తగ్గింపు గడువు ముగుస్తుండడంతో ఎల్ఆర్ఎస్ ఆన్లైన్ సర్వర్ 3 రోజులుగా మొరాయిస్తుందని అనే విషయం దరఖాస్తుదారులకు నిరాశ కలిగిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి టెక్నికల్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఆన్లైన్ బెట్టింగ్ ల పై సర్కార్ ఉక్కుపాదం

- సిట్ ఏర్పాటు నిర్ణయంపై ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి హర్షం



**హైదరాబాద్, మార్చి26( మనంన్యూస్) :** యువకుల ప్రాణాలు తీస్తున్న ఆన్లైన్ బెట్టింగ్ ల పైఉక్కుపాదం మోపేందుకు

సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మిగితా రాష్ట్రాల్లోనూ ఆన్లయిన్ బెట్టింగ్ వల్ల ఎంతోమంది యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని డాక్టర్ కవ్వంపల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లయిన్ బెట్టింగ్ లతో మరణిస్తున్న సంఘటనలు రోజురోజుకు వెలుగు చూసుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆన్లయిన్ బెట్టింగ్ లు, గేమింగ్, రమ్మీ కేసులపై చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లుగా అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రకటన చేయడం సంతోషకరమని కవ్వంపల్లి పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్లు, ఆన్లైన్ బెట్టింగ్లపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సరదాగా మొదలైన ఈ

బెట్టింగులు వ్యసనంగా మారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచ్చులోంచి బయట పడలేక, అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. యువత, విద్యార్థులు పనులు మానేసి గంటల తరబడి ఆన్లైన్ గేమ్లు ఆడుతున్నారని, ఒక్కోసారి సహనం కోల్పోయి గొడవలకు దిగుతున్న సంఘటనలు కూడా లేకపోలేదని, వీటి నిరోధానికి పోలీసు నిఘా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.బెట్టింగ్ నేరస్తులపైననే కాకుండా ఆన్లయిన్ బెట్టింగ్ యాప్ ను ప్రమోట్ చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వ్యక్తం చేశారు.

# బీసీ కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు పర్యటన

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



**వేములవాడ,మార్చి 26 (మనం న్యూస్) :** బీసీ కులాలలోని పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు తాము ఇక్కడికి వచ్చామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు.రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ ఆవరణలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో, ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి,అసెంబ్లీ లో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. తమ కులం పేరు విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని పిచ్చగుంట్ల, బుడబుక్కల,దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారని వివరించారు.వారి కులాల పేరు మార్పు కోసం ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామని తెలిపారు.విజ్ఞప్తులు అందజేసిన వారి స్థితిగతులు నేరుగా తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు తాము వచ్చామని చైర్మెన్ పేర్కొన్నారు.పరిశీలన అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం




**శంకరపట్నం, మార్చి 26(మనం న్యూస్) :** తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఐ సి చైర్మన్ కేతిరి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశంను బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కారదర్శి పోలు వీరాస్వామి నివేదిక చదివి వినిపించారు హుజురాబాద్ అసిస్టెంట్ రిజిష్టార్ అశోక్ కుమార్, సహకార సంఘాల పనితీరు ఫలితాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పి ఐ సి మెంబర్లు రమణ రెడ్డి, సత్యనారాయణ రావు, సమ్మయ్య,ప్రవీణ్, శేషచారీ వేణు ప్రజలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**గంగాధర, మార్చి 26 (మనం న్యూస్):** గంగాధర మండలం ఉప్పర మల్యాల మేము సైతం సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన సురకాని మల్లేశం గత కొన్ని సంవత్సరాల క్రితం బోయినపల్లి గ్రామానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మల్లేశం మృతి చెందగా ఉప్పరమల్యాల మేము సైతం సేవా సమితి ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 6500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ఉదార తను చాటుకోగా, జారతి శ్రీకర్, సురకాని శ్రీశైలం, సురకాని మల్లేశం, ఎం.డి బాబుమియా 3500 రూపాయలు ఆర్థిక చేయూతనిచ్చి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసిన వీరికి మృతుడు మల్లేశం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల సహకారంతో సంఘాన్నిఅభివృద్ధి పరుస్తాం

- చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి

**సైదాపూర్, మార్చి 26 ( మనం న్యూస్ ):** వెన్నంపల్లి విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన(మహాజన )సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 2024- 25 సంవత్సరం వార్షిక నివేదికను సంఘ సీఈవో చేల్మెలా మల్లారెడ్డి లావాదేవీలు చదివి వినిపించడం జరిగింది. అనంతరం చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సహకారంతోనే సంఘాన్ని మరింత అభివృద్ధి పరస్తామని, సహకార సంఘం ఆవరణంలో బోర్ వెల్, ప్రహరీ గోడ నిర్మాణం పొడిగిస్తామని పాత సహకార సంఘ భవనాన్ని శిథిలవస్తుగా ఉన్నందున మరమ్మత్తులు చేయిస్తామని,లస్మన్నపల్లి లో వరికల్లాలకు ఏర్పాటు చేస్తామని, సిఎస్సి సెంటర్, డిజిటల్ బ్యాంకు సేవలు అందిస్తామని, రైతుల సహకారంతో సీడ్ మిల్, సంఘం తరపున భూమి కొనుగోలు చేస్తామని రైతులు మీ యొక్క సలహాలు సూచనలు ఇవ్వాలని, మా పదవి కాలం ఆరు నెలలకు పొడిగించడం పొడిగించినందున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సారబుడ్ల రాజి రెడ్డి, ఆడిటర్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దొనపాటి రామ్ రెడ్డి, మొలుగురి సంపత్, మొలుగూరి సౌందర్య, వెంగళ కోమల, గౌడ గాని మోహన్ రావు, తడవేణి కనుకయ్య, గడ్డం అబ్బయ్య,పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్నబీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

**వేములవాడ,మార్చి 26 (మనం న్యూస్):** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ ఈఓ వినోద్ వారికి ప్రసాదం అందజేశారు.చైర్మన్, సభ్యులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు.వారి వెంట బీసీ



సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు ఉన్నారు.

# బండి సంజయ్ మాట్లాడిన దాంట్లో తప్పేముంది

- బిఆర్ఎస్ నేతలు ఎందుకు ఉలికి పడుతున్నారు..?
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్



**హైదరాబాద్,మార్చి26 (మనంన్యూస్):** చరిత్ర తెలిసిన వాళ్లకు కేసీఆర్ అసలు బాగోతం ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదని , కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు చరిత్రలో ఉన్నవే, మాట్లాడుకున్నవే నని , బిఆర్ఎస్ నేతలు వాళ్ల జాతిపిత , ఉద్యమ నేత కెసిఆర్ గురించి వాస్తవాలు తెలియకపోతే తెలుసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ అన్నారు. బుధవారం కరీంనగర్ బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల కెసిఆర్ గురించి చేసిన వ్యాఖ్యల్లో తప్పేముంది..? కెసిఆర్ చరిత్ర గురించి చెబితే బి నేతలు ఉలికి పడుతున్నారని, వాస్తవాలను జీర్ణించుకోలేక అవాకులు చేవాకులు పేలుతున్నారని ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ అసలు చరిత్ర లో దొంగ నోట్ల అంశంలో, కేంద్రమంత్రిగా పని చేసినప్పుడు సహారా స్కాం ఈఎస్ఐ స్కాం లలో ఆయన పేరు ప్రధానంగా వినిపించిందని, పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఈచరిత్ర గురించి కరీంనగర్ బిఆర్ఎస్ నేతలకు తెలియకపోతే తెలుసుకుంటే మంచిదన్నారు. అసలు కరీంనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని ఆయన ఈ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. చల్ల హరి శంకర్ ప్రజా క్షేత్రంలో నుంచి వచ్చిన నాయకుడు కాదని, ఆయన ఏ ఎన్నికల్లో కూడా పోటీ చేసిన చరిత్ర లేదని, ఆయన ఓ నామినేటెడ్ పొలిటిషన్ అన్నారు. అలాంటి వ్యక్తి ప్రజల మన్ననలతో, ఆశీస్సులతో కరీంనగర్ పార్లమెంటు నుండి రెండుసార్లు గెలుపొంది కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ కుమార్ గురించి మాట్లాడే అర్హత స్థాయి ఉందా అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరి శంకర్ పరిధికి మించి మాట్లాడుతున్నారని , ఆయన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు , మాజీ ఎంపీపీ వాసాల రమేష్, తాజా మాజీ కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, వంగల పవన్, బండ రమణారెడ్డి , నరహరి లక్ష్మారెడ్డి కరీంనగర్ జోన్ అధ్యక్షులు బండారి గాయత్రీ దేవి, శ్రీనివాస్ , తణుకు సాయి , ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# వివేకవర్ధిని కళాశాలలో ఎయిడ్స్ నిర్మూలనపై అగహన సదస్సు


**మంచిర్యాల, మార్చి 26(మనంప్రతినిధి):** మంచిర్యాల జిల్లా కేంద్రం లో గల వివేకవర్ధిని డిగ్రీ. పీజీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ అధికారుల అలాగే రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధుల నిర్మూలన కోసం వివేకవర్ధని. డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సును ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ హాజరై ఆయన



వాలంటీర్స్ కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం చేపట్టవలసిన చర్యలు మనం ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలని తెలిపారు. అలాగే ప్రోగ్రామ్ అధికారులకు రానున్న 2025-26 కి గాను యాక్షన్ ప్లాన్ ని , రెగ్యులర్ యాక్టివిటీస్ , స్పెషల్ క్యాంపు కి సంబంధించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కన్వీనర్ డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి , నిర్మల్ జిల్లా ప్రోగ్రామ్ కన్వీనర్ జీ. అర్చన , కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్, కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనా, వివిధ కళాశాల ప్రోగ్రాం అధికారులు మోహన్, కుమార్, మల్లేష్, నర్సింగరావు, పాషా, రవికుమార్ ,రాజు, ఒంప్రకాశ్, రాజు వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక,శారీరక ఉల్లాసానికి క్రీడలు

- పోలీసులు క్రీడలపై దృష్టి సారించాలి
- ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి



**వేములవాడ,మార్చి 26 (మనం న్యూస్) :** విధి నిర్వహణలో భాగంగా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండే పోలీసులపై తీవ్ర ఒత్తిడి ఉంటుందని, ఈ ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని వేములవాడ సబ్ డివిజన్ ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించి వారు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించాలనే లక్ష్యంతో వేములవాడ పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఏ.ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. ఈ కోర్టును బుధవారం రాత్రి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్టేషన్ల సీఐలు, ఎస్సైల తో కలిసి ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు కాసేపు షటిల్ ఆడుతూ అధికారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏ.ఎస్పీ మాట్లాడుతూ 24/7 విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులకు కాస్త ఉపశమనం కలిగించడంతో పాటు అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని, సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని మానసిక ప్రశాంతతను పొందాలని సూచించారు. పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ తమ ఆరోగ్య పరిస్థితులు, శారీరక, మానసిక దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని షటిల్ కోర్టు ఏర్పాటుకు కృషిచేసిన ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీ.ఐలు వీర ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేష్, అంజయ్య, అశోక్, పృధ్వీధర్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యానికి మిగిలింది అయిదు రోజులే..

- వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 72 మిలియన్ టన్నులను సాధించి రికార్డు చరిత్ర సృష్టిస్తుందా..?



మంచిర్యాల, 26, మార్చి,( మనం న్యూస్ ): సుదీర్ఘ చరిత్ర కలిగి ఉత్పత్తి,ఉత్పాదకల్లో అలగే సామాజిక సామాజిక రంగాల్లో సింగరేణి కాలరీస్ సంస్థ రికార్డు లను నెలకొలుపుతూ, దేశ వ్యాపత్నంగా చరిత్ర లో తన పేరును నమోదు చేసుకుంటూ ముందుకు సాగుతోంది . అలాంటి రికార్డు కలిగిన సింగరేణి సంస్థ 2024-25 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి చరిత్ర సృష్టిస్తుందా.. చెతికిల బడుతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వార్షికోత్సవ సంవత్సరం ముగియడానికి ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువుంది. మొన్నటి మార్చి 25 వరకు దాదాపు 67 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు సమాచారం. ఇంకా ఐదు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి రికార్డు నెలకొల్పాల్సి ఉంది. ప్రస్తుతం సింగరేణిలో రోజుకు మూడున్నర లక్షల వరకు ఉత్పత్తి జరుగుతోంది. ఇంకా వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి సమయము ఐదు రోజులు మాత్రమే ఉంది కాబట్టి మిగిలిన ఐదు టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించడానికి రోజుకు మరిన్ని టన్నుల బొగ్గు ఉత్పత్తిని పెంచితే తప్ప అనుకున్న లక్ష్యసాధనకు చేరుకోదు. మధ్యలో ఒక ఆదివారం సెలవు దినముగా వచ్చింది. అంటే ఇంకా నాలుగు రోజులు సమయం మాత్రమే ఉంది. అయితే ఆదివారాల్లో ఉపరితల గనులు అనగా ఓపెన్ కాస్ట్ గనులలో పనులను నడిపించి ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి యాజమాన్యం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా కూడా వార్షిక లక్ష్యం కష్టతరమే అయినా, తలుచుకుంటే సాధ్యం కాని దంటూ ఏమీ లేదు అన్నట్టుగా వార్షిక లక్ష్యాన్ని ధ్యేయంగా ఎంతో నమ్మకంతో అధికారులు కార్మికులు కష్టపడి పని చేస్తున్నారు . సింగరేణి వ్యాప్తంగా 18 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో రామగుండం ఏరియాను తీసుకుంటే రామగుండం 1 లో 36 లక్షల టన్నుల ఉత్పత్తి ని 15 రోజుల ముందే బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యాన్ని సాధించింది. ఇక రామగుండం 3 లో 62.5 లక్షల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. వారం క్రితమే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంది. ఇప్పటివరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో ఇల్లందు ఏరియా, ఆర్.జి.3 ఏరియాలో మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించాయి. మిగిలిన ఏరియాల్లో కొన్ని ఏరియాలో మాత్రం వంద శాతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఇదిలా ఉండగా సింగరేణి లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక లక్ష్యాన్ని సింగరేణి వ్యాప్తంగా ఉన్న కొన్ని గనులు ఇప్పటికే సాధించాయి. శ్రీరాంపూర్ ఏరియా లోని ఆర్కే సిక్స్, ఆర్కే న్యూటెక్, శ్రీరాంపూర్ ఓసిపి టు గనులు వంద శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాయి. అలాగే రామగుండం ఏరియాలో రామగుండం ఓసిపి-2, జీడీకే - 5, కొత్తగూడెం ప్రాంతంలో పీకే ఓసిపి -4 ఘనులు వంద శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాయి. వార్షిక ఏడాదిలో మిగిలిన లక్ష్య సాధన కోసం సింగరేణి సంస్థ అధికారులు మాన్ పవర్ తో కాకుండా యంత్రాల ద్వారా బొగ్గు ఉత్పత్తి అయ్యే ఓపెన్ కాస్ట్ గనుల మీదే ఆధార పది ఆశలు పెట్టుకున్నారు. మరి ఈ నెల ఆఖరు వరకు సింగరేణి సంస్థ ఈ 2024- 25 వార్షిక లక్ష్యం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధిస్తుందా లేదా వేచి చూడాలి మరి. అద్భుతం.... రైళ్ల ద్వారా 2.68 లక్షల టన్నుల బొగ్గును పంపించి, రికార్డు సృష్టించిచిన సింగరేణి సంస్థ కాగా ఇక్కద మరో అద్భుతాన్ని సింగరేణి ఆవిస్కరించింది .

24 మార్చి , 2025 నాడు 51 రైళ్ల ద్వారా 2.68 లక్షల టన్నుల బొగ్గును పంపించి, సింగరేణి సంస్థ రికార్డు సృష్టించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. దేశానికి శక్తిని అందించడంలో సింగరేణి 130 ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తోంది. సింగరేణి సంస్థకు శుభాకాంక్షలు అందరు చెప్పాలి.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారిని విధుల నుండి తొలగింపు



- ఇద్దరు వైద్యులకు షోకాజు నోటీసులు
- మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష

సంగారెడ్డి, మార్చి 26(మనంప్రతినిధి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఒకరిని విధుల నుండి తొలగిస్తూ, మరో ఇద్దరు వైద్యాధికారులకు షోకాస్ నోటీసులుఅందించాలని, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా వైద్యధికారిణిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో మాతా శిశు మరణాలు, మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అజ్మనాజ్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో డాక్టర్ అజ్మనాజ్‌ను విధులను తొలగించాలని డిఎంఅండ్‌హెచ్‌వో గాయత్రి దేవికి ఆదేశించారు. దౌల్తాబాద్,మల్చల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డాక్టర్లకు షోకాజు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 -24 సంవత్సరం పోల్చితే 2024-25 సంవత్సరంలో మాతా శిశు మరణాలు 50% తగ్గినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే లో రిస్కు కేసులు ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందించేలా చూడాలన్నారు. హై రిస్కు కేసులో రెఫర్ చేస్తున్నప్పుడు డాక్టర్లు సమన్వయంతో కోఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు క్రమం తప్పకుండా గర్భిణులను పరిశీలించి వారికి సూచనలు సలహాలు, పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడడంతో పాటు మందులు వాడేలా పౌష్టికాహారం తీసుకునేలా చూస్తే చాలా వరకు సమస్యలు తగ్గుతాయి అన్నారు. వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి గాయత్రి దేవి, జిజిహెచ్ సూపర్డెంట్ అనిల్ కుమార్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఎంపీ చొరవతో ప్రత్యేక అంబులెన్స్



- ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు

గజ్వేల్, మార్చి 26, మనం న్యూస్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గజ్వెల్ పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ దావాఖానలో నూతన అంబులెన్స్ కు గజ్వేల్ బిజెపి నాయకులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు మాదారి జశ్వంత్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ నాయకులు బండారు మహేష్ మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదినం సందర్భంగా పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి ప్రతి నియోజకవర్గానికి ఇచ్చిన మాట ప్రకారం అంబులెన్స్ ను మంజూరు చేయడం జరిగిందని, దానిలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గానికి ఇచ్చినటువంటి అంబులెన్స్ కు బుధవారం భారతియ జనతా పార్టీ నాయకులతో, ఆసుపత్రి సిబ్బందితో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అంబులెన్స్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా మానవసేవే మాధవ సేవ అనే లక్ష్యంగా ఓట్లు వేసి మంచి మెజారిటీతో గెలిపించిన మెదక్ పార్లమెంటు ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం, నాణ్యమైన విద్య అందించడమే రఘునందన్ రావు లక్ష్యమన్నారు. పేదల కోసం పనిచేసేటువంటి ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమని, పేదల గురించి ఆలోచించేటువంటి వ్యక్తి పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు అని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో ప్రతి పనిలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే పనులు జరుగుతున్నాయని రఘునందన్ రావు పార్లమెంట్ ప్రజలకు ఏం చేశారో, ఏం చేయబోతున్నారో ప్రజలకు చెప్తాము మీకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

గతంలో ఉన్నటువంటి పార్లమెంటు సభ్యుడు నియోజకవర్గానికి పబ్బు కావాలని, బార్లు కావాలని అడిగారన్నారు కానీ ఎంపీ రఘునందన్ రావు పేద ప్రజలకు అవసరమైనటువంటి నాణ్యమైనటువంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో అంబులెన్సులు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఏళ్ళు రామ్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ అన్నపూర్ణ, సిబ్బంది బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, కోదండడం శ్రీనివాస్ రెడ్డి, ఐలా మహేందర్, పంజాలా వెంకటేష్ గౌడ్, బారు అరవిందు మరికంటి, ఏగొండ, కొన్నె రాజశేఖర్ రెడ్డి, నరసింహ చారి, రమేష్, మహిళా మోర్చా నాయకులు సుమతి, మమత, స్వరాజ్యలక్ష్మి, సరిత, యువమోర్చా నాయకులు కర్ణాకర్ శరత్ రిక్కీ గౌడ్ రాఖీ, రాజు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



- ఆహారం విషయంలో రాజీ పడితే చర్యలు తప్పవు
- జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్

దుబ్బాక, మార్చి 26, మనం న్యూస్: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించకుంటే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. బుధవారం దుబ్బాక మండల కేంద్రంలోని రామక్కపేట గురుకుల బాలికల పాఠశాలను తనఖీ చేశారు. వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ విభాగాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి సదురు కాంట్రాక్టర్ ను విచారించగా బియ్యంతోనే సమస్యలు ఉన్నాయని తెలపడంతో నాణ్యమైన బియ్యాన్ని అందించాలని డీ ఎస్ ఓ తనూజను ఆదేశించారు. ముందస్తుగా విద్యార్థులకు చర్మ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్, మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పాఠశాలలో అదనంగా శౌచాలయాలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అదనపు శౌచాలాయాల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ శర్మ, ఎమ్మార్వో సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ శారదా, వైద్యాధికారి హిమబిందు, ఆర్ ఐ నరేందర్, తదితరులు ఉన్నారు.

# ఆస్తి పన్నుపై వన్ టైమ్ సెటిల్మెంట్

- మున్సిపల్ కమీషనర్ అశ్రిత్ కుమార్



సిద్దిపేట అర్బన్, మార్చి 26, (మనం న్యూస్) : 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలలో వన్ టైమ్ సెటిల్మెంట్ క్రింద ఆస్తి పన్ను బకాయి వడ్డీ పై 90% రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం జరిగిందని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సిద్దిపేట పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే 80 శాతం పన్ను వసూలు చేయటం జరిగిందని, ఈ నెల చివరి వరకు 100 శాతం పన్ను చేయడానికి పట్టణ ప్రజలు సైతం సహకరిస్తూ సకాలంలో పురపాలక సిబ్బందికి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పట్టణంలోని వాణిజ్య వ్యాపా రస్తులు సైతం ట్రేడ్ లైసెన్స్ రుసుము సకాలంలో చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలన్నారు.

# కోరినవారి కొంగుబంగారం ఓజల మల్లన్న

- ఘనంగా మల్లన్న పట్నాలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



దుబ్బాక, మార్చి 26, మనం న్యూస్: కోరిన వారి కోరికలు తీర్చే కొంగుబంగారంగా వెలసిన వరాలనిచ్చే దేవుడు ఓజల మల్లికార్జున స్వామి అని మల్లన్న దేవాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామ శివారులోని అటవి క్షేత్రంలో 200 సంవత్సరాల క్రితం వెలసిన రేణుక ఎల్లమ్మ , ఓజల మల్లికార్జున స్వామికి ఘనంగా పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవ వేడుకతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం రోజున దుబ్బాక మండల పరిధిలోని పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, తొర్నాల, అప్పనపల్లి, హాసన్ మీరాపూర్ గ్రామ ప్రజలు అక్కడే ఏర్పడిన పుట్టు గుండంలో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో ఒగ్గు కళాకారులతో పట్నాలు వేసి మల్లన్న స్వామికి, రేణుక ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 200 ఏళ్ళ చరిత్ర కలిగి ఉన్న ఈ ఆలయాన్ని పురావస్తు శాఖ అధికారులు ఆనవాళ్లు గుర్తించాలన్నారు. నమ్మినవారికి నమ్మినట్టుగా కోరిన వారి కోర్కెలు తీర్చే దేవుడు ఓజాల మల్లికార్జున స్వామి అన్నారు. ఎన్నో ఏళ్ళ చరిత్ర ఉన్న ఈ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు ప్రతి శ్రావణ మాసం వచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారని, వారికి సకల సౌభాగ్యాలు కలుగుతాయన్నారు. ప్రతి శివరాత్రి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తుంటారన్నారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సౌకర్యాన్ని, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి ఆలయాన్ని దాతలు, గ్రామస్తుల సహకారంతో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి యేటా ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కడ్తల రవీందర్ రెడ్డి, నక్కల దామోదర్ రెడ్డి, పంజా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సద్ది రాజిరెడ్డి, సద్ది మహిపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ పరికి రవి గౌడ్, అప్పనపల్లి కొండి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిర్ర లావణ్య యాదగిరి, చిన్ని సంజీవరెడ్డి, చిర్రా తిరుపతి, పోశాద్రి, కొండ్ర యాదగిరి, కొర్ల మల్లేశం, వివిధ గ్రామాల ప్రజలు, ఒగ్గు కళాకారులు ధరణి సత్తయ్య, మహేందర్, కనకయ్య,లింగం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- క్రికెట్ బెట్టింగ్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలి
- పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ



సిద్దిపేట, మార్చి 26, (మనం న్యూస్ ప్రతినిధి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితంగా పరిశోధించి నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ అన్నారు. బుధవారం నాడు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ సిద్దిపేట ఏసిపి మధు, సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, ఇన్స్పెక్టర్లతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించి అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి ఏసిపి, సీఐలను, అడిగి తెలుసుకున్నారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ కేసులలో 60 రోజులలో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్స్ పై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేయాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్స్ పై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేయాలి, గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలని సూచించారు. నూతన టెక్నాలజీని అధికారులు, సిబ్బంది అందిపుచ్చుకోవాలని, ఏ రోజుకు ఆ రోజు అప్డేట్ కావాలని, కేసు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేయాలని సూచించారు. నిందితులను అరెస్టు చేసే విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు, ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. సీసీటీఎంఎస్ డాటా ప్రతిరోజు మానిటర్ చేయాలను, సీసీ కెమెరాలను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. 2023, 2024 సంవత్సరంలో పెండింగ్ ఉన్న కేసులలో అన్ని కోణాలుల్లో పరిశోధన చేసి కేసులు ఫైనల్ చేయాలని సూచించారు. డయల్ 100 కాల్స్ పై అలసత్వం వహించవద్దని, నాన్ బేలబుల్ వారెంట్ సాధ్యమైనంత త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఇన్స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

# సిద్దిపేట లైన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



సిద్దిపేట రూరల్, మార్చి 26, (మనం న్యూస్): సిద్దిపేట జిల్లా అలయన్స్ క్లబ్ కు అవార్డుల పంట పండింది. ఈనెల 21 ,22 ,23 తేదీల్లో చెన్నైలో మూడు రోజులు జరిగిన అలయన్స్ అంతర్జాతీయ సదస్సు, సౌత్ మల్టిపుల్ సదస్సులో సిద్దిపేట జిల్లాకు మొత్తం 11 అవార్డులు రావడం జరిగింది. ఈ అంతర్జాతీయ సదస్సులో ఆత్మ రాములు, బాలచంద్రన్, సేన శివ కుమార్ తో పాటు పలువురికి అవార్డులు వరించాయి. అదేవిధంగా సౌత్ మట్టిపల్లిలో బెస్ట్ గవర్నర్ స్పెషల్ అవార్డుగా బాల చంద్రముకు, బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్ సిద్దిపేట జిల్లా సభ్యులు, గవర్నర్ బాలచంద్రము అవార్డు అందుకున్నారు. అంతకుముందు సైన్స్ క్విజ్ లో సిద్దిపేట జిల్లా విద్యార్థులకు నలుగురికి నగదు అవార్డులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ రాములు, బాలచంద్రం, ఈశ్వర్ చరణ్, సోమ వనజ, సోమ శివకుమార్,పెద్ది రామ చంద్రము, గందెసిరి కృష్ణమూర్తి, సుజాత, సుజన, శోభారాణి, పి. వెంకటలక్ష్మి, సీ.హెచ్. వెంకట్ లక్ష్మి, భారతమ్మ పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి కారుణ్య నియామకం




- పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ

సిద్దిపేట, మార్చి 26, (మనం న్యూస్ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్ కుమారునికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్ కుమారుడు సయ్యద్ సోహెల్ పాషాకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతలవారీగా కారుణ్య నియామకాలలో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. నీతి నిజాయితీగా ఉద్యోగాలు చేస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ ఫయాజుద్దీన్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తాళాలు పగులగొట్టి వ్యాయామ సామాగ్రి దొంగతనం

- పోలీస్ స్టేషన్ లో ఉపాధ్యాయుల ఫిర్యాదు



సిద్దిపేట, మార్చి 26, (మనం న్యూస్ ప్రతినిధి): పట్టణంలోని 15వ వార్డు ఇమాంబాద్ లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళాలు పగులగొట్టి వ్యాయామ సామాగ్రిని దొంగిలించారు. విషయాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్, గీతలు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో వ్యాయామ సామాగ్రి దొంగతనానికి గురైందన్న విషయాన్ని తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు బుధవారంనాడు వార్డు కౌన్సిలర్ పాతూరి సులోచన శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. రెండు తరగతి గదుల తాళాలను పగులగొట్టడం తోపాటు వ్యాయామ సామాగ్రి దొంగిలించబడడంతో పాటు పాఠశాల ఆవరణలో బీరు సీసాలు పగిలి ఉండడాన్ని గమనించారు. పాఠశాలపై ప్రత్యేక నిఘాను కేంద్రీకరించడమే కాకుండా దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. పాఠశాల ఆవరణలో నిఘా కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇక మీదట ఇలాంటి సంఘటనలు జరిగితే తమకు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న భవనం

- ఆరుగురు కూలీలు మృతి
- ఆధ్యాత్మిక ముసుగులో అక్రమ వసూలు..
- నిబంధనలకు వ్యతిరేకంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు
- సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ ,ఎస్పీ ,ఏఎస్పి, రెస్క్యూ టీం
- సహాయ చర్యలు ముమ్మారం
- అక్రమ నిర్మాణాలపై పట్టించుకోని జిల్లా స్థాయి అధికారులు
- అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇంటి యజమాని
- సంఘటన స్థలానికి చేరుకున్న కలెక్టర్ ,ఎస్పీ
- రెస్క్యూ టీమ్‌తో సహాయ చర్యలు ముమ్మరం





భద్రాచలం, మార్చి 26 (మనం న్యూస్): భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్లో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో భవనంలో పనిచేస్తున్న ఇద్దరు మేస్త్రిలతో పాటు, కూలీలు నలుగురు మృతిచెంది ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ ఆధ్యాత్మిక ముసుగులో కొందరు భక్తుల నుంచి విరాళాల పేరుతో దోచుకుంటూ ఇంటి నిర్మాణం ప్రదేశంలోనే అమ్మవారి ఆలయం నిర్మాణం చేపట్టారు. నిర్మాణంలో లోపలు ఉన్నాయని, గ్రామపంచాయతీ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చిన కూడా, భవన యజమాని పట్టించుకోలేదు. ఆరంతస్తుల వరకు స్లాబ్ పోశారు. వాటిని గదులు కడుతుండగా భవనం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మేస్త్రిలు ,నలుగురు కూలీలు మృతి చెందారా..? లేదా అనేది తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి జిల్లా కలెక్టర్ జితిష్ వి పటేల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పి విక్రత్ కుమార్ సింగ్ చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. భద్రాచలం పట్టణంలో జిపిఎస్ 2 నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ కొందరు ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. శిథిలాల కింద మృతి చెందిన వారిని బయటికి తీయటానికి బుధవారం అర్ధరాత్రి వరకు పట్టే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి 8 గంటల వరకు అధికారుల నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.. కలెక్టర్ ,ఎస్పీ భద్రాచలంలో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# ఆదమరిస్తే అంతే సంగతి..

- ప్రమాదకరంగా మిషన్ భగీరథ చాంబర్..
- ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా.?

ఆళ్లపల్లి,మార్చి 26(మనం న్యూస్): ఆళ్ళపల్లి మండల పరిధిలోని అనంతోగు గ్రామంలో మిషన్ భగీరథ చాంబర్లు అత్యంత ప్రమాదకరంగా వున్నాయి. ఛాంబర్ల పైన ఎటువంటి మూత లేకుండా ప్రమాద ఘంటికలు దర్శనమిస్తున్నాయి. అనంతోగు గ్రామ చివరిలో కొత్తగూడెం మర్కోడు ఒకవైపు ప్రధాన రహదారి మరోవైపు ఆశ్రమ బాలికల పాఠశాలకు వెళ్లే రహదారి రెండింటికి పక్కనే ఉండడంతో నిత్యం వేలాది వాహనాలు ఆ రహదారి వెంబడి ప్రయాణాలు సాగిస్తుంటారు. సింగిల్ రహదారి కావడంతో ఒకవేళ ఏదైనా పెద్ద వాహనం ఎదురుగా వచ్చినప్పుడు ద్విచక్ర వాహనాలు కానీ ఆటోలు మ్యాజిక్ లాంటి వాహనాలు పూర్తి గా రోడ్డు దిగి వెళ్లాల్సి వస్తుంది అటువంటి సమయంలో రోడ్డు అనుకొని చాంబర్లు ఉండడంతో ఏమైనా ప్రమాదాలు జరిగితే ప్రాణాలకే ప్రమాదం అంటూ గ్రామ ప్రజలు, ప్రయాణికులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. వర్షాకాలం సమయంలో గ్రామం మధ్యలో ఉండడంతో పైన ఎటువంటి మూతలు లేకపోవడంతో చిన్నపిల్లలు అటుగా ఆడుకుంటూ వెళ్లి ఆ ఛాంబర్లలో పడే ప్రమాదం సైతం పొంచి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఇదేవిధంగా ఛాంబర్లు పైన మూత లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ చాంబర్ల పై ఏమైనా మూతలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.



# మత్తులో ఏజెన్సీ యువత

- విచ్చలవిడిగా మత్తు పదార్థాలు అమ్మకాలు
- మత్తు పదార్థాలు సేవించి విచక్షణ కోల్పోతున్న యువకులు
- బానిసలుగా మారుతున్న యువత, విద్యార్థులు..
- ఆందోళనలో తల్లిదండ్రులు
- మండలంలో గంజాయి స్పాట్ లను కనుగొంటున్నం
- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కరకగూడెం,మార్చి 26(మనం న్యూస్): కరకగూడెం మండలంలోని ప్రధాన గ్రామాల్లో యువత గంజాయి మత్తులో తూగుతున్నారు. సరదాగా మొదలవుతున్న మత్తుపదార్థాల వాడకం క్రమంగా వ్యసనపరులుగా మార్చేస్తుంది. కరకగూడెంలో యువత, పలువురు విద్యార్థులు, మైనర్లు సైతం గంజాయి, సారా, వైట్నర్ పీలుస్తూ మత్తులో మునిగితేలుతున్నారు.

తల్లిదండ్రులకు సైతం అనుమానం రాకుండా రాత్రివేళ కంబైన్డ్ స్టడీ పేరిట గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది.మత్తులో క్రికెట్బెట్టింగ్,ఆన్లైన్గేమ్లు పేరిట లక్షల్లో పోగొట్టుకుని తల్లి దండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు.కరకగూడెం మండలానికి పక్కా జిల్లాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా అవుతోంది. విద్యార్థులు యువకులు మత్తుకు బానిసలై సర్వం పోగొట్టుకుంటున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ, పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. మత్తు పదార్థాలతో జరిగే నష్టాలను తల్లిదండ్రులు వివరించాలని కోరుతున్నారు.



మండలంలో గంజాయి స్పాట్ లను కనుగొంటున్నంఃఎస్సై రాజేందర్





విద్యార్థులు యువకులు మత్తులో మునుగుతూ ఉండడంతో మనం తెలుగు దినపత్రిక వివరణ అడగగా. మనం తో ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ. మండలంలో మత్తు పదార్థాలు గంజాయి పైన ప్రత్యేక నిగా ఉందని మండలంలో గంజాయి సేవించే స్పాట్ లను కనుగొంటున్నామని ఆయన తెలిపారు. గ్రామీణ వ్యవస్థలో యువకులు, విద్యార్థుల పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల అలవాట్లు వారి అభిరుచులను తెలుసుకొని సక్రమమైన మార్గంలో ఉంచాలని తెలిపారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు చట్టాలు నూతన న్యాయవ్యవస్థ శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. బట్టుపల్లి, పద్మాపురం, సీతారాంపురం ప్రధాన కేంద్రాలలో విద్యార్థులు చెడు వ్యసనాలకు ఎక్కువగా బానిసలు అవుతున్నారని ఆ ప్రాంతాలలో పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని. అత్యాశకు పోయి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఆయన అన్నారు. గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే 100 కు ఫోన్ చేయాలని కోరారు.

# ప్రతి విద్యార్థికి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

- ఖమ్మం జిల్లా ముఖ్య ప్రణాళిక మండల ప్రత్యేక అధికారి ఏ. శ్రీనివాస్



మధిర,మార్చి26(మనం న్యూస్): మధిరమండల పరిధిలోని రాయపట్నం గ్రామంలో గల ఎంపియు పిఎస్ పాఠశాలను ఖమ్మం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మరియు మండల ప్రత్యేక అధికారి అయిన ఏ శ్రీనివాస్ ,స్థానిక ఎం పి డి ఓ బి. వెంకటేశ్వర్లుతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండారో లేదో చూశారు. కూర, అన్నం వండడానికి ఉపయోగించే బియ్యం ,వంట పాత్రల గదులను పరిశీలించినారు. విద్యార్థులు ప్లేట్లను ఏ వాటర్ తో కడుగుతున్నారు, డ్రింకింగ్ వాటర్ ఏవి తాగుతున్నారు. అన్నం తినేముందు చేతులు ప్లేట్లు కడుగుతున్నారో లేదో పరిశీలించినారు. బాలికల, బాలుర టాయిలెట్స్ ను పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. పాఠశాలలో భోజనం ఉండే గది, బియ్యం వంట పాత్రల గది, విద్యార్థులు భోజనం చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఎప్పటికప్పుడు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. టాయిలెట్స్ ను ప్రతిరోజు శుభ్రం చేయించే విధంగా చర్యలను తీసుకోవాలని హెచ్ఎం డేవిడ్ రాజు సూచించారు. మధ్యాహ్న భోజన లో కూరకు ఉపయోగించే వంట ఆయిల్ , కూరల్లో ఉపయోగించే పదార్థాల క్వాలిటీ గురించి అక్కడ వంట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వారంలో విద్యార్థులకు అందవలసిన గుడ్లు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు స్పెషల్ ఆఫీసర్. అనంతరం విద్యార్థులతో మరియు ఎం పి డి ఓ హెచ్ఎం తో కలిసి భోజనం చేసినారు. భోజనం చేసిన తర్వాత భోజనం, కూర చాలా రుచిగా బాగున్నాయని వంట ఉండే రమాదేవిని అభినందించారు. పాఠశాల పరిశుభ్రంగా ఉన్నదని టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉన్నాయని స్వీపర్ కృష్ణ కుమారిని, కుమారిని, సుబ్బారావుని అభినందించారు. పాఠశాల హెచ్ఎం డేవిడ్రాజు తో ప్రతిరోజు మెనూ ప్రకారమే ప్రభుత్వం వారు చెప్పిన విధంగా విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని, పాఠశాల పరిశుభ్రంగా ఉండాలని, టాయిలెట్స్ ను ప్రతిరోజు బ్లీచింగ్, ఫినాయిల్, వాటర్ తో శుభ్రం చేయాలని, పిల్లలకి డ్రింకింగ్ వాటర్ ను గ్రామ పెద్దల సహాయంతో మినరల్ ప్లాంట్ వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు అజయ్ కుమార్, విజయ , జనార్దన్ రెడ్డి, విశ్వనాథం ఉన్నారు.

# వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



- లీకేజీలు ఆగేదెప్పుడు

ఆళ్లపల్లి, మార్చి 26(మనం న్యూస్): ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసింది. ప్రతి ఇంటికి దరి చేరవలసిన మిషన్ భగీరథ నీరు నిత్యం ఏదో ఒకచోట లీకేజీల కారణంగా వృధాగా పోతూనే ఉంది. ఆ తాగు నీటిని ప్రతి ఇంటికి అందించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని రామానుజగూడెం బండారుగూడెం గ్రామాల మధ్యలో పైప్ లైన్ లీకేజీ అవడంతో నీరు భారీగా పక్కనే ఉన్న వాగులోకి వృధాగా పోవడం జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మిషన్ భగీరథ పైపు లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మత్తులు చేసి స్వచ్ఛమైన నీరు అందించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిరాల ప్రతినిధి, మార్చి26(మనం న్యూస్)ః జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం, కొనుగోలుపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై ఏర్పాటు చేసిన సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాలలో, గ్రామాలలో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనేలా రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ పత్తి





విత్తనాలతో పట్టాదారు, కౌలు రైతులు పంట సాగు చేసినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిపివేయడం జరుగుతుందని, దళారులపై పి.డి. యాక్టు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. హెచ్.టి. కాటన్ సాగు చేసిన రైతులు గ్లైఫోసేట్ కలుపు మందు పిచికారీ చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని, బస్టాండ్, రైల్వేస్టేషన్, జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్లు, ఎ.డి.ఎ.లు, ఎస్.ఐ.లు, మండల వ్యవసాయ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలి

గార్ల, మార్చి 26(మనం న్యూస్)ః ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం.విజయ నిర్మల దుకాణదారులను హెచ్చరించారు. బుధవారం గార్ల మండలంలో పలు ఎరువుల దుకాణాలలో డిఏఓ విజయ నిర్మల ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, రిజిస్టర్ లు ,బిల్లు బుక్స్, ఇన్వాయిస్ లు లైసెన్స్ మరియు ఓ ఫారంలు పరిశీలించి సరిగా మెయింటైన్ చేయకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు బిల్లుపై రైతు సంతకం ఉండాలని, అనుమతి వున్న ఎరువులనే అమ్మాలని అనుమతి లేని వాటిని మరియు లైసెన్స్ లో ఓ ఫారం పొందపరచి లేని ఎరువులను అమ్మితే శాఖ పరమైన చర్యలు తీసుకొంటామని, షాప్ లో స్టాక్ బోర్డు రైతులకు కనబడే విధంగా అమర్చాలని పేర్కొన్నారు. గడువు



దాటిన ఎరువులు మరియు పురుగు మందులు అమ్మకం జరిపినట్లు పిర్యాదు వస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించబొమని అన్నారు.రైతులకు ఆధార్ కార్డు ద్వారా ఈపాస్ మెషిన్ నుంచే ఎరువులు అమ్మాలని తనిఖీకి వచ్చినప్పుడు ఈపాస్ మెషిన్ లో వున్న స్టాక్స్ గోడౌన్ స్టాక్స్ జిస్టర్ లో వున్న స్టాక్స్ తో సరిపోవాలని సూచించారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి రామారావు పాల్గొన్నారు.

# ప్రావిడెంట్ ఫండ్ ని తక్షణమే ఉపసంహ రించుకోవచ్చు

- కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమితా దావ్రా

మంచిర్యాల, మార్చి 26, ( మనం న్యూస్)ః ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఇపీఎఫ్ఓ 2025 మే నెలాఖరు లేదా జూన్ ప్రారంభంలో ఒక పెద్ద మార్పు చేయబోతోంది. ఈ కొత్త మార్పుతో, ఇపీఎఫ్ఓ సభ్యులు యూపిఐ మరియు ఎటిఎం ల ద్వారా తమ ప్రావిడెంట్ ఫండ్ ని తక్షణమే ఉపసంహ రించుకోవచ్చు .ఈ నవీకరణతో, ఉద్యోగులు తమ పీఎఫ్ పొదుపులను యాక్సెస్ చేయడానికి ఇకపై సుదీర్ఘమైన, సమయం తీసుకునే ప్రక్రియల ద్వారా వెళ్లవలసిన అవసరం ఉండదు . ఈ చొరవ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ సహకారంతో అమలు చేయబడుతోంది.ఈ ప్రక్రియ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంఛి ఆమోదం పొందింది.ఈ దశతో, దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఇపిఎఫ్ఓ సభ్యులు గతంలో కంటే మెరుగైన సౌకర్యాలను పొందుతారని భావిస్తున్నారు. ఉద్యోగులు వెంటనే లక్ష రూపాయల వరకు విత్డ్రా చేసుకోవచ్చని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. సభ్యులు యూపీఐ ప్లాట్ఫామ్లో నేరుగా తమ పీఎఫ్ బ్యాలెన్స్ను తనిఖీ చేసుకోగలరని, ఎటువంటి ఆలస్యం లేకుండా వారు ఇష్టపడే బ్యాంకు ఖాతాలకు నిధులను బదిలీ చేసుకోగలరని ఆయన అన్నారు.ఇది అవసరమైన సమయాల్లో ఉద్యోగులు తమ డబ్బును సులభంగా పొందేందుకు వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం, పీఎఫ్ నిధులను ఉపసంహరించుకోవడానికి ఆన్లైన్లో క్లెయిమ్ను సమర్పించి ఆమోదం కోసం వేచి ఉండాల్సి వస్తోంది . దీనికి చాలా రోజులు లేదా వారాలు పడుతున్నాయి. అయితే, యూపీఐ, ఇంటిగ్రేషన్తో, ఉపసంహరణలు తక్షణమే మరియు ఇబ్బంది లేకుండా మారతాయి.ఉద్యోగులు త్వరగా నిధులను ఉపసంహరించుకోగలడం, అంతేకాకుండా వారి బ్యాలెన్స్లను తనిఖీ చేసుకుని తక్షణమే లావాదేవీలు చేసుకోవచ్చు . ఇది కాకుండా, ఇపీఎఫ్ఓ తన సభ్యులకు పీఎఫ్ పొదుపులను ఉపసంహరించుకోవడానికి గల కారణాలను కూడా విస్తరిస్తోంది. వైద్య అత్యవసర పరిస్థితులతో పాటు, ఉద్యోగులు ఇప్పుడు గృహనిర్మాణం, విద్య, వివాహం కోసం నిధులను ఉపసంహరించు కోవచ్చు .ఈపీఎఫ్ఓ 120 కి పైగా డేటాబేస్లను అనుసంధానించడం ద్వారా దాని డిజిటల్ మౌలిక సదుపాయాలలో గణనీయమైన మెరుగుదలలు చేసింది. ఈ ప్రయత్నాలు క్లెయిమ్ ప్రాసెసింగ్ సమయాన్ని కేవలం మూడు రోజులకు తగ్గించాయి, 95 శాతం క్లెయిమ్లు ఇప్పుడు స్వయంచాలకంగా ప్రాసెస్ చేయబడుతున్నాయి. వ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయడానికి మరిన్ని అప్గ్రేడ్లు జరుగుతున్నా యి‘ అని దావ్రా అన్నారు.ఈపిఎఫ్ఓ డిజిటల్ చొరవల నుండి పెన్షనర్లు కూడా ప్రయోజనం పొందారు. డిసెంబర్, 2024 నుంఛి దాదాపు 78 లక్షల మంది పెన్షనర్లు తమ నిధులను ఏ బ్యాంకు శాఖ నుండైనా ఎటువంటి పరిమితులు లేకుండా పొందగలిగారు. గతంలో, నిర్దిష్ట బ్యాంకు శాఖల నుండి మాత్రమే ఉపసంహరణలు అనుమతించబడ్డాయి.

# ప్రయాణికుల సురక్షిత ప్రయాణం,భద్రత కోసం మై ఆటో ఈస్ సేఫ్

- మెట్ పల్లి పట్టణంలో 346 ఆటోలకి యు ఆర్ కోడ్ తో అనుసంధానం
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి మార్చి 26 (మనం న్యూస్) మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు సురక్షిత ప్రయాణం, భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మై ఆటో ఈస్ సేఫ్ అనే కార్యక్రమం ను మెట్ పల్లి పట్టణంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత, భద్రత కొరకు మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. జగిత్యాల జిల్లాలో 4000 లకు పైగా ఆటోలు ఉన్నాయని ఇప్పటి వరకు 2500 లకు పైగా ఆటోలకు క్యూఆర్ కోడ్ తో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో మిగతా ఆటోలో కూడా ఈ యొక్క స్టిక్కరింగ్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు మెట్ పల్లి పట్టణంలో సుమారు 346 ఆటో లకు (ఆటో ముందు, వెనక, డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా) స్టిక్కరింగ్ చేయడం జరిగిందని ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు మై ఆటో ఈస్ సేఫ్ అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలని సూచించారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఏదేనా సమస్య ఎదురైతే ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల క్యు ఆర్ కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుంది వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లెంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు పోలీస్ వారు అ యొక్క సమాచారం ఆదారంగా వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. జిల్ల లో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా సురక్షిత ప్రయాణం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను సందర్శిస్తూ వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమదల నివారణలో ఆటో డ్రైవర్లు కూడా భాగస్వాములై ట్రాఫిక్



నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రాములు, ఆర్టీవో శ్రీనివాస్, మెటపల్లి సీ.ఐ అనిల్ కుమార్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్,రాజు,పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు,ఓనర్స్ పాల్గొన్నారు..

# బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఇబ్బందులు కలిగించవద్దు

- సిరసనగండ్ల గుట్ట మీ సీతారామచంద్రస్వామి దేవస్థానం
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**చారకొండ, మార్చి 26(మనం న్యూస్):** రెండవ అపర భద్రాదిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం శిరసనగండ్ల గుట్ట బ్రహ్మోత్సవాలు వచ్చేనెల ఏప్రిల్ 5న మొదలవుతున్న సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కొరకు అధికారులతో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం దేవాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆలయ సంప్రదాయాలతో ఆలయ చైర్మన్ రామశర్మ,ఈవో ఆంజనేయులు ఎమ్మెల్యేను సన్మానించి అనంతరం ఎమ్మెల్యేకు పూజలు నిర్వహించారు.అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆరోగ్య సమస్యల వలన రాలేకపోయారని, వారు త్వరగా కోలుకొని రాముల వారి కల్యాణానికి ప్రజల ముందుకు రావాలని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండవ అపర భద్ర దిగా పేరుగాంచిన శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఏకశిలా గుట్టపై కొలువు దీర్నారని,ఈ దేవాలయానికి డేరం వంశస్థులు పూర్వికులు తెలిపిన సమాచారం ప్రకారం కొన్ని ఏండ్ల చరిత్ర ఉందని,ఈ దేవస్థాన బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా,హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలనుండే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారని వచ్చే భక్తులకు దేవస్థాన నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే బాధ్యత మన అందరి పైన ఉందని ఈ సందర్భంగా అన్నారు.మొదటగా భక్తులకు ఇబ్బంది కలగకుండా మంచినీరు వసతిని తలెత్తకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ నీరును 24 గంటలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని,బ్రహ్మోత్సవాలలో విద్యుత్ సమస్యల తర్వాత కొండ చూసుకోవాలని అధికారులు సూచించారు.వచ్చే భక్తులకు ఎండాకాలం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అందుబాటులో ఉండాలని,దేవస్థానం చుట్టుపక్కల మద్యపానం అమ్మకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.పోలీసు నిఘ డి.ఎస్.పి,సీఐ,ఎస్ఐ ల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవంచనియ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని,రోడ్డు రవాణా సంస్థ కల్వకుర్తి డిపో ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణ్ ఉత్సవం,పెద్దవ్రతం రోజు ఉచితంగా కింది నుండి గుట్ట పైకి రెండు బస్సులు ఏర్పాటు చేయుటకు ఆర్టీసీ వారు సిద్ధంగా ఉన్నారని,భక్తులను దృష్టిలో ఉంచుకొని ఉచితంగా ప్రయాణం ఏర్పాటుకు సిద్ధం చేశారు.వచ్చే భక్తులకు దేవాలయంలో దర్శనాలకు అంతరాయం కలగకుండా, అదేవిధంగా దేవాలయ పరిసర ప్రాంతాలలో గుట్టపైన క్రింద ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని భక్తులకు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో చారకొండ మాజీ జెడటిసి పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్,కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పండితరావు,ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి,తాసిల్దార్ సునీత, ఎంపీడీవో ఎండి ఇస్సాకు హుస్సేన్,ఎంపీ ఓ వెంకటేష్,చారకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలరాం గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్యా గౌడ్,నాగర్ కర్నూల్ డిసిసి ఉపాధ్యక్షులు జూపల్లి వెంకటయ్యా యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేందర్,కల్వకుర్తి మార్కెట్ కమిటీ సభ్యులు ముజుభాయ్,జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్,మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్ గౌడ్, వెల్దండ మండల మాజీ ఉపాధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాధగొని సాంబయ్య గౌడ్,సిపిఐ నాయకులు డాక్టర్ శ్రీను, జెసిబి వెంకటయ్య,శ్రీను,మండల వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాల పెద్దలు,యువకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
- మైనార్టీ గురుకుల విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 26 (మనం న్యూస్):** రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రం భగీరథకాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల1, 2, 3 పాఠశాల సముదాయంలో కింగ్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో బుధవారం కరాటే శిక్షణ తీసుకున్న బాలికలకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడం కోసం ఇటీవలే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆరట్స్ నేర్చుకోవాలని కోరారు. గత కొన్నేళ్ల నుంచి మాస్టర్ జహంగీర్ పాషా ఖాద్రీ విద్యార్థులకు, యువతకు కరాటే శిక్షణ ఇస్తుండడం అభినందనీయమని అన్నారు. కరాటే మార్షల్ ఆరట్స్ వల్ల మానసికంగా ధృడంగా ఉండవచ్చని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు కరాటే, క్రీడల్లో రాణించాలని కోరారు. కింగ్ షోటోకాన్ ఫౌండేర్ జహంగీర్ పాషా ఖాద్రీ మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ ప్రతిభచాటి గ్రాండ్ చాంపియన్ లో కె. మమత ప్రథమ అప్పరబేగం ద్వితీయ, కె. ప్రణీత తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు వైట్ టూ బ్లూబెబెల్టు ప్రమోషన్ ను మమత, అప్పరబేగం, కీర్తన, సాధిక, ప్రణీత పొందినట్లు తెలిపారు. వైట్ టూ ఎల్లో బెల్టును 18 మంది. వైట్ టూ ఆరెంజ్ బిల్లును 39 మంది సాదించినట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ కొత్వాల్ బాలికలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్, ఆర్ఎల్సీ ఖాజా బాహుద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎండి సలీం, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, ఆయా మైనార్టీ బాలికల గురుకులాల ప్రిన్సిపల్స్ లక్ష్మి, శ్రీదేవి, సురేఖ, పీఈటీలు పాతిమా బేగం, అనూష, చైతన్య, రాణి , బ్లాక్ బెల్ట్ విద్యార్థులు మారియా బేగం, నేహా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# మానవ జన్మ దేవుడిచ్చిన గొప్ప వరం



- ఆధ్యాత్మిక ప్రవచకులు బుర్రా భాస్కర శర్మ

**కోరుట్ల, మార్చి 26 (మనం న్యూస్)** అతి పురాతన దేవాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ బుర్ర భాస్కర శర్మ చే భాగవత సప్తాహం ప్రవచన కార్యక్రమం ఏడవ రోజు ఆసక్తికరంగా జరుగగా గురూజీ చెప్పే ప్రవచనం వచ్చిన భక్తులను అకట్టుకుంది. ఈ సందర్భంగా బుధవారం రోజు శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, కంసుని సంహరించడం, భగవద్గీత బోధనలు, జీవన వృత్తాంతం, గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్త సురేష్, తునికి భాస్కర్, కొత్త సుధీర్, అల్లాడి ప్రవీన్, నీలి కాశీనాథ్, రేగుంట ప్రసాద్, ఉత్తూరి మారుతి, బచ్చు శ్రీనివాస్, కోటగిరి చంద్రపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల లో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**హైదరాబాద్, మార్చి 26(మనంన్యూస్):** మాదకద్రవ్యాల వల్ల సమాజంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు, నేరాలు, కుటుంబాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా జ్యోతి ప్రజ్వలన ద్వారా ప్రారంభించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన పోస్టర్ విడుదల, అవగాహన ప్రసంగాలు,మాదకద్రవ్యాలపై ప్రతిజ్ఞ స్వీకరణ, మాదకద్రవ్యాల వ్యాప్తి - సమాజంపై దుష్ప్రభావాలు, ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై చూపించే ప్రభావంపై స్పష్టమైన అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, కుటుంబాల్లో విచ్ఛిన్నం, ఆర్థిక నష్టం, నేరాల పెరుగుదల, విద్యా మరియు ఉద్యోగ అవకాశాల కోల్పోవడం వంటి అనేక సమస్యలు ఏర్పడతాయని వివరించారు. సమాజంలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీసులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సామాజిక సేవా



సంస్థలు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వల్ల కలిగే హానికారక ప్రభావాలను గుర్తించి, వాటిని నిర్మూలించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వైద్యులు, విద్యార్థులు, ఇతర అధికారులు కలిసి 'మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషి చేస్తాం' అనే ప్రతిజ్ఞ చేశారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, కఠిన చట్టాలు, నిఘా చర్యలు చేపట్టడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపనాన్ని నియంత్రించవచ్చని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్ శాఖ, వైద్యశాఖ, ఎక్సైజ్ శాఖ కలిసికట్టుగా చేపడుతున్న చర్యల గురించి సమగ్రంగా వివరించారు. ప్రజల సహకారంతో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వెల్ఫేర్ అధికారి జేరిన, అదనపు ఎస్పీ రాములు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సంపత్ కుమార్, డీఎస్పీ వెంకేశ్వర్లు, టీజీనాబ్ డీఎస్పీ బుచ్చయ్య, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, వైద్య కళాశాల డైరెక్టర్/ప్రిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, కిరణ్మయి, మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# శ్రీ సీతారాముల కళ్యాణం లో పాల్గొనండి సకల సమస్యల నుండి విముక్తి పొందండి



- ఆలయ కమిటీ అధ్యక్షులు మురళి

**కోరుట్ల మార్చి 26 (మనం న్యూస్)** కోరుట్ల పట్టణంలో ఎంతో ప్రాముఖ్యత పొందిన శ్రీ సీతారామాలయం లో ప్రతి యేటా శ్రీ సీతారాముల కళ్యాణం నిత్య నూతనంగా వైభవోపేతంగా నిర్వహించడం ఇక్కడ కోరుట్ల పట్టణ ప్రజల ఆలయ కమిటీ ప్రత్యేకత. ఇట్టి శ్రీ సీతారాముల కల్యాణం ఏర్పాట్లకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎప్పటికప్పుడు ప్రజల ఆలోచనల మేరకు భక్తుల సౌకర్యార్థం మేరకు శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కోరుట్ల పుర ప్రముఖుల, కుల, యువజన సంఘాల నేతృత్వంలో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. శ్రీ రామ నవమి వేడుకలను పురస్కరించుకొని అఖిల భారత దండి పీఠాధిపతి తెలంగాణ వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో కోరుట్ల పట్టణంలోని శ్రీ సీతా రామాలయంలో ఈ సంవత్సరం మొదటి సారిగా వసంత నవరాత్రోత్సవములు శతరుద్ర సహిత శత చండీ యాగ మహోత్సవములు అత్యంత వైభవోపేతంగా జరుపాలని ఆలయ కమిటీ అధ్యక్షులు నూతన సభ్యుల నేతృత్వంలో నిశ్చయించారు. ఈ వేడుకలకు పీఠాధిపతులు నాగ సాధువులు ప్రముఖ ప్రవచకుల ఆద్వర్యంలో మార్చి 30వ తేదీ ఆదివారం రోజు నుండి ఏప్రిల్ 4 సోమవారం రోజు వరకు ఆలయ కమిటీ, కోరుట్లపట్టణ ప్రజల సమన్వయంతో అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. అందుకు సంబంధించిన మంగళహ్వాన కర పత్రికను శ్రీ సీత రామాలయ

అధ్యక్షులు వనతడుపుల మురళీ కార్యదర్శి అలువల ప్రభాకర్, రవి, చిద్రాల రాములు, సునీల్, శంకర్, నారాయణ ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు కలిసి విడుదల చేశారు.

# మత్స్యగిరి గుట్ట హుండీ లెక్కింపు



**వలిగొండ, మార్చి 26(మనం న్యూస్):** వలిగొండ మండలం వెంకటాపురం శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలు హుండీ లెక్కించగా 4 నెలల 10 రోజులకు గాను 18 34671 అక్షరాల 18 లక్షల 34 వేల 671 రూపాయలు ఆదాయం రాగా స్వామివారి కళ్యాణ కట్నములు 30 వేల 380 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్ మోహన్ బాబు తెలిపారు. ఈ లెక్కింపు సహాయ కమిషన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ వారి డిప్యూటీ చేయబడిన నిఖిల్, జూనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో ఉండి లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో ధర్మకర్తలు ఆర్ ప్రభాకర్, అంజయ్య, కరుణాకర్, బాలేశ్వర్, కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్ బాబు, వీరేందర్ రెడ్డి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# సొరంగంలో ఇంకా ఆరుగురు కొనసాగుతున్న సహాయకచర్యలు

**నాగర్ కర్నూల్ ప్రతినిధి మార్చి 26 (మనం న్యూస్):** నిరంతరాయంగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలు,ఊట నీటి పంపింగ్ ప్రక్రియ,బుధవారం ఎస్ఎల్బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై సహాయక చర్యల పర్యవేక్షణ కొరకు నియమించబడిన ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి, ఐఏఎస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు టన్నెల్లో చిక్కుకోగా, ఇద్దరి మృతదేహాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు, మిగిలిన ఆరుగురి కోసం సహాయక చర్యలను వేగవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ లోపల సహాయక బృందాలు నిరంతరం పూర్తి స్థాయిలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు,4 ఎస్కేవేటర్ లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తు, మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి తరలిస్తున్నట్లు, మట్టి తవ్వకాలకు అడ్డుపడుతున్న టీబీఎం భాగాలను తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని టన్నెల్ లోపల 2.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 150 హెచ్ పి సామర్థ్యం గల 5 పంపింగ్ స్టేషన్ ల ద్వారా నిమిషానికి 3600 లీటర్ నీటిని కృష్ణా నదిలోకి పంపుతున్నట్లు తెలియజేశారు. ఉన్నత స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో వుంటూ సహాయక బృందాలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు వివరించారు.టన్నెల్ లో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు 24 గంటలపాటు నిరంతరం సహాయక బృందాలు శ్రమిస్తున్నయని, మట్టి తవ్వకాల అనంతరం లోకో ట్రాక్ ను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో, ఆర్మీ అధికారి వికాస్ సింగ్ ,ఎన్ డి ఆర్ ఎఫ్, అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య , నాగర్ కర్నూల్ ఆర్డిఓ సురేష్ , ఎస్ డి ఆర్ ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్, జే పి, కంపెనీ ప్రతినిధులు అక్కడే పర్యవేక్షణలో ఉన్నారు .




# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఇందిరమ్మ ఇండ్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, మార్చి 26(మనం బ్యూరో):** మండలాల్లోని పైలట్ గ్రామాలలో మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి మండల కేంద్రంలో చేపట్టిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పురోగతి, పైలెట్ గ్రామాలలో గ్రౌండ్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల స్థితిగతుల వివరాలపై కలెక్టర్ మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పైలెట్ గ్రామాల్లో ఎంపిక చేసిన 850 లబ్ధిదారులలో ఇంటి నిర్మాణానికి ముందు డబ్బులు పెట్టుకోలేని 369 మంది నిరుపేదలు ఉంటే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని నిర్ణయించామని అన్నారు. వారం రోజుల వ్యవధిలో వీరందరికీ రుణాలు అందించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రాలలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఆరు మండల కేంద్రాలలో పనులు పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, సంబంధిత కాంట్రాక్టర్ తో అధికారులు మాట్లాడాలని, వచ్చే బుధవారం నాటికి ఇక్కడ పనులలో వేగం పెరిగి రెండు వారాలలో పనులు పూర్తి చేయలేని పక్షంలో సంబంధిత కాంట్రాక్ట్



రద్దు చేసి ఇతరులకు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న మోడల్ హౌస్ నిర్మాణం పనుల వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి తక్కువ ఖర్చుతో మంచి ఇంటిని ఎలా నిర్మించుకోవాలో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణం ముందు సంపూర్ణ అవగాహన అందేలా చూడాలని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మమైన కార్యక్రమమని, ప్రారంభించిన ఇండ్లు ఎట్టి పరిస్థితుల్లో మధ్యలో ఆగిపోవడానికి వీలు లేదని, ప్రణాళిక ప్రకారం జాగ్రత్తగా మన జిల్లాకు మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతి దశలో అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ నాణ్యతతో కూడిన ఇంటి నిర్మాణం జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాలలో ఒంటరి మహిళలకు ఎవరికైనా ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే ఇంటికి సంబంధిత ఎంపీడీవో, ఎంపీఓ లేదా పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు తీసుకొని నిర్మాణ పనులు జరిగేలా చూడాలని అన్నారు. మిగిలిన లబ్దిదారులు ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేసుకొని త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని అన్నారు. జిల్లాలో మంజూరైన 850 ఇందిరమ్మ ఇండ్ల పనులు గ్రౌండ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, వారం రోజులలో వీరంతా తప్పనిసరిగా మార్క్ ఔట్ జరిగేలా చూడాలని కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఎల్ 1, ఎల్ 2 విభాగాలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పూర్తి వివరాలను అందించాలని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పి సీఈవో దీక్ష రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య , ఈఈ హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, ఈఈ పంచాయతీ రాజ్ వెంకటరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూసారాన్ని రక్షించి భూగర్భ జలాలను కాపాడాలి

**తిరుమలగిరి మార్చి 26 మనం న్యూస్:** వేసవికాలం ఎండ తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటి పోకుండ నీటి నిలువలు చెక్ డ్యాములు ఊరకుంటల సామర్థ్యం పెంచాలని నీటిని పొదుపుగా వాడుకోవాలని సాంస్కృతిక సారధి సూర్యాపేట జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. బుదవారం మండలంలోని తొండ గ్రామంలో సాంస్కృతిక కళాశాలది కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడకం ఆరోగ్యానికి హానికరమని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు. గడ్డం ఉదయ్. వెన్నెల నాగరాజు. మాగి శంకర్. పాక ఉపేందర్. మేడిపల్లి వేణు. మద్దిరాల మంజుల. సిరిపంగి రాధ. నెమ్మాది స్రవంతి. పోతరాజు శిరీష. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మానవతా సదన్ చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఆకాంక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




**నిజామాబాద్ రూరల్, మార్చి 26(మనంన్యూస్):** డిచ్‌పల్లిలోని మానవతా సదన్ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకాంక్షించారు. డిచ్పల్లి టోల్ వే (అథాంగ్) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సుమారు 45 లక్షల రూపాయలను వెచ్చిస్తూ మానవతా సదన్ లో నూతనంగా వివిధ సదుపాయాలను సమకూర్చడం జరిగింది. స్టడీ రూమ్, రెండు టాయిలెట్లు, ఫ్రిడ్జ్, భారీ స్క్రీన్ తో కూడిన టెలివిజన్, సదన్ ఆవరణలో ఆర్.సి.సి సిట్టింగ్ బెంచీలు, వంట పాత్రలు, ఇతర సామాగ్రిని సదన్ కు వితరణ చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం మానవతా సదన్ ను సందర్శించి, నూతన నిర్మాణాలు, వస్తువులకు లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. సదన్ లోని కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రరీ తదితర వాటిని కలెక్టర్ సందర్శించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సదన్ కు చెందిన బాలికలు ఎంతో అందంగా కుండలపై, గాజు సీసాలపై రూపొందించిన కళాకృతులను, ఆకట్టుకునే రీతిలో చిత్రించిన పెయింటింగ్ లను పరిశీలించి అభినందించారు. సదన్ నిర్వహణ తీరుతెన్నుల గురించి ఎంతో ఆసక్తితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనాథ బాలలను అన్నివిధాలుగా ఆదుకునేందుకు వీలుగా ఇదివరకు జిల్లాలో కలెక్టర్ గా కొనసాగిన ప్రస్తుత రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా తన హయాంలో 2016లో నెలకొల్పిన మానవతా సదన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. సదన్ లోని బాలలను సిబ్బంది తమ సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడం వల్ల అనేకమంది ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగం తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఐ.ఏ.ఎస్, ఐ.పీ.ఎస్ లుగా కూడా రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, అంకిత భావం, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. తాము అనాథలం, తమకు తల్లితండ్రులు లేరు అనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందని, ఈ దిశగా డిచ్‌పల్లిలో టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కూడా ముందుకు వచ్చి తోడ్పాటును అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరినప్పుడే మానవతా సదన్ ఆశయాలు, లక్ష్యాలు పూర్తి స్థాయిలో నెరవేరినట్లు అవుతాయని అన్నారు. అన్ని రంగాల్లో సత్తా చాటుతూ, ఇతరులకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. సదన్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మానవతా సదన్ లైజనింగ్ ఇంచార్జ్ సుధాకర్, కేర్ టేకర్ రమేష్, టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్, రిషా, రోడ్ సేఫ్టీ విభాగం అధికారి హర్ష, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



- డిపిఎం సాయిలు

**భీంగల్, మార్చి 26(మనంన్యూస్):** మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిజామాబాద్ డిపిఎం సాయిలు... బుధవారం భీంగల్ మండల సమైక్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధికతపై గ్రామ సంఘం అధ్యక్షులు వివోఏ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. డిపిఎం సాయిలు మాట్లాడుతూ:ఏ పని చేతకాని వారు సులభంగా డబ్బు సంపాదించారన్న దురాచారాల వల్ల మానవ అక్రమ రవాణాకు ప్రయత్నిస్తున్న అన్నారు . దీనిపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ,. వారు రోజువారి దినచర్యకు ఎప్పటికప్పుడు గమనించాలని మహిళలకు సూచించారు. మానవ అక్రమ రవాణా ద్వారా లైంగిక దోపిడీ అవయవ దోపిడీ ల పట్ల మహిళలకు చైతన్యం చేయాలని కోరారు. గ్రామ సంఘం అధ్యక్షులు గ్రామాలలో ప్రతి సంఘం సమావేశంలో ఈ అంశాన్ని మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ ఆధారిత అక్రమ రవాణా లైంగిక వేధింపులు రవాణా చట్టాలపై అవగాహన ,. సైబర్ నేరాలు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అధికారులు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గంగ సాయిలు, రఘు, భాస్కర్ , గంగాధర్ , సుమలత, గంగా లలిత, గణేష్ , ముత్యం, అరుణ,మహిళా సంఘాల అధ్యక్షురాలు మరియు వివోఏలు పాల్గొన్నారు...

# ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుల కోసం వన్ టైం సెటిల్మెంట్

- ఒకే విడతలో చెల్లిస్తే 90 శాతం బకాయి వడ్డీ మాఫీ వర్తింపు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి



**నిజామాబాద్, మార్చి 26(మనం ప్రతినిధి):** ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులపై రాయితీ సదుపాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ ను అమలు చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఆస్తి పన్ను బకాయి ఉన్న వారు నిర్ణీత గడువు లోపు ఒకే విడతలో బకాయిలు చెల్లిస్తే, 90 శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని అన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే వన్ టైం సెటిల్మెంట్ ను ప్రభుత్వం అమలు చేయగా, ప్రజల నుండి వచ్చిన అభ్యర్థన మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తరాలు జారీ చేసిందని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ఏక కాలంలో, ఒకే విడత కింద చెల్లిస్తే 90శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆస్తి పన్ను బకాయి పడిన వారు ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించి వడ్డీ రాయితీ వడ్డీ రాయితీ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని హితవు పలికారు. గడువులోపు వన్ టైం సెటిల్మెంట్ కింద ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికే ఈ అవకాశం వర్తిస్తుందని అన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ ప్రజలను కోరారు. కాగా, వన్ టైం సెటిల్మెంట్ పథకం అమలులోకి రాకముందే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మార్చి 2025 వరకు వడ్డీ, జరిమానాలతో కలిపి మొత్తం ఆస్తి పన్ను బకాయిలను చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు, వారి భవిష్యత్తు చెల్లింపులలో రాయితీని సర్దుబాటు చేస్తారని కలెక్టర్ తెలిపారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**నిజామాబాద్, మార్చి 26(మనంప్రతినిధి):** ప్రభుత్వాన్ని నిలదీస్తాం హక్కులను సాధిస్తామని,హామీల అమలు కోసం వినూత్న తరహాలో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈరోజు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇచ్చే హామీని అమలు చేయాలని, వినూత్నంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ తక్షణమే తులం బంగారం ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంగారు కడ్డీలను పోలిన వాటిని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పెళ్లయిన వారికి కూడా తులం బంగారం ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీల డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేస్తుందని తులం బంగారం కోసం ఎదురుచూస్తున్న ఆడపిల్లల తల్లిదండ్రులు ఏమి సమాధానం ఇస్తారని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి తప్పుడు మాయమాటలు చెప్పి ప్రజలకు మోసం చేసిన ప్రభుత్వం కొనసాగడం సిగ్గుచేటని ఆమె అన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అమలు చేస్తలేరని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న అమాయక ప్రజల జీవితాలతో చెలగాట ఆడడం ఎంతవరకు సమంజసం అని ఆమె అన్నారు. ఏదేమైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తో పాటు పలువురు ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు.




# అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న 9 టిప్పర్లు స్వాధీనం



**బోధన్, మార్చి 26(మనంన్యూస్):** బోధన్ నియోజకవర్గంలోని మందర్న సమీపంలో అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 9 టిప్పర్లను పక్క సమాచారంతో జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకోవడం జరిగిందని టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ అడిషనల్ డిసిపి శ్రీనివాసరావు అన్నారు. అదేవిధంగా 9 టిప్పర్లతో పాటు మూడు జెసిబిలు, 12 మంది డ్రైవర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టాస్ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఎస్బిఐ స్పెషల్ పార్టీ సిబ్బంది గోవింద్ తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను డ్రైవర్లను బోధన్ ఎస్ హెచ్ ఓ కు అప్పగించడం జరిగిందని ఆయన అన్నారు. వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని స్పష్టంగా తెలియజేశారు.

## జాతీయం- అంతర్జాతీయం

# తప్పుదోవ పట్టించే ప్రకటనలు..

- 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని ఆదేశించిన సుప్రీం
- పతంజలి ఆయుర్వేద సంస్థ కేసులో అత్యున్నత న్యాయస్థానం స్పందన

**ఢిల్లీ, మార్చి 26 :** తప్పుదారి పట్టించే ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) సమాజానికి తీవ్ర హాని చేస్తాయని భారత సర్వోన్నత న్యాయస్థానం




పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు-1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటిని రెండు నెలల్లో ఏర్పాటు చేయాలని, దీని గురించి ప్రచారం కూడా కల్పించాలని స్పష్టం చేసింది. 1954 చట్టంలోని నిబంధనల అమలుపై పోలీసులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది.

తప్పుదోవ పట్టించే ప్రకటనల కట్టడికి సంబంధించి గతంలో పలు సూచనలు చేసిన న్యాయస్థానం.. ప్రకటనలు జారీ చేసే ముందు కేబుల్ టెలివిజన్ నెట్ వర్క్ రూల్ 1994 ప్రకారం స్వీయ ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని పేర్కొంటూ ఆ సంస్థను మందలించింది. అనంతరం పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రకటనల కట్టడి చర్యల్లో భాగంగా సుప్రీం తాజా ఆదేశాలు జారీ చేసింది.

# ఎమ్మెల్యే బసనగౌడకు బీజేపీ షాక్.. ఆరేళ్లు బహిష్కరణ వేటు

**బెంగళూరు, మార్చి 26:** కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ పై ఆ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. ఆరేళ్ల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ బీజేపీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ ఆయనకు లేఖ రాసింది. పార్టీతో పాటు మాజీ సీఎం బీఎస్ యడియూరప్పకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఫిబ్రవరి 10న షోకాజ్ నోటీసులు జారీ చేసిన బీజేపీ.. తాజాగా ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది.



బసనగౌడ రియాక్షన్ ఇదే..

పార్టీ నుంచి తనను బహిష్కరించడంపై ఎమ్మెల్యే బసనగౌడ స్పందించారు. వారసత్వ రాజకీయాలు, అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు, పార్టీలో సంస్కరణలు, వ్యక్తుల ఆధిపత్యాన్ని తొలగించాలని, ఉత్తర కర్ణాటకను అభివృద్ధి చేయాలని అడిగినందుకు తనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించారని ఆరోపించారు. ముక్కుసూటిగా మాట్లాడినందుకు ఇది పార్టీ తనకు ఇచ్చిన రివార్డుగా పేర్కొన్నారు. అవినీతి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా, ఉత్తర కర్ణాటక అభివృద్ధి, హిందుత్వ కోసం తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఇదే ఉత్సాహం, దృఢ సంకల్పంతో ప్రజాసేవ చేస్తానని, తనకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# బెట్టింగ్ యాప్ వ్యవహారం.. మాజీ సీఎం ఇంట్లో సీబీఐ సోదాలు

**రాయ్‌పూర్, మార్చి26 :** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌పై కేసుల ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే మద్యం కుంభకోణానికి సంబంధించి ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరపగా.. తాజాగా బెట్టింగ్ యాప్ వ్యవహారంలో సీబీఐ దాడులు నిర్వహిస్తోంది. రాయ్‌పూర్ , భిలాయిలోని ఆయన నివాసాల్లో సీబీఐ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. బఘేల్‌కు అత్యంత సన్నిహితుడైన ఓ సీనియర్ పోలీసు అధికారి ఇంట్లోనూ ఈ దాడులు జరుగుతున్నాయి.




తాజా సోదాలపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే, మహదేవ్ బెట్టింగ్ యాప్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.6000 కోట్ల విలువైన ఈ మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం వ్యవహారంలో ఇప్పటికే బఘేల్‌పై రాష్ట్ర ఆర్థికనేరాల విభాగం కేసు నమోదు చేసింది. 2023లో జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహదేవ్ ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. బెట్టింగ్ యాప్‌ను రూపొందించేందుకు అప్పట్లో సీఎంగా ఉన్న భూపేశ్ తనను ప్రోత్సహించారని, ఆయనకు రూ.508 కోట్లు చెల్లించానంటూ యాప్ యజమాని శుభమ్ సోనీ సంచలన ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణలను బఘేల్ ఖండించారు.

అనంతరం దీనిపై దర్యాప్తు చేపట్టిన ఈడీ.. ఈ కుంభకోణంలో పలువురు కీలక రాజకీయ నేతలు, అధికారుల పాత్ర ఉన్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజాగా బఘేల్ నివాసంలో సీబీఐ దాడులు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సోదాలపై మాజీ సీఎం స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం కోసం తాను ఢిల్లీ వెళ్లబోతున్న సమయంలో సీబీఐ తమ నివాసానికి వచ్చినట్లు తెలిపారు. బీజేపీ కుట్రలో భాగంగానే తనపై ఈ దాడులు చేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఇటీవల మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బఘేల్, ఆయన కుమారుడు చైతన్య నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆ సోదాల సందర్భంగా రూ.30 లక్షల నగదు, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ తనిఖీల అనంతరం తిరిగివెళ్తున్న ఈడీ అధికారుల వాహనాలపై నిరసనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

# ఐదేళ్ల విరామం తర్వాత చైనా నుంచి నేరుగా విమాన సర్వీసులు!

**కోల్‌కతా, మార్చి 26:** కొవిడ్, గల్వాన్ సంఘర్షణ నేపథ్యంలో భారత్, చైనా మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులు పునరుద్ధరించడానికి చర్చలు జరుపుతున్నట్లు చైనీస్ కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. అయితే ఐదేళ్ల తర్వాత నేరుగా విమాన



సర్వీసులను తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నట్లు చైనా కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. ఈ మేరకు భారత అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''కొవిడ్‌కు ముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్జౌ, కున్మింగ్ నుంచి భారత్‌లోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఇతర నగరాలకు వారానికి 50 విమాన సర్వీసులుండేవి. ఆ సేవలను తిరిగి పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నాం'' అని ఆయన తెలిపారు. విమానాల పునరుద్ధరణ తర్వాత వీసా నిబంధనల్లో కూడా సడలింపులు చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలకు మరో వారంలో 75 ఏళ్లు పూర్తవుతుండడంతో..ఈ సందర్భంగా ఏప్రిల్ 1న ఇరుదేశాలు సంయుక్తంగా కొన్ని వేడుకలను జరుపుకోనున్నట్లు జు వీ వెల్లడించారు. భారత్‌తో కలిసి ఈ వేడుకలను జరుపుకోవడానికి, దౌత్య సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడానికి తాము ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అన్నారు.

జనవరిలో భారత్ విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ చైనాను సందర్శించిన తర్వాత భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మొదట ఈ ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాల మధ్య విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిపింది. కొవిడ్ 19 మొదలైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం విషయంలో రెండు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా విమాన సర్వీసుల అంశం చర్చకు వచ్చినట్లు పేర్కొంది.

# దక్షిణ కొరియాలో కార్చిచ్చు.. 24 మంది మృతి

**సియోల్, మార్చి 26:** దక్షిణ కొరియాలో కార్చిచ్చును ఆపేందుకు వెళ్లిన హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఒక పైలెట్ మృతి చెందారు. దక్షిణ కొరియాలో దట్టమైన కార్చిచ్చు వ్యాపిస్తోంది. ఈ మంటలను ఆర్పేందుకు స్థానిక అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంటల కారణంగా ఇప్పటివరకు దాదాపు 24 మంది మృతి చెందారు. అంతేకాక.. శతాబ్దాల నాటి బౌద్ధ దేవాలయం కూడా ధ్వంసమైంది. ఇంటీరియర్ సేఫ్టీ మినిస్ట్రీ ప్రస్తుత పరిస్థితిపై ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం.. పొడి గాలుల కారణంగా మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. దీని కారణంగా వాటిని అదుపు చేయడంలో అధికారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాదాపు 24 మంది మృతిచెందగా.. మరో 26 మంది గాయపడ్డారు. ఇక, మంటలను ఆర్పేందుకు వెళ్లిన హెలికాప్టర్ కూలిపోగా.. అందులోని పైలెట్ మృతి చెందారు. ఉయిసాంగ్ కౌంటీలో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో 1,300 సంవత్సరాల నాటి పురాతన గౌన్సా దేవాలయం కాలిపోయింది.



అయితే, ఆలయంలోని కళాఖండాలతో సహా పలు విగ్రహాలను ముందే ఇతర దేవాలయాలకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ కార్చిచ్చును ఆర్పేందుకు 10 వేల మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, పౌర సేవకులు శ్రమిస్తున్నారు. కార్చిచ్చు వల్ల బుధవారం నాటికి 43 వేల ఎకరాలు కాలి బూడిదయ్యాయని అధికారులు వెల్లడించారు. స్థానిక నివాసితులను ఖాళీ చేయమని ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించారు. 68 శాతం మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. ఉత్తర, దక్షిణ జియోంగ్సాంగ్, ఉల్సాన్ నగరంలోని అనేక ప్రాంతాల్లో మాత్రం మంటలు చురుకుగా వ్యాపిస్తున్నాయి. ఈ కార్చిచ్చుపై దక్షిణ కొరియా ప్రధానమంత్రి, తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్- సూ స్పందించారు. 'ఇది అత్యంత ఘోరమైనది. ఈ మంటల కారణంగా అంతులేని నష్టం ఏర్పడింది. దీనికి మేము ఎంతో ఆందోళన చెందుతున్నాం. మంటలను అదుపు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇవి పొరుగు ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరుతున్నా' అని ఆయన పేర్కొన్నారు.

# అసెంబ్లీకి రారు గానీ.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్

- మాజీ సీఎం గహ్లోత్‌పై సీఎం విమర్శలు

**జైపూర్, మార్చి 26:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం అశోక్ గహ్లోత్‌పై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించడానికి బదులుగా 'ఎక్స్'లో పోస్టులపై ఫోకస్ పెట్టారని ఆరోపించారు. బికనీర్‌లో జరిగిన ఓ రైతు సదస్సులో సీఎం మాట్లాడారు. అశోక్ గహ్లోత్ అసెంబ్లీ సమావేశాలకు ఒక్కరోజు కూడా హాజరు కావడం లేదు గానీ.. 'ఎక్స్'లో మాత్రం క్రియాశీలంగా ఉంటున్నారన్నారు. ఆ పోస్టులతో హెడ్‌లైన్‌లలో నిలవాలని కోరుకొంటున్నారని ఆరోపించారు.

''ఎక్స్'లో ఏదైనా పోస్టు చేసే ముందు మీ ట్వీట్లు ఒకసారి చూసుకోండి. గత ఐదేళ్లలో మీరు అధికారంలో ఉన్న సమయంలో ప్రజల కోసం ఏం చేశారో చూడండి. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తే సరిపోదు. ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధల్ని అర్థం చేసుకోవాలి. వాటిని పరిష్కరించడం ప్రభుత్వ విధి' అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ యువ నేత రైతుల వద్దకు వచ్చి రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చినా.. అది జరగలేదంటూ ఆ నేత పేరు ప్రస్తావించకుండా విమర్శలు చేశారు. బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేయడం గురించి సదరు నేత మాట్లాడారన్నారు. రాజస్థాన్ రైతులకు నీరు సరిగా అందితే.. కచ్చితంగా రైతులు భూమి నుంచి బంగారం పండిస్తారన్నారు.

సీఎం భజన్‌లాల్ శర్మ వ్యాఖ్యలకు మాజీ సీఎం అశోక్ గహ్లోత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కనీస మద్దతు ధరకు పంటలను సేకరించాలని గతంలో కాంగ్రెస్ సర్కార్‌కు భజన్లాల్ చేసిన డిమాండ్‌కు సంబంధించిన పాత ట్వీట్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌పీపై చిరుధాన్యాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు రెండున్నరేళ్ల క్రితం చేసిన మీ ట్వీట్‌ను మీకు గుర్తు చేయాలనుకుంటున్నా. ఇప్పుడు మీ ప్రభుత్వం ఒకటిన్నరేళ్లు పూర్తి చేసుకోబోతోంది. మీ మ్యానిఫెస్టోలో ఎంఎస్‌పీ ధరపై చిరుధాన్యాలు కొంటామని హామీ ఇచ్చారు కదా.. మరి ఎప్పుడు కొనుగోలు ప్రారంభిస్తారో చెప్పండి'' అని అశోక్ గహ్లోత్ నిలదీశారు.

# పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ

- పండుగ వాతావరణంలా సీఎం చేతుల మీదుగా అందజేత
- జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్



సూర్యాపేట, మార్చి 26 (మనం ప్రతినిధి): జిల్లాలోని రేషన్ దుకాణాల్లో మామిడి తోరణాలు,పూల దండలు కట్టి పండుగ వాతావరణం లో సన్నబియ్యం పంపిణి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం జిల్లా సమీకృత కార్యాలయంలోని సమావేశమందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సన్న బియ్యం పంపిణి గురించి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హుజూర్ నగర్ లో సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఏప్రియల్ 1 నుండి ప్రతి రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణి చేయాలని సూచించారు.సూర్యాపేట రైతులు పండించిన పంట మిల్లులో మర ఆడించి సన్నబియ్యం ను సూర్యాపేట పేదలకి పంపిణి చేయటం చాలా సంతోషంగా ఉందని గతంలో తినడానికి ఆహారం లేక ఇతర దేశాల నుండి మనం ధాన్యాలు దిగుమతి చేసుకున్నాం కానీ నేడు మన జిల్లా నుండి 10 నుండి 15 రకాల సన్న దొడ్డు రకం వడ్లను పండించి ఇతర జిల్లాలకి, రాష్ట్రాలకి ఎగుమతి చేసే స్థాయి కి ఎదిగామని ఇది విప్లవాత్మక మార్పు అని కలెక్టర్ తెలిపారు.దొడ్డుబియ్యం చాలా మంది తినకుండా వివిధ మార్గాలలో దుర్వినియోగం అయినాయనితెలంగాణలో ప్రజలు సన్నబియ్యం ఎక్కువ తింటారు కాబట్టి ప్రభుత్వం పేదలందరికీ సన్నబియ్యం ఉచితంగా పంపిణి చేసి ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం ఇస్తుందని ఎట్టి పరిస్థితిల్లో సన్నబియ్యం స్థానం లో దొడ్డుబియ్యం ఇవ్వకూడదని సన్నబియ్యంలో ఎఫ్ ఆర్ కె.(పోర్ట్ ఫైడ్ రైస్ కేర్నల్స్) పోషకాలతో కూడిన గుళికలు ఉంటాయని అవి ప్లాస్టిక్ బియ్యం కావని ప్రజలకి డీలర్లు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ -పాస్ మిషన్ ద్వారా రేషన్ కార్డులో ఎంతమంది ఉంటే అంతమందికి మనిషికి 6 కేజీ ల చొప్పున ఉచితంగా పంపిణి చేయాలని, తూకంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు.ఏప్రియల్ 1 వ తేదీనాడు జిల్లాలోని 610 షాప్ లు తప్పకుండా ఉదయం 8 గంటల నుండి బియ్యం పంపిణి ప్రారంభించాలని జనాలు ఎక్కువ వస్తారు కాబట్టి ఏర్పాట్లు చేసుకోవాలని రేషన్ షాప్ లను సివిల్ సప్లై అధికారులు పరిశీలించాలని, ఈ.పాస్ మిషన్ లో ఏమైనా సమస్య ఏర్పడితే పై అధికారులకి తెలియపర్చాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం పంపిణి చేస్తుందని, అన్ని దానాలలో అన్నదానం గొప్పది కాబట్టి పేదవాడి ఆకలి తీర్చే సన్నబియ్యం పంపిణి మహోత్మక కార్యక్రమంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషించి ఎలాంటి సమస్య లేకుండా పేదలకు బియ్యం పంపిణి చేయాలని ఏప్రియల్ 1 నుండి 15 వ తారీఖు వరకు ఉదయం 8 నుండి 11 వరకు సాయంత్రం 5 నుండి 8 వరకు సమయపాలన పాటిస్తూ వందశాతం పంపిణి చేయాలని తెలిపారు. సన్నబియ్యం లో ఎలాంటి అవకతవకలు జరిగితే డిపార్మెంటల్ చర్యలతో పాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రేషన్ దుకాణాలను తహసీల్దార్ లు, డి టి లు,విజిలెన్స్ అధికారులు, టాస్క్ పోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ లు చేస్తారని తెలిపారు.రేషన్ షాప్ లలో ప్రస్తుతం ఉన్న దొడ్డు బియ్యంను కమిషనర్ గారి తదుపరి సూచనలు వచ్చేంత వరకు భద్రపర్చాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో డి ఎస్ ఓ రాజేశ్వర్, డి ఎం ప్రసాద్, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ లు, డి టి లు, రేషన్ డీలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నూతన పరిశ్రమల దరఖాస్తులను పరిశీలించాలి....**

నూతన పరిశ్రమల కొరకు పెట్టిన దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిఐపిసి,టి.ఎస్ ఐ పాస్ సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి సమీక్షించారు.. ఫిబ్రవరి 1 నుండి నేటి వరకు 14 పరిశ్రమల కొరకు దరఖాస్తులు వచ్చినవని 109.30 కోట్ల పెట్టుబడులతో స్థాపించడానికి వివిధ శాఖల నుండి అనుమతుల కొరకు దరఖాస్తు చేసుకు కున్నారని వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి సకాలంలో మంజూరి చేయాలని కలెక్టర్ ఆదేశించారు ఈ పరిశ్రమలు స్థాపించడం ద్వారా సుమారు 500 మంది కి ఉపాధి కల్పించడానికి ఆస్కారం కలుగుతుందని పేర్కొన్నారు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ స్కీం ద్వారా నిరుద్యోగులు మొబైల్ యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలని అట్టి వారి నైపుణ్యాన్ని బట్టి పరిశ్రమలు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని తెలియజేశారు.జిల్లాలోని అన్ని పరిశ్రమలు డీట్ మొబైల్ యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలన్నీ తమ అవసరాలకు తగ్గట్టుగా ఖాళీగా ఉన్న ఉద్యోగ వివరాలను డీట్ మొబైల్ యాప్ నందు చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా వివిధ గ్రామపంచాయతీ సెక్రటరీల పెండింగ్ లాగిన్ సమస్యలను క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఇంటర్నెట్ ఇంటెర్న్షిప్ స్కీం యొక్క రెండవ దశలో రిజిస్టర్ చేసుకోవడానికి తేదీని పొడిగించారని 31 -03-25 కావున నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, ప్రకాష్ రెడ్డి ఎంవిఐ , రామకృష్ణ పిసిబి ,సంతోషజడ్ఎంటీజీఐఐసీ, సీటిఓ యాదగిరి, ఎల్డీఎం బాపూజీ, పిడిఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, డిటిడిసి శంకర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యలు రాకుండా మహిళలు పౌష్టిక ఆహారం తీసుకోవాలి



- ప్రభుత్వం ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి
- గర్భిణీ స్త్రీలు డాక్టర్ల సూచనలు సలహాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 26 (మనం ప్రతినిధి): ఆరోగ్య సమస్యలు రాకుండా మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం ఆమె నల్గొండ జిల్లా, చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పటిలాగే ఓపి రిజిస్టర్ ,సిబ్బంది హాజరు రిజిస్టర్ ,ఇన్ పేషెంట్లు, ఔట్ పేషెంట్లు, మందులు, ఇతర స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. బుధవారం ఓపి పేషంట్ల వివరాలను డాక్టర్ శ్రీదేవితో అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం చింతపల్లి పి హెచ్ సి కి 84 మంది రోగులు రాగ, కొంతమంది ఇన్ పేషెంట్లు, అవుట్ పేషంట్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారి ద్వారా వివరాలను కనుక్కున్నారు.ఆసుపత్రి ఏ సమస్యతో వచ్చారని? ఏ జబ్బుతో బాధపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు . గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కెనాన్ ద్వారా అందిస్తున్న సేవలను డాక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. పీ హెచ్ సిలో కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వారితో పాటు, వారి పిల్లలు బాగుంటారని తెలిపారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి పిల్లలతో ముఖాముఖి మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాల కిచెన్ గది బాగా లేకపోవడం, రూఫ్ సరిగా లేకపోవడంతో డిఇఓ తో మాట్లాడి వెంటనే వాటిని బాగు చేయించాలని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో తాగునీటి సరఫరా, తదితర అంశాలపై దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులతో మాట్లాడారు.తాగు నీటి ఎలా ఉందని ఏఈ ని అడిగి తెలుసుకున్నారు. హరిజనాపురంలో వాటర్ ట్యాంకు పాతబడిపోయిందని, కుర్మపల్లి, కురుమేడ్ గేట్ల వద్ద సమస్య ఉండగా, ఇది వరకే డిఎంఎఫ్టి ద్వారా జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారని ,పనులు మొదలు పెడుతున్నామని ఏఈ చెప్పారు. హరిజనపురంలో కొత్త వాటర్ ట్యాంకు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతేకాక అప్పటివరకు నీటి ఇబ్బందులు లేకుండా కొత్త బోర్ వేసుకునేందుకు కలెక్టర్ అనుమతించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి ,తహసిల్దార్ రమాకాంత్ శర్మ, మిషన్ భగీరథ ఏ ఈ తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్,సైబర్ నేరాలపై అవగాహన



తిరుమలగిరి, మార్చి 26 మనం న్యూస్: ఎస్పీ కె.నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు తిరుమలగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ లో సైబర్ నేరాలపైన, ఆన్ లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, పోలీసు కళాభృందంతో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నికోలస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై, ఆన్ లైన్ బెట్టింగ్స్,గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాకు యువత దూరంగా ఉండాలని చెప్పారు. ఆన్లైన్ బెట్టింగ్ సైబర్ నేరాల పైన మత్తుపదాయాలు సేవించిన వారి పైన కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు పటిష్టంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో, పాఠశాల, కళాశాలలో చదువుకునే విద్యార్థులు, యువత ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఎటిఎం కార్డ్ వివరాలు, ఓ టి పి.వివరాలు ఎవరికి తెలపవద్దని, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలపై1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని, ముఖ్యంగా యువకులు అతివేగం ప్రయాణించవద్దని, యువతులు మహిళలు వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కళాకారుల బృందం పాల్గొన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డి పి లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని అన్నారు.గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డ్లు పెట్టుకోవాలని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం సాంస్కృతిక, పాటలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్,హెడ్ కానిస్టేబుల్ వెంకన్న గౌడ్, కానిస్టేబుల్ హరిబాబు,సైదులు, పోలీస్ కళాబృందం ఇన్చార్జ్ యల్లయ్య, గోపయ్య,ఈశ్వర చారి, కృష్ణ నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

చిలుకూరు, మార్చి 25(మనం న్యూస్): ట్రాక్టర్ తో గుద్ది హత్య కేసిన కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధించినట్లు ఎస్ఐ రాంబాబు గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలం కట్టకొమ్ముగుడెం (రామాపురం) గ్రామం లో 15/03/2019 రోజున ఎస్సీ కులానికి చెందిన కుక్కల గోపి ని అదే గ్రమానికి చెందిన షేక్ దస్తగిరి, కస్తాల వెంకటరత్నం, లు గోపి భార్య కుక్కల రేణుక సహకారంతో ట్రాక్టర్ తో గుద్ది హత్యచేశారు. మృతుని తల్లి కుక్కల పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై చిలుకూరు పోలీసు స్టేషన్ లో నేరం సంఖ్య 19/2019 హత్య, మరియు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద కేసు నమోదు చేశారు. మృతుని భార్యతో నేరస్తుడైన దస్తగిరి కి పరిచయం కలిగి ఉండి ఒక పథకం ప్రకారం ట్రాక్టర్ తో తొక్కించిన చంపినారు అని కేసు నమోదు చేసిన అప్పటి దర్యాప్తు అధికారి డీఎస్పీ సుదర్శన్ రెడ్డి విచారణ జరిపి నేర అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా 15 మంది సాక్షులను, మరియు బాధితులను విచారించిన స్పెషల్ సెషన్స్ ఎస్సీ ఎస్టీ నల్గొండ జిల్లా కోర్టు జడ్జి శ్రీమతి రోజా రమణి నిందుతులు దస్తగిరి, వెంకటరత్నం, రేణుక నేరానికి పాల్పడినారు అని నిర్ధారించి నేరస్థులు ముగ్గరికి హత్య కేసులో జీవితఖైదు, జరిమానా విధించినట్లు తెలిపారు నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేసిన పిపి .అఖిల ను, లైజన్ ఆఫీసర్ కానిస్టేబుల్ సైదులు, కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ రమేష్ లను, పర్యవేక్షణ చేసిన కోదాడ డి ఎస్ పి శ్రీధర్ రెడ్డి, కోదాడ రూరల్ సర్కిల్ సి ఐ రజిత రెడ్డి, ఎస్ ఐ రాంబాబు ల ను ఎస్పీ కె నరసింహ అభినందించారాని అన్నారు.

## వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- పోలీసు భరోసా షీ టీమ్స్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



సూర్యాపేట, మార్చి 26 (మనం ప్రతినిధి): వేదింపులకు, దాడులకు గురైన వారికి బరోసా, దైర్యం కల్పించాలని షీ టీమ్స్, భరోసా సెంటర్స్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, పిల్లల రక్షన చట్టాలు, శిక్షల గురించి వివరించాలని భరోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కే.నర్సింహ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రం లో జాతీయ రహదారి వెంట గల మహిళా భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ గారు సందర్శించి కార్యాలయ రికార్డ్స్ ను పరిశీలించారు, సిబ్బంది నిర్వహిస్తున్న పనులులు, మహిళల, పిల్లల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలు, కౌన్సిలింగ్ నిర్వహణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ ను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. భరోసా సెంటర్ సిబ్బంది, షీ టీమ్స్ సిబ్బంది జిల్లాలో పని చేస్తున్న తీరును ఎస్పీ కి వివరించారు. దాడులకు, వేదింపులకు గురౌతున్న బాలల పట్ల, మహిళల పట్ల మానవతా దృకృదం తో పని చేయాలి, వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా దైర్యం కల్పించాలి, ఎప్పటికప్పుడు న్యాయ సహాయం అందించాలి, వైద్యం, మానసిక దైర్యం కల్పించాలి అని ఎస్పీ గారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, పట్టణాలు, కాలనీలలో భద్రత చట్టాల అమలు గురించి, పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, రద్ధి ప్రాంతాల్లో ఆకతాయిలపై నిగా ఉంచాలి, విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి ఎలాంటి సమస్య వచ్చిన, వేదింపులు జరిగిన సమాచారం వచ్చేలా నిఘా ఉంచాలి అని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేదింపులు, అత్యాచారం, నిరాదరణకు గురైన బాధిత మహిళలకు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యం పరమైన సదుపాయాలు, సామాజిక భద్రత, నైతిక భద్రత, మానసిక దైర్యం, అవసరమైన వారికి చదువు ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ, బాధితులకు మనోదైర్యం కల్పించే విధంగా రాష్ట్ర పోలీసు మహిళ అండ్ చెల్ వెల్ఫేర్ అద్వర్యంలో జిల్లా బరోసా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ గారు అన్నారు. బరోసా సెంటర్, షీ టీమ్స్ యొక్క విధి విధానాలు, లక్ష్యాలు, ఉద్దేశం, లైంగిక దాడులకు గురైన మహిళల, బాలల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణ చర్యలు, కల్పించాల్సిన భద్రత మొదలగు అంశాలపై, కళాశాలల్లో విద్యార్థులకు, సమాజంలో మహిళల భద్రత, రక్షణ చట్టలపై నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు గురించి బారోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందికి వివరించారు. వేదింపులపై దైర్యంగా పిర్యాధు చేయాలని కోరారు. మహిళల, బాలల రక్షణలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయి, ఎవరైనా వేదింపులు, లైంగిక దాడులకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవు అని ఎస్పీ గారు హెచ్చరించారు. పిల్లలపై లైంగిక దాడులు పోక్సో చట్టం కేసుల్లో జీవితకాలం శిక్షలు పడుతున్నాయి అన్నారు. సాంకేతికత ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తును చేస్తున్నాము, ఫాస్ట్ ట్రాక్ లో మాదిరిగా నేరాల్లో త్వరగా శిక్షలు అమలైయ్యేలా పోలీసు శాఖ పని చేస్తున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట బారోసా సెంటర్ ఎస్ఐ.మౌనిక, షీ టీమ్స్ ఎస్ఐ .నీలిమ, ఏ ఎస్ఐ లు సైదాభి, సాలయ్య, బారోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బంది ఉన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



కొండమల్లేపల్లి, మార్చి 26 (మనం న్యూస్): పదో తరగతి పరీక్షలలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కొండమల్లెపల్లి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో పోలీస్ భద్రత, బుధవారం పరీక్షకు హాజరైన విద్యార్థులు, పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్, జిరాక్స్ కేంద్రాల మూసివేత, పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఓ ఆర్ ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు, తదితర అన్ని వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపురింటెండెంట్ ద్వారా జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సవ్యంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. దేవరకొండ ఎస్పీ మౌనిక ,ఆర్డిఓ రమణారెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు .

## పేట జిల్లాకు మాజీ ఎంపీ ధర్మబిక్షం పేరు పెట్టాలి



సూర్యాపేట, మార్చి 26 (మనం ప్రతినిధి): సూర్యాపేట జిల్లాకు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మాజీ ఎంపీ ఎమ్మెల్యే కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం జిల్లాగా నామకరణం చేయాలని జిల్లా గౌడ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కామ్రేడ్ ధర్మభిక్షం 14వ వర్ధంతి పురస్కరించుకొని యోధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టి 3 సార్లు ఎమ్మెల్యే గా, 2సార్లు ఎంపీ గా ఈ రాష్ట్రానికి ,దేశానికి కామ్రేడ్ ధర్మ బిక్షం గౌడ్ ఎనలేని సేవలందించాడని,పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశాడని పాత్రికేయులు గుర్తు చేసుకున్నారు.1996 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 480 మంది ఫ్లోరైడ్ బాధితులు ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన కూడా 70000 ఓట్ల మెజార్టీ తో గెలుపొందిన ఘనత ధర్మబిక్షం దే నని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకంగా పనిచేసి నిజాం నిరంకుశ పాలన నుంచి ఈ రాష్ట్రానికి విముక్తి కలిగించడంలో ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి ధర్మబిక్షం అని, కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పోరాటం చేయడమే కాకుండా, పలు కార్మిక సంఘాలు నెలకొల్పి కార్మికుల పక్షపాతిగా పేరిందారని అన్నారు. బొమ్మ గాని ధర్మ బిక్షం చేసిన సేవలకు గుర్తుగా సూర్యాపేట జిల్లాకు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం పేరు పెట్టాలని గౌడ జర్నలిస్టుల పక్షాన ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఐత బోయిన రాంబాబు గౌడ్,రాపర్తి మహేష్ గౌడ్ ,గుణగంటి సురేష్ గౌడ్, సిగ సురేష్ గౌడ్ ,లింగాల సాయి గౌడ్,తండు నాగేందర్ గౌడ్, బూరా శ్రీనివాస్ గౌడ్,పులుసు నాగరాజు గౌడ్,గుడిపూరి రామకృష్ణ ,ఎరుకల సైదులు గౌడ్, తందారపల్లి శ్రీనివాస్ గౌడ్, పుట్ట రాంబాబు గౌడ్, రాగిరి మల్లేష్ గౌడ్, జలగం మధు,ఉయ్యాల నరసయ్య గౌడ్, దోసపాటి అజయ్ గౌడ్, తండూ వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార సంస్థలు సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయం

- నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి

నల్గొండ, మార్చ్ 26( మనం న్యూస్): వ్యాపార సంస్థలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి అన్నారు.నల్గొండ ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణ క్లాక్ టవర్స్ నందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అయన ముఖ్య అతిథిగాపాల్గొని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మాట్లాడుతూ ఫైనాన్స్ అసోసియేషన్ గత 23 సంవత్సరాలుగా క్లాక్ టవర్ సెంటర్లో ప్యూరిఫైడ్ వాటర్ తో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ప్రతిరోజు సుమారుగా 5000 మందికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు మంచినీరు అందిస్తూ వేసవి కాలంలో దాహార్తిని తీర్చడం అభినందనీయమని వ్యాపారమే కాకుండా సేవ చేయాలని ఆలోచన చాలా గొప్పదని ఈ సందర్భంగా నిర్వాహకుల్ని అభినందించారు అసోసియేషన్ అధ్యక్షులు ఆమంచి రాజలింగము మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పాటుచేసిన చలివేంద్రాణి పట్టణ ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమం చేస్తామని ఇతర ప్రాంతాల్లో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫైనాన్స్ అసోసియేషన్ 2002 లో ఏర్పాటు చేశామని అప్పటినుండి ప్రతి సంవత్సరం దాదాపు 23 సంవత్సరాలుగా క్లాక్ టవర్ సెంటర్ లో ప్యూరిఫైడ్ వాటర్ చలివేంద్రాన్ని సభ్యుల సహకారం తో ఏర్పాటు చేస్తున్నామని వీటితోపాటు అసోసియేషన్ వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నామని రక్తదాన శిబిరాలు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాలు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కోశాధికారి మామిడి శ్రావణ్



కుమార్ గౌరవ సలహాదారులు గాదె శంకర్ రెడ్డి, నందికొండ శ్రీనివాస్ సటు నాగయ్య లీగల్ అడ్వైజర్ అయితరాజు మోహన్ కార్యదర్శులు వల్లందాసు కోటయ్య నందికొండ సైదులు కార్యవర్గ సభ్యులు మిట్ట వెంకట నరసింహారెడ్డి గంగనబోయిన లోహిత్ చిట్టిమల్ల జానయ్య పి మోహన్ కుమార్ చిట్టిమల్ల దశరథ పగిళ్ల యాదగిరి సురిగి వెంకటేశ్వర్లు గౌడ్ అయితే రాజు సైదులు అసోసియేషన్ సభ్యులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

- వరంగల్ కలెక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, మార్చి 26 (మనం న్యూస్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. పరిశీలించారు. బుధవారం నల్లబెల్లి మండలంలోని రామతీర్థం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన భూమి పూజలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. మార్చి 31లోపు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకున్నట్లయితే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా క్యాప్చర్ చేసి జియో ట్యాగింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వేసవికాలం రావడంతో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే వ్యవసాయ బావులను అద్దెకు తీసుకొని మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.అనంతరం కలెక్టర్ మండలంలోని నరకపేటలోని మిషన్ భగీరథ పంప్ సెట్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఇందిరమ్మ హౌసెస్ పిడి గణపతి, తహసీల్దార్ ఉప్పు కృష్ణ, ఎంపీడీఓ నరసింహమూర్తి,మిషన్ భగీరథ ఏ. ఇ,ఏపీఓ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ లో పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలి



- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే...

వరంగల్ ప్రతినిధి, మార్చి 26 (మనం న్యూస్): సమర్థ శానిటేషన్ నిర్వహణలో భాగం గా శానిటేషన్ అధికారులు సిబ్బంది పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారుగ్రేటర్ వరంగల్ నగర పరిధి 61 వ డివిజన్ సిద్ధార్థ నగర్ లో బుధవారం కమిషనర్ సానిటేషన్ తో పాటు ట్రేడ్,ఆస్తి పన్నుల వసూళ్ల తీరును క్షేత్ర స్థాయి లో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన జవాన్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.శానిటరీ ఇన్స్పెక్టర్ లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వార్డు లో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు అయ్యేలా చూడాలని, పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్ లకు చెందిన లాగ్ బుక్ ఖచ్చితం గా నిర్వహించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని, ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిపు లు వేయాలని అన్నారు. ఆస్తి, ట్రేడ్ పన్ను వసూళ్లకు ఏర్పాటు చేసిన బృందాలు ఖాజీపేట పరిధి లో 6 బృందాలు,కాశీబుగ్గ పరిధిలో ఏర్పాటు చేసిన 5 బృందాలు ప్రతి రోజు రూ. 50 లక్షల చొప్పున ఆస్తి, ట్రేడ్ పన్నులు వసూళ్లు జరుపుతూ, దానికి సమాంతరంగా శానిటేషన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సిద్ధార్థ నగర్ లో రోడ్డు మీద ఇసుక వేసి నిర్మాణం చేస్తున్న యజమానికి పెనాల్టీ విధించాలని కమిషనర్ సి ఏం హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓటిఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

వరంగల్ ప్రతినిధి, మార్చి 26(మనం న్యూస్): వన్ టైం సెటిల్మెంట్(ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని పన్ను పై 90% వడ్డీ మాఫీ పొందాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం నకు చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90% పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు వడ్డీ/పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు సంబంధించి, బకాయిలపై 90% వడ్డీ/పెనాల్టీలను మాఫీ చేయడం జరుగుతుందని, ఇదివరకే పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరి గిందని, ఈ సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే వర్తిస్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్, మార్చి 26(మనంప్రతినిధి: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.గురువారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ క్రింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31 తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరకాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆడిగి తెలుసుకొగా అధికారులు బాగా స్పందిస్తున్నారని వారు తెలిపారు.

నర్సంపేట మునిసిపల్ పరిధిలో 5732 మంది దరకాస్తూ చేసుకోగా 2271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా, 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందజేయడం జరిగిందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు.ఈ సదావకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంధ్య, టి పి ఓ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఏడుగురికి జైలు శిక్ష



నిజామాబాద్ క్రైమ్, మార్చి 26(మనంన్యూస్): డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన ఏడుగురు వ్యక్తులకు జైలు శిక్షా మరియు 10 మందికి జరిమానా విధించడం జరిగిందని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 17 మందికి ట్రాఫిక్ ఏ.సి.పి టి.నారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్ బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్ జాన్ ముందర హాజరుపరచగా 10 మందికి 14,000 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

మరో ఏడుగురు వ్యక్తులకుమూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని జిల్లా పోలీస్ కమిషనర్ శ్రీసాయి చైతన్య తెలియజేశారు.

# నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్



హైదరాబాద్,మార్చి26 (మనంన్యూ స్) : స్థిరమైన పారిశుధ్య పద్ధతులను ప్రోత్సహించమే లక్ష్యంగా మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని నిర్మాణం చేయడం జరుగుతుందని కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ లో భాగంగా ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా నూతనంగా మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నిర్మాణం కు గతంలోనే శ్రీకారం చుట్టింది. నగరపాలక సంస్థ కు చెందిన ముురుగు నీటి శుద్ధీకరణ కేంద్రం ఆవరణలో నిర్మాణం చేస్తున్న మల స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లతో కలిసి బుధవారం రోజు కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ సందర్శించారు.

మానవ వ్యర్థాల శుద్ధీకరణ నిర్మాణం పనులను తనిఖీ చేసి పరిశీలించారు. ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం పనుల పై అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సలహాలు సూచనలు చేసి పనుల వేగవంతం పై కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. నాలుగు నెలల వ్యవదిలో ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం పనులను పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, ఎస్ టిపి ప్లాంట్ ఉద్యోగులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్, మార్చి 26(మనం న్యూస్): రైతుల ప్రయోజనార్థం జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462-220183 నెంబర్ కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతి రోజు ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని అన్నారు.

ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి స్థాయి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైతులకు హితవు పలికారు. కాగా, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 180042500333 / 1967 లను కూడా సంప్రదించవచ్చని సూచించారు.


# ఎంఎంసి చైర్‌పర్సన్‌కు నూర్ భాషా సంఘం సన్మానం



జమ్మికుంట, మార్చి26 ( మనం న్యూస్) : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పుల్లూరి స్వప్న సదానందం ను బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జమ్మికుంట మండల నూరు భాషా సంఘం మండల అధ్యక్షుడు మహమ్మద్ అలీ భాయ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నూర్ భాషా సంఘం నాయకులు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీన జరిగే తమ రంజాన్ పండుగ రోజున స్థానిక పాత వ్యవసాయ మార్కెట్లో నమాజ్ చేసుకొనుటకు పర్మిషన్ కోసం పత్రం అందజేశారు. ఇట్టి విషయాన్ని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన స్థానిక చైర్మన్ స్వప్న సదానందం ను వెంటనే పర్మిషన్ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూర్ భాషా సంఘం నాయకులు ఎండి అబ్బాస్ ,రఫీ మహమ్మద్ ముజ్జు, రఫీ, అశ్రఫ్ పాల్గొన్నారు.

# ప్రతి సంవత్సరం జిల్లాకు అవార్డుల పంట

- ఆనందాన్ని వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్




నిజామాబాద్ కలెక్టరేట్, మార్చి 26( మనం న్యూస్): నిజామాబాద్ జిల్లాకు ప్రతి సంవత్సరం అవార్డుల పంట పండుతుందని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఈ రోజున స్త్రీ నిధి యొక్క 12వ సర్వసభ్య సమావేశము హైదరాబాదులో నిర్వహించడం జరిగింది. అందులో నిజామబాద్ జిల్లా 2023 -24 సంవత్సరానికి సంబంధించి బెస్ట్ ఫర్ఫార్మెన్స్ గా అవార్డు గౌరవ పంచాయతీ రాజ్ శాఖ మినిస్టర్ శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క మరియు శ్రీమతి దివ్య దేవరాజన్ - సేర్ఫ్ సీఈఓ మరియు స్త్రీ నిధి ఎండి విద్యాసాగర్ చేతుల మీదుగా నిజామబాద్ జిల్లా డిఆర్డిఓ డిఆర్డిఏ అధికారి శ్రీ సాయ గౌడ్ అవార్డును అందుకోవడం జరిగింది. ఇందుకుగాను సమస్త జిల్లా సిబ్బంది అందరి కృషి వల్ల వరుసగా ప్రతి సంవత్సరము మంచి పెర్ఫార్మన్స్ కనబరుస్తూ అన్ని జిల్లాల కంటే ముందు వరుసలో ఉంటూ ప్రతి సంవత్సరం బెస్ట్ అవార్డు దక్కించుకోవడం జరుగుతుంది.

# కార్మికులకు ఇన్సెంటింగ్ చెల్లించకపోవడం దురదృష్టకరం

- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా



మంచిర్యాల,మార్చి 26( మనం న్యూస్): ఫిబ్రవరి నెలలోనే 161 శాతం ఉత్పత్తిని, 119 శాతం చేసిన శ్రీరాంపూర్ ఉపరితల గని కార్మికులకు ఇన్సెంటింగ్ చెల్లించకపోవడం దురదృష్టకరమని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు .బుధవారం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని అన్ని డిపార్ట్మెంట్ల కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత నెల ఫిబ్రవరిలోనే 161 శాతం ఉత్పత్తిని 119 శాతం రవాణా చేసిన శ్రీరాంపూర్ ఉపరితల గని లో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించకపోవడం దురదృష్టకరమని శ్రీరాంపూర్ ఉపరితల గని నుంచె శ్రీరాంపూర్ సిహెచ్ పికి బొగ్గు వెళ్తుందని అలాంటి సి హెచ్ పి కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించినప్పుడు శ్రీరాంపూర్ ఉపరితల గనిలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సెంటివ్ ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో క్యాంటీన్ నిర్వహణకు టెండర్ సమయం అయిపోయిన టెండర్ పిలవకపోవడం వలన పాత కాంట్రాక్టర్ సరిగా చేయలేకపోతున్నాడని, వెంటనే టెన్డర్ పిలవాలని నాణ్యమైన అల్పాహారం అందించాలని మెనూ ప్రకారం కార్మికులందరికీ అల్పాహారం అందించాలన్నారు. ఒకవైపు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గారు కార్మికులను పనిగంటలు సద్వినియోగం చేసుకోవాలని చెబుతుంటే కార్మికులు పని స్థలాలకు చేరుకోవడానికి సరిపడా కన్వీనియన్స్ వెహికల్స్ లేవన్నారు. ఓసి జిఎల్ బంకర్, సిహెచ్పి కార్మికులకు త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి నాగభూషణం, జిఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి ఆఫ్రోజ్ ఖాన్, మైనింగ్ స్టాప్ ఉపాధ్యక్షులు అడ్డు శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి మోతే లచ్చన్న, సహాయ కార్యదర్శి సత్తయ్య, గండి సతీష్, సోషల్ మీడియా ఇన్చార్జ జాడి రాజ్ కుమార్ నాయకులు ఇతినేని శంకర్, ఐ. రమేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలి

- జిల్లా కలెక్టర్ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి, మార్చ్ 26 ( మనం ప్రతినిధి ): అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అర్హులైన నిరుపేద లబ్ధిదారుల జాబితాల ప్రతిపాదనల మేరకు మంజూరు ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని, అట్టి నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు మార్క్ అవుట్ ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని, బేస్ మెట్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగిన వాటి వివరాలు యాప్ లో అప్ లోడ్ చేయాలని, అట్టి వాటికి ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు మొదటి విడతలో ప్రభుత్వం నుండి నిధులు లబ్ధిదారునికి విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకనూ ప్రారంభించని ఇండ్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులను నిర్మాణాలకు ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ డేమో ఇళ్లను త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. మండలాల వారీగా ఇంటి నిర్మాణాలపై పంచయతీకార్యదర్శులు, ఎంపీడీఓ లతో సమీక్షించారు. రెండు పడక గదుల నిర్మాణాల కాలనీల్లో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆయా పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చందర్, హౌసింగ్ పి.డి. విజయపల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, డిప్యూటీ ఈ ఈ లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, మార్చ్ 26 ( మనంప్రతినిధి ): మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవుని పల్లి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులను, చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారులతో మాట్లాడుతూ, పరీక్ష సమయానికి ముందే విద్యార్థులను నిశిత పరిశీలన చేసి కేంద్రం లోనికి పంపించాలని, మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా పరిశీలించాలని తెలిపారు.

కేంద్రంలో త్రాగునీరు, టాయిలెట్స్, మెడికల్ సదుపాయాలు, రవాణా వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరమణ, డిపార్టుమెంటు అధికారిని మేరీ వర్ధనం, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.






# వచ్చే మ్యాచ్‌లో శతకం చేస్తాను అయ్యర్

గుజరాత్ తో మ్యాచ్ సందర్భంగా అయ్యర్ శతకాన్ని త్రుటిలో కోల్పోయాడు. 97 పరుగుల వద్ద నాటౌట్ గా నిలిచాడు. దీనిపై అతడు మ్యాచ్ అనంతరం స్పందిస్తూ.. వచ్చే మ్యాచ్ లో శతకం సాధిస్తానని ఆత్మవిశ్వాసంగా చెప్పారు. ''గుజరాత్ టైటాన్స్ ఎదుట భారీ స్కోర్ ఉంచాలనే లక్ష్యంతో ఆడాము. ఎందుకంటే జీటీ బ్యాటింగ్ లైనప్ చాలా బలంగా ఉంది. ఐపీఎల్ లో చివరి వరకు ఏమైనా జరగొచ్చు. శశాంక్ సింగ్ ను నేనే భారీ షాట్స్ ఆడమని చెప్పాను. నా శతకం గురించి పట్టించుకోలేదు. దానిని వచ్చే మ్యాచ్ లో సాధిస్తాను'' అని అయ్యర్ వెల్లడించాడు.

ఇక శశాంక్ దూకుడును కూడా అయ్యర్ అభినందించాడు. ''గతేడాది నీ బ్యాటింగ్ శైలిని చూసి నేను స్ఫూర్తి పొందాను. నిజం చెప్పాలంటే.. అది నాకు గట్టి ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నువ్వు మైదానంలోకి వచ్చిరాగానే.. మూడో బంతి నుంచే విరుచుకుపడిన తీరు.. నువ్వు సాధించిన 44 పరుగులు చాలా ప్రభావవంతమైనవి. భవిష్యత్తులో కూడా ఇదే ఆటతీరును కొనసాగిస్తావని ఆశిస్తున్నా'' అని శశాంక్తో అన్నాడు. 2023 డిసెంబర్ లో అయ్యర్ చివరి సారి అంతర్జాతీయ టీ20 ఆడాడు. ఆ మ్యాచ్ లో అర్ధశతకం బాదాడు. ఆ తర్వాత పొట్టి ప్రపంచకప్ నుంచి దూరమయ్యాడు. కోల్కతా నైట్రైడర్స్ కు నాయకత్వం వహించాడు. ఆ తర్వాత అది కూడా రిటైన్ చేసుకోలేదు. కానీ, పంజాబ్ జట్టు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర రూ.26.75 కోట్లు చెల్లించి అతడిని కొనుగోలు చేసింది.

## అయ్యర్ అన్నిఫార్మాట్‌లలో మంచి ఆటగాడు: గంగూలీ

బీసీసీఐ ఆగ్రహానికి గురై జట్టుకు కొన్నాళ్లు దూరమైన శ్రేయస్ అయ్యర్ ఆటతీరు గతేడాది అద్భుతంగా మెరుగుపడిందని గంగూలీ పొగడ్తల్లో ముంచెత్తాడు. నిన్న గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో అయ్యర్ అద్భుతంగా ఆడి 97 పరుగులు సాధించి.. పంజాబ్ జట్టును విజయ పథంలో నడిపించాడు. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఎక్స్ వేదికగా స్పందించాడు. ''గత ఏడాది కాలంలో అద్భుతంగా ఆటను మెరుగుపర్చుకొన్న ఆటగాడు శ్రేయస్ అయ్యర్. అతడు అన్ని ఫార్మాట్లకు సిద్ధంగా ఉన్నాడు. కొన్ని ఇష్యూల తర్వాత అతడు ఆటను మెరుగుపర్చుకొన్న తీరు చాలా గొప్పగా ఉంది'' అని పేర్కొన్నాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుడ్ న్యూస్





ఐపీఎల్-2025 సీజన్ తమ తొలి మ్యాచ్ లో సంచలన విజయం సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఇప్పుడు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఢిల్లీ క్యాపిటల్స్ తమ రెండో మ్యాచ్లో మార్చి 30న ఉప్పల్ వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్ తో తలపడనుంది. ఈ మ్యాచ్ కు ఢిల్లీ జట్టుకు అదిరిపోయే వార్త అందింది. తొలి మ్యాచ్ కు వ్యక్తిగత కారణాల వల్ల దూరమైన స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్.. ఎస్ఆర్ హెచ్ తో మ్యాచ్ లో ఆడనున్నాడు. రాహుల్ ఇప్పటికే ఢిల్లీ జట్టుతో కలిశాడు. కాగా ఇటీవలే రాహుల్ భార్య అతియా శెట్టి తొలి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలోనే లక్నో సూపర్ జెయింట్స్ తో మ్యాచ్ కు రాహుల్ దూరమయ్యాడు.

రాహుల్ లేనిప్పటికి ఢిల్లీ బ్యాటర్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ ఛేధించింది. ఇప్పుడు రాహుల్ కూడా అందుబాటులోకి రావడంతో ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్టంగా మారనుంది. ఐపీఎల్-2025 మెగా వేలంలో రూ.14 కోట్ల భారీ ధరకు రాహుల్ ను ఢిల్లీ కొనుగోలు చేసింది. రాహుల్ గత మూడు సీజన్లలో లక్నో సూపర్ జెయింట్స్ కు సారథ్యం వహించాడు. అయితే ఫ్రాంచైజీ యాజమాన్యంతో విభేదాల వల్ల రాహుల్ బయటకు వచ్చేశాడు. ఈ క్రమంలో ఢిల్లీ గూటికి రాహుల్ చేరాడు. రాహుల్ తన ఐపీఎల్ కెరీర్ లో 132 మ్యాచ్ లు ఆడి 4683 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్ లలో 4 సెంచరీలు ఉన్నాయి.

## 17 ఓవర్లకే 90.. శ్రేయస్ సెంచరీ మిస్ అయ్యారే..

గుజరాత్ తో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ సెంచరీ చేయలేకపోవడం ఆశ్చర్యమే. మూడో స్థానంలో దిగి మెరుపులు మెరిపించిన శ్రేయస్.. 16 ఓవర్ పూర్తయ్యేసరికి 66 పరుగులపై నిలిచాడు. ప్రసిద్ధ్ వేసిన తర్వాతి ఓవర్లో అతను చెలరేగిపోయాడు. వరుసగా 6, 4, 6, 6, 2 బాదేశాడు. దీంతో 90 పరుగులకు చేరుకున్నాడు. అప్పటికి ఇంకా 3 ఓవర్లు మిగిలి ఉన్నాయి. శ్రేయస్ సెంచరీ చేయడం లాంఛనమే అనిపించింది. కానీ తర్వాతి 2 ఓవర్లలో అతను మూడు బంతులే ఎదుర్కొని 7 పరుగులు సాధించాడు. ఎక్కువగా స్ట్రైకింగ్ తనే తీసుకుని భారీ షాట్లు ఆడిన శశాంక్.. చివరి ఓవర్లో శ్రేయస్ కు ఒక్క బంతీ ఆడే అవకాశం ఇవ్వలేదు. అయిదు ఫోర్లు బాది మొత్తం 23 పరుగులు రాబట్టాడు. దీంతో శ్రేయస్ శతకానికి 3 పరుగుల దూరంలో నిలిచాడు. మ్యాచ్ అనంతరం శ్రేయస్ సెంచరీ మిస్ కావడంపై శశాంక్ స్పందించాడు.

''చివరి ఓవర్ తొలి బంతి నుంచి తన సెంచరీ గురించి ఆలోచించకుండా దూకుడుగా ఆడేయమని చెప్పాడు. ఆ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. బౌండరీలు బాదగలనని నాపై నమ్మకం ఉంది. ఈ స్థానంలో బ్యాటింగ్ చేస్తే హిట్టింగ్ చేయాల్సిందే. ఒక్కోసారి కనెక్ట్ కాదు. అయినా, నా బలం ఏంటో తెలుసు. దానిపై దృష్టిపెట్టా'' అని శశాంక్ వెల్లడించాడు.



## జపాన్‌లో బర్త్ డే సెలబ్రేషన్స్.. తారక్ పోస్ట్ చూశారా?

జూ.ఎన్టీఆర్ ప్రస్తుతం జపాన్ లో ఉన్నాడు. గతేడాది మన దగ్గర రిలీజైన దేవర.. ఈ 28న జపాన్ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇదివరకే ప్రీమియర్స్ పడగా.. వాటికి తారక్ తోపాటు దర్శకుడు కొరటాల శివ కూడా హాజరవడం విశేషం. సతీసమేతంగా జపాన్ వెళ్లిన ఎన్టీఆర్.. తన భార్య ప్రణతి పుట్టినరోజు వేడుకల్ని మంగళవారం రాత్రి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన రెండు ఫొటోలని షేర్ చేసుకోవడంతో పాటు క్యూట్ క్యాప్షన్ కూడా పెట్టాడు. 'అమ్మలు.. హ్యాపీ బర్త్ డే' అని తారక్ తన ఇన్ స్టాలో రాసుకొచ్చాడు. దీనికి నెటిజన్ల లైకులు కొట్టేస్తున్నారు. 2011లో తారక్-ప్రణతికి పెళ్లయింది. వీళ్లకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. సినిమాల విషయానికొస్తే జపాన్ నుంచి వచ్చిన వెంటనే ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ తీస్తున్న సినిమా షూటింగ్ లో పాల్గొంటాడు. తర్వాత షెడ్యూల్ బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

## చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న మ్యాక్సీ

ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్ వెల్ ఐపీఎల్ లో పేలవ ఫామ్ కొనసాగుతూనే ఉంది. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున బరిలోకి దిగి పెద్దగా పరుగులు చేయలేదు. ఈసారి పంజాబ్ ఫ్రాంచైజీకి మారినా ప్రదర్శనలో మాత్రం తీసికట్టుగానే ఉంది. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దీంతో ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (19) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరిన ఆటగాడిగా చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గుజరాత్ బౌలర్ సాయికిశోర్ వేసిన బంతిని రివర్స్ స్వీప్ కొట్టేందుకు మ్యాక్స్ వెల్ ప్రయత్నించాడు. బంతి బ్యాట్ కు కనెక్ట్ కాలేదు. నడుము వద్ద తాకడంతో గుజరాత్ ఆటగాళ్లు అప్పీలు చేశారు. ఫీల్ అంపైర్ ఔట్ గా ప్రకటించాడు. నాన్ స్ట్రైకింగ్ లోని శ్రేయస్తో చర్చించకుండానే మ్యాక్సీ పెవిలియన్ ను వీడాడు. ఆ సమయంలో డగౌట్ లో ఉన్న కోచ్ రికీ పాంటింగ్ తీవ్ర అసహనం వ్యక్తంచేయడం గమనార్హం. రిప్లేలో మాత్రం బంతి వికెట్లను తాకలేదని తేలడంతో పంజాబ్ అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు. మ్యాక్స్ వెల్ కనీసం డీఆర్ఎస్ తీసుకొని ఉంటే ఫలితం అనుకూలంగా వచ్చేదని.. చెత్త రికార్డును ఖాతాలో వేసుకోకుండా ఉండేవాడని పలువురు అభిప్రాయపడ్డారు.



## సంక్రాంతికి చిరు వస్తున్నాడోచ్



కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఉగాది సందర్భంగా ఈ నెల 30న పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభం కానుంది. జూన్ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలయ్యే అవకాశముంది. ఇది చాలా కాలం తర్వాత చిరు చేస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా. యాక్షన్ తో పాటు కుటుంబ అంశాల మేళవింపుగా అందర్నీ అలరించే కథతో రూపొందనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించే అవకాశముందని.. ఓ పాత్ర కోసం అదితీరావు హైదరి పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## రజనీకాంత్, అమితాబ్ లతో నాకు పోటీ లేదు: మోహన్ లాల్

ప్రస్తుతం ఇండస్ట్రీ అంతా 'ఎల్2: ఎంపురాన్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మోహన్ లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మోహన్ లాల్ తనకు రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ లతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. వారితో తనకు పోటీ లేదన్నారు. ''నేను ట్రైలర్ ను రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ లకు పంపాను. వారు నిజంగా ప్రశంసించారు. రజనీకాంత్ ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. ట్రైలర్ లో లొకేషన్స్ బాగున్నాయని చెప్పారు. సినిమా కోసం మేం ఖర్చు చేసిందంతా లొకేషన్స్ లో కనిపిస్తుందని అభినందించారు. నటుడిగానే కాకుండా.. నిర్మాత కోణంలోనూ ఈ ట్రైలర్ ను చూశారు. అందుకే మా కష్టం ఆయనకు సులభంగా అర్థమైంది. ఆయన ఎప్పుడూ మనస్ఫూర్తిగా అభినందిస్తారు'' అని చెప్పారు.



## అందుకే రష్మిక చేయలేదు: శ్రీలీల

'రాబిన్‌హుడ్' లాంటి ఫన్ ఉన్న సినిమాని తన కెరీర్ లో ఇప్పటివరకూ చేయలేదని, ఇదొక ఫుల్ ఎంటర్‌టైనర్ అని కథానాయిక శ్రీలీల అన్నారు. నితిన్ తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శ్రీలీల పంచుకున్న ఆసక్తికర విషయాలు..

**అందుకే రష్మిక చేయలేదు**

''రాబిన్ హుడ్'లో నేను విదేశాల నుంచి ఇండియా వచ్చిన అమ్మాయిగా కనిపిస్తా. ఈ ప్రపంచమంతా తన చుట్టూనే ఉంటుందనే పాత్ర నాది. క్యారెక్టరైజేషన్ చాలా క్యూట్ గా ఉంటుంది. నిజానికి ఈ పాత్రను రష్మిక చేయాలి. ఆమెకు కూడా చాలా బాగా నచ్చింది. అయితే, డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. 'పుష్ప2' షూటింగ్ లో కలిసినప్పుడు 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. నాకు కూడా చాలా నచ్చి చేశా''

**మా ట్రాక్ నవ్వులే నవ్వులు..**

''నితిన్ తో పనిచేయడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆయన ఫ్యామిలీ పర్సన్ లా ఉంటారు. చాలా క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. నితిన్ తో నాది హిట్ పెయిర్ అవుతుందని నమ్మకం. ఇక వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ గారితో ట్రాక్ షూట్ చేస్తున్నప్పుడే నవ్వాగలేదు. వెన్నెల కిషోర్ కామెడీని చాలా ఎంజాయ్ చేశా. మా ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ మంచి వినోదాన్ని పంచుతాయి''

**చాలా మంచి కథలు వదులుకున్నా!**

''గతేడాది నేను చేసిన సినిమాలు వరుసగా విడుదలయ్యాయి. ఆ సినిమాల కోసం ఒక్కోరోజు నాలుగైదు షిఫ్టుల్లో పనిచేశా. అలా చేయడానికి కూడా కారణం ఉంది. అప్పుడు నేను మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. సినిమాలు పూర్తి చేసి, చదువుపై దృష్టి పెట్టడానికే అలా చేయాల్సి వచ్చింది. ఏడాదిపాటు విరామం వస్తుందని నాకు తెలుసు. ఆ సమయంలో చాలా మంచి కథలు వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు మెడిసిన్ పూర్తయింది. అయితే, కాలేజీలో కొన్ని రూల్స్ ఉంటాయి. దానికి తగ్గట్టుగా అటెండ్ అవుతున్నా''

**అలాంటి పాత్రలు చేస్తూనే ఉంటా!**

''ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో పాత్రలు గుర్తుపెట్టుకోవడం కాస్త కష్టమే. అయితే, 'భగవంత్ కేసరి'లో చేసిన విజ్జి పాప పాత్రను మర్చిపోను. దాని తర్వాత చాలా మంది అలా పిలవడం మొదలుపెట్టారు. అలా క్యారెక్టర్ పేరు గుర్తుపెట్టుకునే సినిమాలు చేయాలని ఉంది. కమర్షియల్ ఎంటర్‌టైనర్ సినిమాలు చేస్తూనే మంచి మెసేజ్ ఉన్న పాత్రలు, సినిమాలు చేయాలన్నది నా ఆకాంక్ష. తెలుగు ఇండస్ట్రీ నా ఇల్లు. బాలీవుడ్కి వెళ్లిపోవడం ఎప్పటికీ జరగదు. ప్రస్తుతం 'పరాశక్తి' చేస్తున్నా. రవితేజతో 'మాస్ జాతర'లోనూ నటిస్తున్నా. కన్నడ-తెలుగులో 'జూనియర్' సినిమా చేస్తున్నా. ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. త్వరలోనే అందుకు సంబంధించిన ప్రకటన వస్తుంది''.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.